www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

జమ్మూకశ్మీర్‌లో ఏఎఫ్‌ఎస్‌పీఏ ఉపసంహరణ?



- పరిశీలించనున్నట్లు అమిత్ షా వెల్లడి
- చట్టాన్ని ఉపసంహరిస్తే సైన్యం వెనక్కి
- శాంతి భద్రతల బాధ్యతలు కశ్మీర్ పోలీసులకే
- సెప్టెంబరుకన్నా ముందే కశ్మీర్‌లో ఎన్నికలు

11

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

బీజాపూర్ జిల్లా బాసగూడ అడవుల్లో కాల్పులు

14

- ఆరుగురు మావోయిస్టుల మృతి
- మృతుల్లో డిప్యూటీ కమాండర్ నగేశ్, సోనీ జంట.. తుపాకులు, కిట్ బ్యాగులు స్వాధీనం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం: పోలీసులు

గురువారం | 28-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 343 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా. 6.58 తదుపరి చవితి; నక్షత్రం: స్వాతి రా. 6.39 తదుపరి విశాఖ; వర్జ్యం: రా. 12.42-2.26; దుర్ముహూర్తం: ఉ. 10.19-11.18, మ. 3.11-3.59; అమృతఘడియలు: ఉ. 8.58-10.44; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.17; సూర్యాస్తమయం: 6.25 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

- అన్నదాత బాగుంటేనే రాజ్యం బాగుంటుంది. రైతు దెబ్బతిన్న రోజున రాజ్యం కూలిపోతుంది. రైతును రాజును చేసే పూచీ నాదీ! వారికి ఏటా రూ.20 వేల చొప్పున ఇస్తాం. సబ్సిడీలు, డ్రిప్ ఇరిగేషన్ తదితర పథకాలన్నీ పునరుద్ధరిస్తాం.
- ఐదేళ్లలో జగన్ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా 102 మినీ ప్రాజెక్టులను రద్దు చేశాడు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 25 ప్రాజెక్టులను రద్దు చేసిన నీచ చరిత్ర జగన్‌ది. రాయలసీమ ద్రోహి!
- జగన్ సింహాసనం కూల్చడానికి జనం సిద్ధం. రాష్ట్రానికి మంచి రోజులు వస్తున్నాయి. ఆ మంచి చేసే బాధ్యత నాది. సహకరించే బాధ్యత ప్రజలదే.

\- చంద్రబాబు

బాబు ప్రజాగళం



మదనపల్లెలో ప్రజా గళం సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న చంద్రబాబు

నొక్కింది ఎంత..
బొక్కింది ఎంత!

జనం రక్తాన్ని పీల్చే 'జలగ' సర్కార్

రూ.10 ఇచ్చి వంద దోచేసిన జగన్

- నరకాసుర పాలనకు అంతం పలకండి
- ఆలోచించి, ఆత్మసాక్షితో ఓటు వేయండి
- రాష్ట్రాన్ని ఇప్పుడే కాపాడుకోవాలి
- లేదంటే తర్వాత మన చేతుల్లో ఉండదు
- 'గొడ్డలి' కేసులో నిందితుడికి ఎంపీ టికెట్టా?
- సీఎం జగన్ రాయలసీమ ద్రోహి
- సాగునీటి రంగాన్ని నాశనం చేశాడు
- ప్రజాగళం సభలో చంద్రబాబు ధ్వజం

టీడీపీ సర్కారు వచ్చాక ప్రతి ఎకరాకూ నీళ్లిస్తాం

రతనాల సీమగా మారుస్తాం

గోదావరి జలాలనూ తెచ్చి వెలుగులు నింపుతాం

టీడీపీ అధినేత స్పష్టీకరణ

పలమనేరు, మదనపల్లె, పుత్తూరుల్లో ప్రజాగళం సభలు

పలమనేరు/పుత్తూరు/రాయచోటి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వాన్ని మార్చడానికి ఇంకా ఏడు వారాల గడువే ఉందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. రాష్ట్రాన్ని ఇప్పుడే కాపాడుకోవాలని.. లేకపోతే ఇక అది మన చేతుల్లో ఉండదని స్పష్టం చేశారు. ఇప్పటికే జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కి పోయిందన్నారు. 'సమయం లేదు మిత్రమా.. ఏడు వారాలే గడువుంది.. నా బాధ్యత నేను చేస్తా.. మీ బాధ్యత నిర్వర్తించడానికి మీరు సిద్ధమా' అని ప్రజలను ప్రశ్నించారు. బుధవారం ప్రజాగళం యాత్రను ప్రారంభించిన ఆయన తొలిరోజు చిత్తూరు జిల్లా పలమనేరు, తిరుపతి జిల్లా పుత్తూరు, అన్నమయ్య జిల్లా మదనపల్లెల్లో జరిగిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. మొన్నటి దాకా పరదాల చాటున పర్యటనలు సాగించిన ముసుగువీరుడు జగన్.. ఇప్పుడు

మిగతా 13వ పేజీలో...

ప్రజల్లో అపోహలు తొలగిస్తాం

- ఎన్డీఏ కూటమిపై నమ్మకం కలిగిస్తాం
- రఘురామరాజు సీటు వ్యవహారంలో ప్రజల అసంతృప్తిని అధినాయకత్వానికి నివేదిస్తాం
- టీడీపీ, జనసేన నేతలతో బీజేపీ

14

జగన్ ఇలాకాలో జనం రివర్స్

జగన్ మేమంతా సిద్ధం



ప్రొద్దుటూరు సభలో జగన్ మాట్లాడుతున్న సమయంలో గ్యాలరీలు ఇలా ఖాళీగా..

- 'మేమంతా సిద్ధం' అంటూ జగన్
- మేం సిద్ధంగా లేం' అని తేల్చేసిన జనం
- 1.50 లక్షలమందితో సభ అంటూ ఆర్భాటం
- ప్రొద్దుటూరుకు వచ్చింది 30 వేలలోపే
- ఇడుపులపాయ నుంచి బస్సు యాత్ర మొదలు
- బుల్లెట్ ప్రూఫ్ అద్దాల వెనుక నుంచే అభివాదం
- యాత్ర దారిలో కనిపించని ప్రజా స్పందన

13

వివేకాను ఎవరు చంపారో ఆయనకూ, దేవుడికీ తెలుసు!

- జిల్లా ప్రజలకూ తెలుసు
- బురద జల్లేందుకు చెల్లెమ్మలను పంపిస్తున్నారు
- కలియుగం కాక మరేమిటి!
- ప్రొద్దుటూరులో జగన్ ఆక్రోశం


జగన్ బస్సు యాత్ర



ఇడుపులపాయలో బస్సు యాత్ర ప్రారంభ సమయంలో జనానికి జగన్ అభివాదం

బిల్లుల కోసం బరితెగింపు

- ఆర్అండ్‌బీ ఆఫీసులో వైసీపీ వికృతకాండ
- మంత్రులు బుగ్గన, బొత్స నియోజకవర్గాలకు సంబంధించి 79 కోట్ల బిల్లులు అప్‌లోడ్
- తొలుత పైస్థాయిలో ఒత్తిళ్లు, బెదిరింపులు
- కోడ్ నేపథ్యంలో కుదరదన్న అధికారులు
- అయినా వెనక్కి తగ్గని 'కాంట్రాక్టర్లు'
- ఆర్అండ్‌బీ కార్యాలయంలోకి చొరబాటు
- సీఎఫ్ఎంఎస్‌లోకి సొంతంగానే బిల్లులు
- టోకెన్లూ జారీ.. నిధుల విడుదలే ఆలస్యం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు ఎంతో మంది కాంట్రాక్టర్లకు బిల్లులు రావాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు చెల్లించాలంటే సీఎఫ్ఎంఎస్‌లో అధికారులు అప్‌లోడ్ చేయాలి. అయితే మంత్రులు బొత్స సత్యనారాయణ (చీపురుపల్లి), బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి (డోన్) నియోజకవర్గాలు, ఇతర ప్రాంతాల్లో చేసిన పనులకు సంబంధించి బిల్లుల కోసం వైసీపీ నేతలు బరితెగించారు. చీకటి పడ్డాక తమ మనుషులను ఆర్అండ్‌బీ ఆఫీసుకు పంపి, సిబ్బందిని పక్కకు తోసి మరీ ఈ-ఆఫీస్ ద్వారా సీఎఫ్ఎంఎస్‌లో దౌర్జన్యంగా బిల్లులు అప్‌లోడ్ చేయించారు. సెంట్రల్ రోడ్ ఫండ్ (సీఆర్ఎఫ్) కింద వర్క్‌లు చేసిన ఇద్దరు కాంట్రాక్టర్లకు

మిగతా 12వ పేజీలో...

జగన్ మేనమామకు రూ.12 కోట్ల బిల్లులు

బీజేపీ అసెంబ్లీ అభ్యర్థులు వీరే

- ఒకేసారి పదిమంది పేర్లతో జాబితా విడుదల..
- విశాఖ ఉత్తరం నుంచి విష్ణుకుమార్ రాజు
- బెజవాడ వెస్ట్‌లో సుజనా, ధర్మవరంలో సత్యకుమార్



కామినేని శ్రీనివాస్ (కైకలూరు)
ఆదినారాయణ రెడ్డి (జమ్మలమడుగు)
విష్ణుకుమార్ రాజు (విశాఖ ఉత్తరం)
సుజనా చౌదరి (బెజవాడ పశ్చిమ)

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పది అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల పేర్లను బీజేపీ అధిష్ఠానం ప్రకటించింది. పొత్తులో భాగంగా ఆ పార్టీకి ఆరు లోక్‌సభ, పది అసెంబ్లీ స్థానాలు దక్కాయి. లోక్‌సభ స్థానాలకు ఇప్పటికే అభ్యర్థుల్ని ప్రకటించిన అధిష్ఠానం బుధవారం అసెంబ్లీ అభ్యర్థుల జాబితా విడుదల చేసింది. కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి, పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ ధర్మవరం నుంచి బరిలో దిగుతున్నారు. మాజీ మంత్రులు కామినేని శ్రీనివాస్ కైకలూరు, ఆదినారాయణ రెడ్డి జమ్మలమడుగు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు విశాఖ ఉత్తరం, కర్నూలుకు చెందిన ప్రముఖ దంతవైద్యుడు పార్థసారథి ఆదోని నుంచి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ఎన్.ఈశ్వరరావు ఎచ్చెర్ల నుంచి

మిగతా 13వ పేజీలో...

దాడులు చేసి.. సత్కారాలా!

- ఓవైపు బ్రాహ్మణులపై 'వైసీపీ' దాడులు
- మరోవైపు వేదపండితులకు సన్మానం
- ఉగాది పర్వదినం సందర్భంగా రూ.10,116 సంభావన, కానుకలు

3

పత్రిక కొనుగోలుకు ప్రజాధనమా?

- ప్రజాస్వామ్యంలో ఈ జీవోలు సరికాదు
- తక్షణమే ఉపసంహరించుకోండి
- ఏపీ ప్రభుత్వానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశం
- సొంత పత్రిక కొనేందుకు వలంటీర్లకు 200 ఇవ్వాలన్న జీవోపై ఎదురుదెబ్బ

14

వరి చేలో.. రయ్ రయ్



చిత్తడిగా ఉండాల్సిన వరి చేలో బైకులు నడిపిన రైతులు... నీళ్లు లేక నెర్రెలిచ్చిన పంటపొలం... కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో దుస్థితి ఇది. పంటలు ఎండుముఖం పడుతుంటే బుధవారం పొలాల్లో మోటారు సైకిళ్లు నడిపి రైతులు నిరసన తెలిపారు. తక్షణం నీరివ్వకుంటే కోతకొచ్చిన చేలు ఎండిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

\- తాళ్లరేవు



WE ARE PROUD TO BE HONOURED

VELAGAPUDI RAMAKRISHNA SIDDHARTHA ENGINEERING COLLEGE
(Autonomous)
is declared as

AN INSTITUTION DEEMED TO BE UNIVERSITY

(by Ministry of Education, GoI, Under Section 3 of UGC Act, 1956)



From now, will be known as

SIDDHARTHA ACADEMY OF HIGHER EDUCATION

A DEEMED TO BE UNIVERSITY

Vijayawada, Andhra Pradesh. www.vrsiddhartha.ac.in

We are deeply honoured to be conferred with "an institution deemed to be University" status by the Ministry of Education, Government of India. This remarkable achievement is testimony to the high standards of academic excellence that we have upheld over decades. Our mission as "an Institution deemed to be University", is to strengthen the nation by driving educational, technological and social transformation through research, innovation and technology advancement.

We extend our heartfelt gratitude to students, parents, faculty, staff, alumni, recruiters and well-wishers, who have made this great honour possible.

Approved by AICTE | VRSEC Accredited by NAAC | nirf India Rankings 2023 ENGINEERING (151-200 BAND) | ISO Certified 21001-2018 | BAND (51-100) nirf Innovation Ranking-2023

OUTCOMES SPEAK THE QUALITY | AFFORDABLE TUITION FEE | SCHOLARSHIPS FOR MERITORIOUS STUDENTS

PLACEMENT HIGHLIGHTS 2022-23

Total 1200+ in 100+ MNCs

Highest Package – Rs. 46 LAKHS Per Annum

Above **10** LPA – **057** students

Above **07** LPA – **201** students

Above **05** LPA – **446** students

SCHOOL OF ENGINEERING

UG ENGINEERING: B.Tech
- Artificial Intelligence & Data Science
- Civil Engineering
- Computer Science & Engineering
- Computer Science & Engineering (Artificial Intelligence & Machine Learning)
- Electrical & Electronics Engineering
- Electronics & Communication Engineering
- Electronics & Instrumentation Engineering
- Information Technology
- Mechanical Engineering

Can be done with
MINOR DEGREE: B.Tech
- Emerging Technologies
- Management
- Economics
- Accounting & Finance
- Psychology

PG ENGINEERING: M.Tech
- VLSI Design & Embedded Systems
- Automated Manufacturing Systems
- Structural Engineering
- Artificial Intelligence & Data Science *
- Cyber Security *

*will be started soon

SCHOOL OF MANAGEMENT
MBA
- Finance
- Marketing
- HR
- Business Analytics

SCHOOL OF ARTS & COMMERCE
- BA Honours (Economics)
- B.Com Honours (Computer Applications)
- M.Com (Accounting and Finance)

SCHOOL OF SCIENCE
- BSc Honours (Computer Science)
- MCA

SCHOOL OF LAW
- Master of Law (Corporate Law)

Admission Test (SEEE) every Sunday, Starting from 07-04-2024.
For Registration Please Visit: www.vrseconline.in/sahe

For Queries Contact : M.SRINIVAS 81216 39666, S.RAJESH 81216 38666

శ్రీవారి సేవలో జస్టిస్ చంద్రచూడ్



శ్రీవారి ఆలయంలో జస్టిస్ చంద్రచూడ్ దంపతులతో జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

తిరుమల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి తిరుమలలోని రచన అతిథిగృహానికి చేరుకున్న ఆయన బుధవారం ఉదయం ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో కలిసి మహద్వారం వద్దకు చేరుకున్నారు. శ్రీవారి ఆలయ అర్చకులు ఆయనకు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించాక అధికారులు శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, డైరీ, క్యాలెండర్, అగరబత్తులు, పంచగవ్య ఉత్పత్తులను అందజేశారు. తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్, జార్ఖండ్ మాజీ సీఎం బాబులాల్ మరాండి తదితరులు బుధవారం ఉదయం వెంకన్నను దర్శించుకున్నారు.

తిరుమలలో జస్టిస్ వెంకటరమణ కుమారుడి వివాహం



వధూవరులను ఆశీర్వదిస్తున్న శ్రీవారి ఆలయ అర్చకులు

తిరుమల, మార్చి27(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ కుమారుడి వివాహం బుధవారం తిరుమలలోని పుష్పగిరి మఠంలో వైభవంగా జరిగింది. వివాహానికి పలువురు ప్రముఖులు హాజరై వధూవరులు భాను ప్రకాష్, సౌజన్యలను ఆశీర్వదించారు. శ్రీవారి ఆలయ అర్చకులు కొత్త జంటను ఆశీర్వదించారు.

ఎన్నికల వేళ వలంటీర్లకు పెన్షన్ల బాధ్యతా?

- అందుబాటులో ఒకటిన్నర లక్షలమంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు
- అయినా వలంటీర్లకే అప్పగించిన సెర్ప్
- ఎన్నికల కోడ్ అమలుపై అనుమానాలు
- వైసీపీకి అనుకూలంగా ఓటర్లను ప్రభావితం చేస్తారనే సందేహాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వలంటీర్లంతా మనవాళ్లేనని ముఖ్యమంత్రి జగన్ సహా వైసీపీ నేతలు చెబుతున్నారు. ఎన్నికల ముందు పలు చోట్ల వలంటీర్లకు వైసీపీ అభ్యర్థులు తాయిలాలు పంపిణీ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఏప్రిల్, మే నెలల్లో సామాజిక పెన్షన్ల పంపిణీ వలంటీర్ల ద్వారానే చేయాలని ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో ఎన్నికల కోడ్ అమలుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పర్మినెంట్ ఉద్యోగులు ఒకటిన్నర లక్షల మంది ఉన్నారు. అయినా వలంటీర్ల ద్వారానే పెన్షన్లు పంపిణీ చేయాలని నిర్ణయించడం వెనుక ప్రభుత్వ పెద్దల ఎత్తుగడ ఉందని పలువురు అనుమానిస్తున్నారు. గత ఐదేళ్లుగా పెంచి పోషిస్తున్న వలంటీర్ల ఆధ్వర్యంలో ఎన్నికల ముందు చివరి రెండు నెలలు పెన్షన్ పంపిణీ చేయకపోతే అధికార పార్టీ నష్టపోతుందన్న ఆందోళనతో ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఆయా కుటుంబాల వద్దకు వెళ్లి వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్న వలంటీర్లు ఉదయం పెన్షన్ ఇచ్చి మధ్యాహ్నం వైసీపీ అభ్యర్థులకు ఓట్లేయాలని ప్రభావితం చేస్తారని పలువురు అనుమానిస్తున్నారు. ఓటర్లపై ఎలాంటి ప్రభావం పడకుండా పెన్షన్లు పంపిణీ చేయాలంటే ప్రభుత్వ ఉద్యోగులకు ఆ బాధ్యత అప్పగించాలి. ఒకటిన్నర లక్షల మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉన్నారు. వారంతా ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులు. ప్రతి సచివాలయంలో 8 మంది నుంచి 14 మంది దాకా ఉద్యోగులు ఉన్నారు. పెన్షన్లు పంపిణీ సచివాలయ ఉద్యోగుల ద్వారా చేపట్టడం వల్ల వారికి జవాబుదారీ ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులైనందున ఎన్నికల కోడ్ అతిక్రమించే అవకాశం ఉండదు. వలంటీర్లకు అలాంటి బాధ్యత ఉండదు. సీఎం జగన్, ఆ పార్టీ అభ్యర్థులందరూ ఎన్నికల్లో వలంటీర్లను నమ్ముకున్నారు. ఎన్నికల్లో సహకరించి, ఓట్లు వేయించాలని పలువురు అభ్యర్థులు వారికి మిక్సీలు, కుక్కర్లు వంటి విలువైన కానుకలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో వలంటీర్లకే పెన్షన్లు పంపిణీ బాధ్యతలు అప్పచెప్తే ఎన్నికల కోడ్ నిష్పాక్షికంగా ఎలా అమలవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. వలంటీర్లతోనే పెన్షన్ పంపిణీ చేయించాలన్న రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాన్ని ఎన్నికల కమిషన్ కూడా అంగీకరించడంతో ఎన్నికల కోడ్ యథేచ్ఛగా ఉల్లంఘించే అవకాశం ఉందని అంటున్నారు. మే 13న ఎన్నికలు ఉండటంతో రాజకీయ పార్టీలన్నీ ప్రచారాన్ని ఉధృతం చేస్తాయి. అలాంటి సమయంలో వలంటీర్ల ముసుగులో ఉన్న వైసీపీ కార్యకర్తలు పెన్షన్లు పంపిణీ చేస్తే కచ్చితంగా వివాదాలు తలెత్తుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే చాలా చోట్ల వలంటీర్లు వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల వేళ వారు పెన్షన్లు పంపిణీ చేస్తే ఓటర్లను ప్రభావితం చేసే అవకాశముంది.

వలంటీర్లకే బాధ్యత: సెర్ప్

ఏప్రిల్, మే నెలల్లో పెన్షన్లను వలంటీర్లు ఆథరైజేషన్ లెటర్స్‌తో పంపిణీ చేయాలని సెర్ప్ సీఈఓ సర్క్యులర్ జారీచేశారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా పెన్షన్ నిధులను తీసుకెళ్లే గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్ల వద్ద ఆథరైజేషన్ పత్రం తప్పని సరిగా ఉండాలని పేర్కొన్నారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ కార్యదర్శులు ఆథరైజేషన్ ఇవ్వాలని ఆదేశించారు. పెన్షన్లు పంపిణీ చేసే సమయంలో వలంటీర్లు ఎలాంటి ప్రచారం నిర్వహించకూడదని ఆదేశించింది. పెన్షన్ పంపిణీ చేసినట్లుగా ఫొటోలు, వీడియోలు తీయవద్దని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లయితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

హైకోర్టులో ఏసీల ఏఎంసీ కోసం టెండర్ నోటిఫికేషన్

అమరావతి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో డైకిన్, మిత్సుబిషి కంపెనీలకు చెందిన క్యాసెట్/స్ప్లిట్ ఎయిర్ కండీషనర్ల (ఏసీ) వార్షిక నిర్వహణ కాంట్రాక్ట్(ఏఎంసీ) కోసం స్థానిక డీలర్లు, ఏజెన్సీల నుంచి కొటేషన్లను ఆహ్వానిస్తూ హైకోర్టు రిజిస్ట్రీ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆసక్తి కలిగిన బిడ్డర్లు ఏప్రిల్ 4 సాయంత్రం 5 గంటల లోగా కొటేషన్స్‌ను సీల్డ్ కవర్‌లో సమర్పించాల్సి ఉంటుందని పేర్కొంది. టెండర్ నోటిఫికేషన్‌కి సంబంధించి మరిన్ని వివరాలు ఏపీ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని రిజిస్ట్రార్ మేనేజ్‌మెంట్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగించొద్దు

- ఇంధన శాఖకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం

వేసవి కాలం, విద్యార్థులకు పరీక్షల సమయం దృష్ట్యా రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఇంధనశాఖ అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలో విద్యుత్ సరఫరా పరిస్థితులపై బుధవారం ఆయన ఇంధనశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ప్రస్తుత వేసవి, విద్యార్థులకు పరీక్షల దృష్ట్యా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా గృహ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా మంచినీటి సరఫరా పథకాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. విద్యుత్ ఫిర్యాదులకై టోల్ ఫ్రీ నంబర్ 1912ను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ రాష్ట్రంలోని విద్యుత్ సరఫరా పరిస్థితులను వివరించారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా పనిచేయాలి

- బీజేపీ విస్తారక్‌లకు పురందేశ్వరి సూచన

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రజల్లోకి పార్టీని విస్తరించేందుకు ఇన్ని రోజులు చేసిన పని ఒక ఎత్తయితే, ఎన్నికల వేళ ఎంతో అప్రమత్తంగా పనిచేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో బుధవారం పార్టీ విస్తారక్‌లతో ఎన్నికల ఇంచార్జి అరుణ్ సింగ్, సహ ఇంచార్జి సిద్ధార్థ్ నాథ్ సింగ్, జాతీయ కార్యదర్శి సత్య కుమార్ సమావేశమయ్యారు. ఎన్నికల్లో ఇతర రాష్ట్రాల్లో బీజేపీ అనుసరించిన వ్యూహాలు, ఏపీలో పరిస్థితులకు అనుగుణంగా చేయాల్సిన పనులు కేడర్‌కు వివరించారు.

గ్రూప్-1 అప్పీళ్లపై విచారణ 18కి వాయిదా

- అప్పటి వరకూ మధ్యంతర ఉత్తర్వులు పొడిగింపు

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ కేసులో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీళ్లపై విచారణ ఏప్రిల్ 18కి వాయిదా పడింది. ఇప్పటికే ఉద్యోగాలు చేసుకుంటున్న 167 మందిని తొలగించవద్దని ఇటీవల ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు 18 వరకూ పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ ఎన్.హరినాథ్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది.

రాష్ట్రాభివృద్ధికి కూటమి అభ్యర్థులే గెలవాలి

- వైసీపీ హయాంలో మట్టి తిన్నారు
- మనుషులను చంపారు.. రాష్ట్రాన్నీ మింగేస్తున్నారు
- సంక్షేమ వారధి ఎప్పటికీ టీడీపీనే
- రెండో రోజు 'నిజం గెలవాలి' యాత్రలో భువనేశ్వరి



కృష్ణా జిల్లా బాపులపాడు మండలం బిళ్లనపల్లిలో ఎదురువాడ కిరణ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న భువనేశ్వరి, పక్కన యార్లగడ్డ వెంకట్రావు

ఏలూరు/టి.నరసాపురం/పెంటపాడు/నిడమర్రు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార పార్టీ పేద ప్రజల నోట మట్టి గొట్టి, పొట్టగొట్టి సర్వం దోచుకుందని, రాష్ట్ర భవిష్యత్‌కు తిరిగి పునాది పడాలంటే ఉమ్మడి కూటమి అభ్యర్థులనే గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని నారా భువనేశ్వరి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, రాష్ట్రాన్ని గంజాయి రాజధానిగా మార్చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రెండో రోజు బుధవారం 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా టి.నరసాపురం, తాడేపల్లిగూడెం, పెంటపాడు, నిడమర్రు మండలాలు, అనంతరం కృష్ణాజిల్లా బాపులపాడు మండలంలో ఆమె పర్యటించారు. చంద్రబాబు అరెస్టయినప్పుడు మృతి చెందిన టీడీపీ కార్యకర్తలు అబ్బదాసరి కృష్ణ, తాడేపల్లి శేఖర్, కోడి అప్పారావు, గొర్రి సుబ్బారావు, ఎదురువాడ కిరణ్, ఎదురువాడ బసవరావు కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పక్షం మట్టి తినేస్తుందని, మనుషులను చంపేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వైసీపీ రాష్ట్రాన్ని గంజాయి కేంద్రంగా మార్చేసిందని, యువతను మత్తులో ముంచేసిందని దుయ్యబట్టారు. పేదల సంక్షేమాన్ని ఆశించే అప్పట్లో అన్న ఎన్టీఆర్ తెలుగుదేశం స్థాపించారని, ఆయన ఆశయాలను చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నారు. ప్రజలకు సంక్షేమ వారధి ఎప్పటికీ టీడీపీనే అన్నారు. వాస్తవానికి రాష్ట్రంలో పేదలను ఆదుకునేందుకు, పట్టెడన్నం పెట్టేందుకు రాష్ట్రంలో 360 అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తే, ప్రతిరోజూ ఎంతోమంది ఆకలి తీర్చుకున్నారని, దీన్ని ఓర్వలేక అధికార వైసీపీ అన్న క్యాంటీన్లు లేకుండా చేసిందని, పేదల పొట్టకొట్టారని భువనేశ్వరి మండిపడ్డారు. ఒకప్పుడు డ్వాక్రా సంఘాలకు చంద్రబాబు రూపకల్పన చేసి మహిళలకు స్వయంప్రతిపత్తి కల్పించే ప్రయత్నం చేశారని, ప్రతి వర్గాన్ని గుర్తు పెట్టుకుని వారి సంక్షేమానికి సరికొత్త దారులు చూపించారన్నారు. కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం ఎప్పుడూ అండగా ఉంటుందని, ఆ కారణంగానే దేనికైనా తట్టుకుని నిలబడగల శక్తి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు లభించిందన్నారు. ఆమె వెంట ఏలూరు లోక్‌సభ స్థానం టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, కన్వీనర్లు బొరగం శ్రీనివాస్, వలవల బాబ్జీ ఉన్నారు.

ఎగిరే పసుపు జెండా.. ఎదురేలేని ఎజెండా

- గీతాన్ని ఆవిష్కరించిన భువనేశ్వరి



మూల్పూరి సాయికళ్యాణి రూపొందించిన ప్రత్యేక వీడియో గీతాన్ని ఆవిష్కరిస్తున్న భువనేశ్వరి

హనుమాన్‌జంక్షన్ రూరల్, మార్చి 27: టీడీపీ శ్రేణులపై, అమరావతి మహిళా రైతులపై విచక్షణా రహితంగా జరిగిన దాడులు, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, యువనేత లోకేశ్ హావభావాలతో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి ఆధ్వర్యంలో రూపొందించిన వీడియో, ఆడియో గీతాన్ని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి బుధవారం ఉదయం ఆవిష్కరించారు. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలోని కె-కన్వెన్షన్ వద్ద భువనేశ్వరి ఎగిరే పసుపు జెండా.. ఎదురేలేని ఎజెండా అనే గీతాన్ని ఆవిష్కరించారు. వీడియో ఆవిష్కరణ అనంతరం ల్యాప్‌టాప్‌లో గీతం ఆసాంతం భువనేశ్వరి తిలకించారు. ఈ ప్రత్యేక గీతం టీడీపీ శ్రేణుల్లో సమరోత్సాహం పెంపొందించే విధంగా రూపొందించారంటూ సాయికళ్యాణిని అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి కోనేరు నాని తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో విశాఖకు కొత్త విమాన సర్వీసులు

- ఢిల్లీ, హైదరాబాద్‌కు అదనపు విమానాలు
- 9 నుంచి బ్యాంకాక్‌కు.. 26 నుంచి కౌలాలంపూర్ సర్వీసు

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయంలో గత నాలుగు నెలలుగా జరుగుతున్న రన్ వే రీ సర్ఫేసింగ్ పనులు పూర్తి కావడంతో విమానాల రాకపోకలపై నేవీ ఆంక్షలను తొలగించింది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 24/7 రాకపోకలకు అవకాశం కల్పిస్తామని విమాన సంస్థలకు ముందుగానే తెలియజేయడంతో వేసవి షెడ్యూళ్లను రూపొందించాయి. ప్రస్తుతం విశాఖ విమానాశ్రయానికి రోజుకు 30 విమానాలు రాకపోకలు సాగుతున్నాయి. ఏప్రిల్‌లో మరో నాలుగు అదనపు సర్వీసులు రానున్నాయి. ఇందులో ఒకటి ఢిల్లీకి, మరొకటి హైదరాబాద్‌కు నడవనున్నాయి. రాత్రి సమయాల్లో ఈ రెండు నగరాల నుంచి రాకపోకలకు సర్వీసులు అవసరం ఉందని విశాఖ విమాన ప్రయాణికుల సంఘం కోరడంతో ఆ మేరకు అనుకూల సమయాల్లో కొత్త సర్వీసులు ప్రారంభించనున్నారు. హైదరాబాద్ నుంచి ఓ విమానం రాత్రి 10.55 గంటలకు ఇక్కడకు వచ్చి తిరిగి 11.35 గంటలకు బయలుదేరి వెళుతుంది. అలాగే ఢిల్లీ విమానం రాత్రి 8.10 గంటలకు విశాఖ వచ్చి తిరిగి 8.55 గంటలకు బయలుదేరి వెళుతుంది.

అంతర్జాతీయ సర్వీసులు

కరోనాకు ముందు మలిండో విమాన సంస్థ మలేసియాకు సర్వీసులు నడిపింది. ఆ తరువాత నిలిపివేసింది. ఇప్పుడు ఎయిర్ ఏషియా సంస్థ ఏప్రిల్ 26వ తేదీ నుంచి కౌలాలంపూర్ (మలేసియా)కు విమానాలు నడుపుతామని తెలిపింది. ఈ విమానం రాత్రి 9.30 గంటలకు ఇక్కడికి వచ్చి తిరిగి 10 గంటలకు బయలుదేరి వెళుతుంది. థాయ్‌ల్యాండ్ (బ్యాంకాక్)కు విమానం ఏప్రిల్ 9వ తేదీ నుంచి మొదలవుతుంది. వారానికి మూడు రోజులు (మంగళ, గురు, శనివారం) ఈ విమాన సర్వీసు అందుబాటులో ఉంటుంది. బ్యాంకాక్ నుంచి రాత్రి రాత్రి 11.20 గంటలకు విశాఖపట్నం వస్తుంది. ఇక్కడి నుంచి అర్ధరాత్రి 11.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 4.15 గంటలకు బ్యాంకాక్ చేరుతుంది.

దాడులు చేసి.. సత్కారాలా!

- ఓవైపు బ్రాహ్మణులపై వైసీపీ నేతల దాడులు
- మరోవైపు అర్చకులు, వేదపండితులకు సన్మానం
- ఉగాది సందర్భంగా రూ.10,116 సంభావనతో పాటు కానుకలు

అమరావతి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు అర్చకులపై ఎడాపెడా దాడులు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు జరగడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు బ్రాహ్మణులను మచ్చిక చేసుకునేందుకు వైసీపీ ప్రభుత్వం అర్చకులు, వేద పండితుల్ని సత్కరించాలని నిర్ణయించింది. ప్రతి జిల్లాలో దేవదాయశాఖ పరిధిలోని 6 ఏ, బీ, సీ దేవాలయాల్లో పని చేసే 62 సంవత్సరాలు దాటిన నిష్ణాతులైన ఇద్దరు అర్చకులను, ఒక వేద పండితుడిని గుర్తించి ఉగాది పర్వదినం సందర్భంగా సత్కరించాలని దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. ఆ శాఖ జిల్లా అధికారులకు కొన్ని సూచనలు చేశారు. ఉగాది వేడుకలను ఎన్నికల మోడల్ కోడ్ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 9వ తేదీన ఉగాది పురస్కారాల్లో భాగంగా ఎంపిక చేసిన ఇద్దరు అర్చకులు, వేదపండితుడికి రూ.10,116 సంభావనతో పాటు శాలువా, నాణ్యత గల కాటన్ పంచె, కండువా, ఒక బుట్టలో పండ్లు, ప్రశంసా పత్రాన్ని జిల్లా కలెక్టరుతో ఇప్పించాలని ఆదేశించారు. వీరితో పాటు 6 ఏ సంస్థల దేవాలయ కార్యనిర్వాహణాధికారులు కూడా ఇద్దరు అర్చకులను, ఒక వేదపండితుడిని సంస్థ నిధులతో సత్కరించాలని సూచించారు. 6 ఏ ధార్మిక సంస్థలు కూడా పై నిబంధనలకు అనుగుణంగా జిల్లా దేవదాయ శాఖ అధికారి సూచించిన దగ్గరలోని బీ, సీ కేటగిరి దేవాలయాల్లో పనిచేసే ప్రముఖ అర్చకులను సన్మానించాలని పేర్కొన్నారు.

కుట్ర పూరితంగానే వైసీపీ దాడులు..

- టీడీపీ బ్రాహ్మణ సమితి నేతల ఆగ్రహం

విజయవాడ(విద్యాధరపురం), మార్చి 27: వైసీపీ పాలనలో బ్రాహ్మణ సమాజాన్ని అణగదొక్కేస్తున్నారని, బ్రాహ్మణులపై వైసీపీ నేతలు కుట్రపూరితంగా దాడులు చేస్తున్నారని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ఈమని సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం విజయవాడలోని ఎన్టీఆర్ భవన్‌లో జిల్లా బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ కె. శివశర్మతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ సీఎం అయినప్పటి నుంచి రాష్ట్రంలో బ్రాహ్మణులపై దాడులు పెరిగాయన్నారు. దేశంలో తొలిసారి చంద్రబాబు హయాంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుకు రూ.500 కోట్ల నిధులను కేటాయించారని తెలిపారు. బ్రాహ్మణుల సంక్షేమానికి రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చిన జగన్ రూపాయి కూడా ఇవ్వలేదన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న జస్టిస్ చలమేశ్వర్

వివేకంతో ఓటు హక్కు వినియోగించుకోవాలి

- సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

విజయవాడ (ధర్నాచౌక్), మార్చి 27: ప్రజలు పూర్తి విషయ పరిజ్ఞానంతో వివేకంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడు మాత్రమే ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం అవుతుందని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. "ప్రజాస్వామ్యం- ఓటు హక్కు ప్రాధాన్యత" అనే అంశంపై సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలు గౌరవంగా, హుందాగా జీవించేందుకు రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగాన్ని లిఖించారన్నారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన అతి ముఖ్యమైన హక్కు అన్నారు. విమర్శను సహించని వాడు ప్రజాస్వామ్యవాది కాదన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు గ్రామ సభల నుంచి పార్లమెంట్ వరకు రాజ్యాంగంపై పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే సుపరిపాలనకు నాంది పలుకుతుందన్నారు. సంఘం అధ్యక్షుడు జస్టిస్ భవానీప్రసాద్ మాట్లాడుతూ సామాన్య ప్రజానీకం డబ్బు ఇతర ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధం ఆగాలి!

గాజాలో ఇజ్రాయెల్ మారణకాండ మొదలైన ఐదున్నర నెలలకు ఐక్యరాజ్యసమితి భద్రతామండలి అక్కడ తక్షణకాల్పుల విరమణను డిమాండ్ చేస్తూ తొలిసారిగా తీర్మానాన్ని ఆమోదించింది. భద్రతామండలిలో ప్రతీ తీర్మానాన్ని వీటో చేస్తూ ఇజ్రాయెల్‌ను రక్షించుకొస్తున్న అమెరికా మొన్న సోమవారం ఈ తీర్మానం సందర్భంగా ఓటింగ్‌కు దూరమై దానిని నెగ్గనిచ్చింది. రమ్‌జాన్ మాసాన్ని పురస్కరించుకొని తక్షణమే కాల్పులను విరమించాలని, తన వద్ద ఉన్న బందీలను హమాస్ విడిచిపెట్టాలని, ఒక దీర్ఘకాలిక, సుస్థిర కాల్పులవిరమణకు వీలుకల్పించే వాతావరణం ఏర్పడాలని ఈ తీర్మానం కోరింది. అల్జీరియా నేతృత్వంలో స్విట్జర్లాండ్ వంటి కొన్ని దేశాల సమష్టికృషితో రూపొందిన ఈ తీర్మానానికి అమెరికా అడ్డుతగలకపోవడం ఒక విశేషమైతే, బ్రిటన్ సైతం ఈ మారు భిన్నంగా వ్యవహరించి, తీర్మానానికి అనుకూలంగా ఓటువేయడం మరో వింత.

ముప్పైరెండువేలమంది మరణించి, డెబ్బయ్‌ఐదువేలకుపైగా గాయపడి, గాజా పూర్తిగా నేలమట్టమై, 90శాతం ప్రజలు వలసపోయిన తరువాత, పవిత్రమాసంలోనైనా కాల్పులు కాస్తంత ఆపండంటూ ఈ తీర్మానం ముందుకు వచ్చింది. అడ్డుపడకుండా దానిని నెగ్గనిచ్చినందుకు అమెరికా మీద ఇజ్రాయెల్‌కు ఎంతో కోపం వచ్చింది. సీనియర్ మంత్రులతో కూడిన బృందంతో అమెరికా వెడదామనుకున్న నెతన్యాహూ ఇందుకు నిరసనగా తన పర్యటన రద్దుచేసుకున్నారు. ఈ తీర్మానానికి నాలుగురోజుల ముందు అమెరికా స్వయంగా కాల్పుల విరమణను ప్రతిపాదిస్తూ భద్రతామండలిలో ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అయితే, అందులో అమెరికా వాడిన భాష ప్రపంచాన్ని తప్పుదోవపట్టించేట్టుగా ఉందంటూ రష్యా, చైనాలు దానిని వీటో చేశాయి. గాజాయుద్ధం విషయంలో అమెరికా ఆత్మరక్షణలో పడిందని ఈ పరిణామాలు తెలియచెబుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం, గాజా తరహాలోనే మరో భయానకమైన ఊచకోతకు ఇజ్రాయెల్ సిద్ధపడుతూండటం. దాదాపు 15లక్షలమంది పాలస్తీనియన్లు కొంతలోకొంత సురక్షితంగా ఉంటున్న రఫా పట్టణంలోకి ఇజ్రాయెల్ సైన్యం చొరబడబోతున్నట్టు నెతన్యాహూ సహా ఆయన మంత్రులంతా ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. గాజా యుద్ధం లక్ష్యం నెరవేరాలంటే తీవ్రవాదుల ఏరివేత కార్యక్రమం పరిపూర్ణంగా జరగాలని, రఫా నగరాన్ని జల్లెడపట్టినప్పుడు మాత్రమే ఆ ప్రక్షాళన పూర్తవుతుందని ఇజ్రాయెల్ నాయకులు వాదన. ఇందుకు ప్రతిగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ రఫాలో కాలూనితే అమెరికా సాయం ఆగిపోతుందన్న తరహాలో హెచ్చరికలు చేయడమూ చూశాం. కానీ, ఆ హెచ్చరికలనూ, సలహాలనూ బేఖాతరుచేస్తూ నెతన్యాహూ తాను అనుకున్నది చేసుకుపోతున్నారు. అనతికాలంలోనే రఫా నేలమట్టం కాబోతున్నదని అక్కడ సాగుతున్న వైమానికదాడులు స్పష్టంచేస్తున్నాయి. సైన్యం ప్రత్యక్షంగా నగరంలోకి అడుగుపెడితే ఆ విధ్వంసం ఇక ఊహకు కూడా అందనంతగా ఉంటుంది. రఫా నగరాన్ని దురాక్రమించుకొనే ఆలోచనలో బెంజమీన్ ఉన్నారని అందరికీ తెలుసు.

ఈ నేపథ్యంలోనే, భద్రతామండలిలో తక్షణ కాల్పుల విరమణ తీర్మానాన్ని నెగ్గనిచ్చి, నెతన్యాహూ భవిష్యత్తు చర్యలతో తనకు ఏ సంబంధం లేదని అమెరికా ప్రపంచాన్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నట్టుంది. తాను ఎంతగా ప్రయత్నిస్తున్నా నెతన్యాహూ ఆగడం లేదని చెప్పుకోవడం అమెరికా ఉద్దేశం కావచ్చు. భద్రతామండలి ఈ తీర్మానాన్ని ఆమోదించిన ఇరవైనాలుగు గంటల్లోనే అమెరికా, ఇజ్రాయెల్ రక్షణమంత్రులు భేటీ అయి, రఫాలో ఇజ్రాయెల్ ఎంత జాగ్రత్తగా అడుగులువేయాలో, తీవ్రవాదులను మాత్రమే చంపుతూ, సామాన్యులమీద ఈగవాలనీయకుండా ఎలా వ్యవహరించాలో చర్చించారట. ప్రజల ప్రాణాలు, మానవతాసాయం అంటూ అమెరికా రక్షణమంత్రి ఎన్ని కబుర్లు చెప్పినప్పటికీ, హమాస్ ఉగ్రవాదుల అంతమే తమపంతమనీ, అందుకు ఎంతదూరమైనా వెడతామంటూ ఇజ్రాయెల్ రక్షణమంత్రి చేసిన వ్యాఖ్యలు పరిస్థితిలో ఏ మార్పూ రాలేదనడానికి నిదర్శనం. రఫాలో ఇజ్రాయెల్ చొరబాటును ఆపే ఉద్దేశం అమెరికాకు ఎంత మాత్రం లేదు. రేపు అది ఆ పట్టణాన్ని భస్మీపటలం చేస్తున్నా, ప్రజలను ఊచకోత కోస్తున్నా అమెరికా హితవులు చెబుతూంటుంది, ఆగ్రహాలు ప్రకటిస్తుంది తప్ప దానిని నిలువరించదు. గాజా దృశ్యాలను ప్రపంచమంతా చూస్తోంది, యుద్ధాన్ని ముగించాలి అని ట్రంప్ కూడా ఓ పక్కన సణుగుతూ ఉంటారు. ఇజ్రాయెల్‌కు తమ పాలకులు హద్దూపద్దూలేని సాయం అందిస్తూండటం మీద అధికశాతం అమెరికన్లు గుర్రుగా ఉన్నారని కూడా సర్వేలు చెబుతున్నాయి. అమెరికాకు చిత్తశుద్ధి గనుక ఉంటే, భద్రతామండలి తీర్మానాన్ని ఆచరణలోకి తెచ్చేవిధంగా ఇజ్రాయెల్‌మీద ఒత్తిడి తేవాలి.

వాక్ స్వాతంత్ర్యంపై పెరుగుతున్న అసహనం



ఇటీవలి కాలంలో పెరుగుతున్న మతపరమైన అసహన సంస్కృతికి అనుగుణంగా ఒక ప్రణాళిక ప్రకారం రూపొందించబడిన కొన్ని మతోన్మాద శక్తులు సోషల్ మీడియానీ, ఇతర సాధనాలనూ దుర్వినియోగం చేస్తూ, స్త్రీల పట్ల అశ్లీలమైన, అసభ్యకరమైన భాషను వాడుతూ ప్రగతిశీల మహిళా మేధావులను, రచయిత్రులను, జర్నలిస్టులను, ఏక్టివిస్టులను, కళాకారులను లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియాలో నీచమైన దాడులు చేస్తున్నాయి. వీరు వినియోగించే పద్ధతులు, వాడే భాష వీరి నేపథ్యాన్నీ, మేధాస్థాయినీ, నేర ప్రవృత్తినీ వెల్లడిస్తున్నాయి. తమ ఆలోచనలతో ఏకీభవించకుండా, భిన్నమైన ఆలోచనలు కలిగినవారి నోళ్లు మూయించే అనాగరిక, అమానుష చర్యలకు పాల్పడుతున్నారు. సహజంగానే ఈ రకమైన దాడి ప్రధానంగా స్త్రీల మీదనే ఎక్కువగా జరుగుతున్నది. స్త్రీలు దేశంలో ఏర్పడుతున్న మత, రాజకీయ పరిణామాల గురించి ఆలోచించడం, తమ భావాలను వ్యక్తపరచడం ఈ అప్రజాస్వామిక, సంప్రదాయ వాద సమర్థక ముఠాలకు నచ్చదు. స్త్రీలు తమ ఇష్టాలకు అనుగుణంగా కట్టు, బొట్టు, వేష, భాష ధారణలు చేసినప్పుడల్లా ఈ అరాచకులు రంగంలోకి దిగి వ్యక్తిగతంగా కాల్ చేసి, తలుచుకుంటే వారి ఇళ్లపై దాడులు చేయగలమని, ప్రాణ హాని తలపెట్టగలమని బెదిరింపులకు పూనుకుంటున్నారు. ఈ అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక ధోరణులను మేము నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నాం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (ఏ) ఈ దేశ పౌరులందరికీ వాక్ స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది. ఫలానా విధంగా అభిప్రాయాలు వ్యక్త పరచకూడదని, ఫలానా విధంగానే బతకాలని శాసించడం రాజ్యాంగ విరుద్ధం. ఈ ప్రాథమిక హక్కుని ప్రభుత్వంతో బాటు ఎవరూ హరించ డానికి వీలులేదు. ఈ విధంగా బెదిరింపులకు, దాడులకు పాల్పడే శక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ వర్గాలను, పోలీసు వ్యవస్థను కోరుతున్నాం.

ప్రజాస్వామిక సంస్థలు, వేదికలు: ప్రొ.జి. లక్ష్మణ్ (పౌరహక్కుల సంఘం, తెలంగాణ); ఎస్. జీవన్ కుమార్ (మానవ హక్కుల వేదిక, తెలం గాణ, ఆంధ్ర రాష్ట్రాలు); అరసవిల్లి కృష్ణ, రివేరా (విరసం); శ్రీదేవి(చైతన్య మహిళా సంఘం); విజయ భండారు (హైదరాబాద్ విమెన్ రైటర్స్ ఫోరమ్); పసునూరి రవీందర్ (సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్); కె. శ్రీనివాసాచారి (హైదరాబాద్ హ్యూమనిస్ట్ మీట్); రేణుకా అయోల, తూముచర్ల రాజారాం (సంతకం సాహిత్య వేదిక); ఐకా బాలాజీ (మంచి సినిమా గ్రూపు); బి. గిరిజ (వాయిస్ ఫర్ జెండర్ జస్టిస్); కొండవీటి సత్యవతి (భూమిక); అమరేంద్ర దాసరి (సాహితీవేదిక, ఢిల్లీ); డా. బైరి నరేష్ (మూఢనమ్మకాల నిర్మూలన సంఘం); మహిళా మరియు ట్రాన్స్ జండర్ సంస్థల ఐక్య కార్యాచరణ వేదిక; ఖలీదా పర్వీన్, ఉష (సన్నిహిత); వి. సంధ్య (POW); సజయ, సుమిత్ర (అంకురం); వంగపల్లి పద్మ (వాయిస్ ఆఫ్ ద పీపుల్); కన్నెగంటి రవి (రైతు స్వరాజ్యవేదిక); గీతాంజలి (వెన్నెల సాహిత్య సామాజిక అధ్యయన వేదిక).

కవులు, రచయితలు, కార్యకర్తలు, విలేకరులు, న్యాయవాద నిపుణులు: అఫ్సర్, నారాయణ స్వామి, డా. సి. మృణాళిని, గోగు శ్యామల, విమల, ప్రసాదమూర్తి, అరణ్యకృష్ణ, వెంకటకృష్ణ, దొంతం చరణ్, నరేష్ సూఫీ, అరుణాంక్ లత, ఓల్గా, అక్కినేని కుటుంబరావు, పి. సత్యవతి, కొండేపూడి నిర్మల, ప్రతిమ, ఉదయమిత్ర, ఎ.కె. ప్రభాకర్, నల్లూరి రుక్మిణి, తేళ్ళ అరుణ, అపర్ణ తోట, శివలక్ష్మి, లక్ష్మీ సుహాసిని, కత్తి పద్మ, సీతా కంభంపాటి, శాంతి ప్రబోధ, అమరవాది నీరజ, గుత్తా జ్యోత్స్న, చల్లా సరోజినీ దేవి, బెల్లపు అనురాధ, చలం జీ.ఎస్, దుర్గా డింగరి, ఘంటసాల నిర్మల, పైడిమర్రి గిరిజ, జయలక్ష్మి, సమ్మెట ఉమాదేవి, మంజుల, రోహిణి వంజారి, రాజ్యలక్ష్మి, శ్రీదేవి, నాంపల్లి సుజాత, మెర్సీ మార్గరెట్, కాత్యాయిని కె, సంధ్య కె, వివి జ్యోతి, గోపరాజు సుధ, రూపా రుక్మిణి, సురేఖ, శీలా సుభద్రా దేవి, శిలాలోలిత, ఆశాలత, అంబిక, రత్నా సుమతి, రుక్మిణీ రావు, మీరా సంఘమిత్ర, రచన, వైజయంతి, ఇందిర, జహాఆరా, కల్పనా కన్నాబిరన్, హేమలలిత, సావిత్రి కోల, కన్నెగంటి అనసూయ, కృష్ణ కుమారి, ఝాన్సీ, అనసూయ, సుజాత, సరోజినీదేవి, శాంతిశ్రీ బెనర్జీ, రోహిణి, డా. కె.బి సంధ్యా విప్లవ్, వాసరచెట్ల జయంతి, జ్వలిత, డా.నళిని, అరుణ, డి. భారతి, కె. ప్రవీణ్, వైష్ణవిశ్రీ, సుభాషిణి తోట, సి.హెచ్. ఉషారాణి, శోభాభట్, రోజారాణి దాసరి తదితరులు.

అవినీతి పురాణం, గురివింద కచేరీ!

కుమార్తె కవిత అరెస్టయినప్పుడు, కేసీఆర్ ఎందుకు వెంటనే స్పందించలేకపోయారు? కేజ్రీవాల్ అరెస్టును ఖండించినప్పుడు మాత్రమే కవిత పేరు కూడా చేర్చి ఎందుకు మాట్లాడారు? ఆమె అరెస్టయినప్పుడు, కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు ఈడీ అధికారులతో వాదనలు చేశారు తప్ప, అదంతా అన్యాయమని గట్టిగా జనం ముందు ఎందుకు అనలేకపోయారు? మద్యం కుంభకోణంలో కల్వకుంట్ల కవిత ప్రమేయం, ఏమంత గర్వకారణమైన అంశం కాదన్న సంకోచం ఏదైనా కేసీఆర్, ఇతర బీఆర్ఎస్ నేతల మనసులను ఆవరించిందా? ఒక కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తే వేలకొలది కేజ్రీవాల్‌లు పుట్టుకువస్తారని, అరవింద్ ఒక మనిషి కాదు, ఒక భావన అని ఆమ్ ఆద్మీపార్టీ ఎట్లా గట్టిగా అనగలుగుతోంది? దేశంకోసమే నా జీవితం అంటూ కేజ్రీవాల్ జైలు నుంచి పంపిన సందేశాన్ని ఆయన భార్య ఎట్లా సగర్వంగా దేశం ముందు చదవగలిగింది?

పై ప్రశ్నలు, ఒకే కేసులో అరెస్టయిన ఇద్దరిలో ఒకరు నైతికంగా ఎక్కువ, మరొకరు తక్కువ అని చెప్పడం కోసం కాదు. రెండు రాజకీయ సంస్థల ప్రతిస్పందనల్లో ఉన్న తేడాలను చెప్పడానికి కూడా కాదు. ఎన్నికల సందర్భంగా ఆవిష్కృతమయిన రాజకీయవాతావరణాన్ని అర్థం చేసుకోవడానికి ఆ ప్రశ్నలు పనికిరావచ్చు. పెరిగిపోతున్న కర్కశతకు, నిర్దాక్షిణ్యతకు సమాధానంగా రూపుదిద్దుకోగలిగే ప్రతికథనాలను గుర్తించడానికి కూడా సహాయపడవచ్చు.

కేసీఆర్ కనుక, మొన్నటి ఎన్నికల్లో అధికారం పోగొట్టుకోకపోయి ఉంటే, ఓడిపోయినాక మరీ ప్రస్తుత దయనీయ స్థితికి ఆయన పార్టీ చేరుకోకపోయి ఉంటే, బహుశా కవిత అరెస్టు జరిగేది కాదేమో? రేపటి కేంద్రప్రభుత్వానికి ఏ విధంగానూ ఆయన ఉపయోగపడగలిగే పరిస్థితి లేదు. ఆ నిరుపయోగత్వం నుంచే కవిత అరెస్టు సులువుగా జరిగిపోయింది. మద్యం కేసులో ఆమె కథానాయిక కాదు. సంధానకర్త వంటి పాత్రలో మాత్రమే ఆమె ఉన్నారట. కేసుకు ఆ పాత్రే కీలకం మరి. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడానికి పూర్వరంగంగా ఆమె అరెస్టు జరిగింది. ఆమెను ప్రధానముద్దాయిల్లో చేర్చి కూడా, అరెస్టు చేయకుండా ఉండే సామర్థ్యం, చాతుర్యం దర్యాప్తు సంస్థలకు ఉన్నాయి కానీ, అంతటి ఔదార్యం ప్రకటించవలసిన అవసరం ఇప్పుడులేదు. కవిత మీద కానీ, బీఆర్ఎస్ మీద కానీ కేంద్రప్రభుత్వం, బీజేపీ, మోదీషా కత్తిగట్టారనుకోవడానికి తగిన రాజకీయ వాదన చెలామణిలో లేదు. తెలంగాణ అధికార కుటుంబ సభ్యురాలై ఉండి కూడా, రాష్ట్ర రాజకీయాలలో అప్రధానమైనపాత్రలోనే మిగిలిపోయిన వ్యక్తి, ఇట్లా రాష్ట్రం దాటి దేశరాజధానిలో ఏదో ధనార్జన మార్గంలో, అది కూడా ఏమంత గౌరవప్రదం కాని మద్యం వ్యాపారంలో, ప్రమేయం పెట్టుకోవడం ప్రజలు హర్షించలేదు. కుంగి కునారిల్లినదశలో, బీఆర్ఎస్‌కు మోదీ మీద కత్తులు నూరగలిగే విలాసత్వమూ లేదు.

కేజ్రీవాల్ విషయం అట్లా కాదు. దేశమంతా గెలిచినా ఢిల్లీలో తాము గెలవలేకపోతున్నామని, ఉన్నచోట ఉండకుండా అతను ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తున్నాడని, అన్నిటికంటె మించి, 'ఇండియా కూటమి'లో భాగమయ్యాడని బీజేపీకి ఆయనంటే కోపం ఉంది. కేజ్రీవాల్ అరెస్టులో నైతిక నిష్ఠ కంటె, పగాప్రతీకారాలూ ఎక్కువని అంటే, బీజేపీ వీరాభిమానులు కూడా పెద్దగా ఖండించబోరు. 370, 400 స్థానాల లక్ష్యాలను అందుకోవడానికి కేజ్రీవాల్ ఒక అవరోధం కూడా కావచ్చు. ఇన్ని రాజకీయ కారణాలున్నంత మాత్రాన, కేజ్రీవాల్ మద్యం కుంభకోణంలో లేరని కాదు. కాకపోతే, తన మీద అభియోగం తప్పని, ఇదంతా కక్షసాధింపు అని ఆయన చెప్పుకుంటే జనం వింటారు, హేళన చేయరు. అరవింద్ కేజ్రీవాల్ అవినీతి సొమ్ము తీసుకుని, గోవా ఎన్నికల్లో ఖర్చుపెట్టారని ఈడీయే చెబుతోంది, కవిత విషయంలో ఆ రాజకీయ కారణం కూడా లేదు!



ఇప్పుడు, నైతికమయిన బెంచ్ మార్క్ లేవీ సమాజంలో లేవని, అక్కరలేదని కూడా బీజేపీ భావిస్తున్నది. నీతికబుర్లు చెప్పేవారందరూ అవినీతిపరులని నిరూపణ అయిందని, బలంగా ఉండి, దేశాన్ని దృఢత్వం వైపు తీసుకువెళ్లగలిగే తన వంటి రాజకీయ శక్తి ఉనికిలో ఉండగా మరొక ఎంపిక అవసరమే లేదని ప్రజలకు చెబుతోంది. ప్రాంతీయపార్టీలు, చిన్నపార్టీలు అన్నీ–అయితే కుటుంబ పార్టీలో లేదా అవినీతి పార్టీలో–అయి ఉంటాయని ప్రధాని తన సభల్లో పదే పదే చెబుతూ వస్తున్నారు. తను మాత్రమే ప్రజలే కుటుంబంగా జీవిస్తున్నానని చెప్పుకుంటున్నారు. ప్రజల దృష్టిలో ఈ నాయకులను పలచన చేసినంత మాత్రాన సరిపోదు కాబట్టి, ఆ పార్టీల బలాన్ని, బలగాన్ని ఛిన్నాభిన్నం చేయడానికి ఒకవైపు దర్యాప్తు యంత్రాంగాలను, మరొకవైపు రాజకీయచాణక్యాన్ని ప్రయోగిస్తున్నారు.

సమాజంలోని అన్ని రంగాలకు, ఏదో ఒక నైతికమయిన చెలియలికట్ట ఉంటుంది. కొందరు వ్యక్తుల్లో, కొన్నిచోట్లలో ఆ హద్దులకు ప్రమాణంగా ఉంటారు. రాజకీయరంగంలో ఒకప్పుడు జయప్రకాశ్ నారాయణ్, తరువాత విపి సింగ్, కొందరికి వాజపేయి, అబ్దుల్ కలాం, అట్లాగే, అన్నా హజారే.. ఆయా కాలాల్లో కొంత నైతిక ప్రభ వెలిగించారు. కారుచీకటి అనుకున్న కాలంలో కూడా జనం ఏదో ఒక ఔన్నత్యాన్ని గుర్తించి లేదా భావించి, దాన్ని ఆశగా నిలుపుకుంటారు. అన్నాహజారే పదిపన్నెండేళ్ల కిందట, ఈ కేజ్రీవాల్ తో కలిసి ఢిల్లీలో చేసిన హడావుడి, రెండో యూపిఎ ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాలు చేసింది. భ్రష్టుపట్టిపోవడానికి తగినంత అవినీతి, దుష్పరిపాలన ఆ ప్రభుత్వం చేయలేదని కాదు. నరేంద్రమోదీ వెలిగిపోవడానికి ముందు, యుపిఎ ప్రభుత్వం కేవలం చీకటియుగం మాత్రమేనని నమ్మకంగా చెప్పి, జనాల మనస్సులను సిద్ధం చేసిన కూటమి ఆ నీతిపరులదే! తాము చేసిన అవినీతి వ్యతిరేక ఆందోళన ఇంతటి నిరంకుశ పాలనను తీసుకువస్తుందని ఊహించలేదని ఒక్క యోగేంద్ర యాదవ్ మాత్రమే పశ్చాత్తాపపడ్డట్టున్నారు! తాము ఎటువంటి పర్యవసానాలకు కారణమయ్యారో, సిసోడియా, కేజ్రీవాల్ అనుభవపూర్వకంగా తెలుసుకుంటున్నారు!

ఇప్పుడు, నైతికమయిన బెంచ్ మార్క్ లేవీ సమాజంలో లేవని, అక్కరలేదని కూడా బీజేపీ భావిస్తున్నది. నీతికబుర్లు చెప్పేవారందరూ అవినీతిపరులని నిరూపణ అయిందని, బలంగా ఉండి, దేశాన్ని దృఢత్వం వైపు తీసుకువెళ్లగలిగే తన వంటి రాజకీయ శక్తి ఉనికిలో ఉండగా మరొక ఎంపిక అవసరమే లేదని ప్రజలకు చెబుతోంది. ప్రాంతీయపార్టీలు, చిన్నపార్టీలు అన్నీ–అయితే కుటుంబ పార్టీలో లేదా అవినీతి పార్టీలో–అయి ఉంటాయని ప్రధాని తన సభల్లో పదే పదే చెబుతూ వస్తున్నారు. తను మాత్రమే ప్రజలే కుటుంబంగా జీవిస్తున్నానని చెప్పుకుంటున్నారు. ప్రజల దృష్టిలో ఈ నాయకులను పలచన చేసినంత మాత్రాన సరిపోదు కాబట్టి, ఆ పార్టీల బలాన్ని, బలగాన్ని ఛిన్నాభిన్నం చేయడానికి ఒకవైపు దర్యాప్తు యంత్రాంగాలను, మరొకవైపు రాజకీయచాణక్యాన్ని ప్రయోగిస్తున్నారు.

బహుజన సమాజ్ పార్టీ నాయకురాలు మాయావతి కూడా కేసుల పద్మవ్యూహంలో చిక్కుకోవడం వల్ల మాత్రమే తన పార్టీని నిష్క్రియాత్మకం చేసుకోవలసివచ్చిందని చెబుతారు. అఖిలేశ్ యాదవ్ తల మీద కూడా అనేక కత్తులు వేలాడుతున్నాయి. మమతా బెనర్జీ 'ఇండియా కూటమి'కి ఎడంగా మెలగడానికి తగిన కేంద్ర కారణమే ఉన్నదని ఊహిస్తున్నారు. నాడు కేసీఆర్ కూడా మాటల్లో మంటలు కురిపించినా, లోలోపల భయభక్తులతో ఉండడానికి కారణాలున్నాయంటారు. జగన్ సంగతి తెలిసిందే. అట్లాగని, ఈ దండోపాయానికి అందరూ, అన్నివేళలా లొంగిపోతారని అనడానికి లేదు. కొందరు నిలబడతారు, మరికొందరు ఓపిక నశించాక తిరగబడతారు. జైలులో సుదీర్ఘకాలం గడిపినా, ఇంకా కేసులు ముగియకపోయినా, లాలూ ప్రసాద్ బేలగా మారలేదు, జనాకర్షణా కోల్పోలేదు. ఇప్పుడు అరవింద్ కేజ్రీవాల్ కూడా తన మీద జరుగుతున్న రాజకీయదాడికి కుంగిపోయేటట్టు కనిపించడం లేదు. అవినీతి వ్యతిరేక ఉద్యమం చేసి తమ ఓటమికి కారణమయిన కేజ్రీవాల్‌తో కాంగ్రెస్ తన సంబంధాలు మెరుగుపరుచుకోవడం విశేషం. 'ఆప్' విస్తరణ ప్రయత్నాలమీద బీజేపీతో సమానంగా కాంగ్రెస్ కూడా ఒకప్పుడు అసహనం చూపింది. కొంతకాలం కిందట రెండుపార్టీల మధ్య పొత్తు అసాధ్యమనిపించింది. కానీ, సర్దుబాటు చేసుకోవడంతో పాటు, ఆశ్చర్యకరంగా ఇప్పుడు ఒకరికొకరు నిలబడుతున్నారు కూడా.



■ కె. శ్రీనివాస్

సందర్భం

ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి గట్టి రాజకీయ నినాదం లేదని అంతా అంటున్నారు కానీ, భారతీయ జనతా పార్టీకి కూడా ఈ సారి నినాదాల కొరత ఉన్నది. పరివార్ వాద్, భ్రష్టాచార్ అన్నీ అయిపోయాయి. అబ్ కీ బార్ మోదీసర్కార్, ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ పోయినసారే అయిపోయాయి. చార్ సౌ కే పార్ అన్నది పర్వాలేదు కానీ, అది ప్రధాననినాదం కాలేదు. నినాదమే కాదు, రాజకీయ వాదనే లేదు. రామాలయ ప్రతిష్ఠ ఒక్కటే ఆధారపడదగ్గ ఘనతగా కనిపిస్తున్నది. సాధ్యమైనంత అధిక విజయాలను పోయినసారే సాధించినందున, ఈసారి తరుగే తప్ప పెరుగుదల ఉండదన్నది సాధారణాభిప్రాయం. అయినాసరే, సకల శక్తులను మోహరించి ఆధిక్యాధికం సాధించాలని ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే, ప్రతిపక్షం అనైతికీకరణ, నిరాయుధీకరణ. ఈ వ్యూహాన్ని గుర్తించి, అవినీతి ముద్రలను ఖాతరు చేయక, రాజకీయ దురుద్దేశ్యాలను ఎలుగెత్తి చాటడమే బాధిత పక్షాలు కనీసంగా చేయవలసింది.

కార్పొరేట్లతో తన ధనానుబంధం ఎంతటిదో తెలిసిపోయినా, పార్టీలో చేరే పేరుమోసిన అవినీతిపరులకు అభయమిస్తున్నట్టు అందరూ గుర్తించినా, బీజేపీకి ఎందుకు పరువు భయం కలగడం లేదు? అన్ని నీతులను రద్దు చేసిన చోట, బలమే నీతి, ధనమే రీతి కాబట్టి. ఉద్వేగాలు వెదజల్లి మనసులను కట్టివేసిన తరువాత, ఇంద్రజాలికులదే సర్వాధికారం కాబట్టి.

ఎన్నికల బాండ్లలో దాగిన రహస్యాలు తెలుస్తున్నప్పుడు, తన నీతి గురించి, ఇతరుల అవినీతి గురించి కేంద్రప్రభుత్వ నాయకులు ఎట్లామాట్లాడగలుగుతారని ఆశ్చర్యం వేస్తుంది. కేంద్ర అధికారపార్టీకి అందిన అనామకపు సొమ్ముతో పోలిస్తే, ఆప్ కు అందిన వందకోట్లు ఎంత? రాజకీయపార్టీలన్నీ అంతో ఇంతో బాండ్ల వీరులే కాబట్టి, పెద్ద కలకలం రాలేదు కానీ, బీజేపీ రాజకీయ సొమ్ము ఏమంత స్వచ్ఛమైనది కాదని, అది దాన దండోపాయాలతో సమకూర్చుకున్నదని బాండ్ల విశ్లేషణలు చెబుతున్నాయి. అధికారపార్టీ వేల కోట్ల అవినీతి విరాళాల మీద జాతీయమీడియా మౌనం పాటిస్తుంది. కేజ్రీవాల్ అరెస్టు కు మాత్రం ప్రైమ్ టైమ్ లన్నీ అంకితం చేస్తుంది.

కార్పొరేట్లతో తన ధనానుబంధం ఎంతటిదో తెలిసిపోయినా, పార్టీలో చేరే పేరుమోసిన అవినీతిపరులకు అభయమిస్తున్నట్టు అందరూ గుర్తించినా, బీజేపీకి ఎందుకు పరువు భయం కలగడం లేదు? అన్ని నీతులను రద్దు చేసిన చోట, బలమే నీతి, ధనమే రీతి కాబట్టి. ఉద్వేగాలు వెదజల్లి మనసులను కట్టివేసిన తరువాత, ఇంద్రజాలికులదే సర్వాధికారం కాబట్టి.

ప్రతిపక్ష నేతల నేరం అవినీతిపరులు కావడం కాదు, బలహీనులు కావడమే వారి అసలు పాపం!

సామ్యవాది, సాహిత్యాభిలాషి

ప్రముఖ పారిశ్రామికవేత్త, సామాజిక కార్యకర్త, కళాపోషకుడు, సాహితీ పోషకుడు, ప్రజా ప్రతినిధి, దాత, మార్వాడీ కుటుంబానికి చెందిన బద్రీ విశాల్ పిత్తి పూర్వీకులు రెండు వందల ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు చేరుకుని స్థిరపడ్డారు. తండ్రి పన్నాలాల్ పిత్తి నిజాం గౌరవ ఆర్థిక సలహాదారుగా వ్యవహరించారు. బద్రీ విశాల్ కలకత్తాలో 1928 మార్చ్ 28న పన్‌బాయి – పన్నాలాల్ పిత్తి దంపతులకు జన్మించారు. విద్యాభ్యాసం అలహాబాదులో సాగింది.

బద్రి విశాల్ ఇరవయ్యొక్క ఏళ్ళ వయసులోనే హైదరాబాదులో 1949 ఆగస్టులో ప్రముఖ హిందీ సాహిత్య పత్రిక 'కల్పన' ప్రారంభించారు. అది స్వల్పకాలంలో హిందీ సాహిత్యంలో ఉన్నతమైన పత్రికగా పేరు తెచ్చుకుని 1978 వరకు నిరంతరాయంగా వెలువడింది. ఎం.ఎఫ్. హుస్సేన్ చిత్రాలు తరచూ 'కల్పన' పత్రిక ముఖచిత్రంగా కనిపించేవి. ఆనాటి హిందీ రచయితలు కల్పన పత్రికలో రచనలను ప్రచురితం కావడం గొప్ప విషయంగా భావించేవారు.



సోషలిస్టు నాయకుడు రామ్ మనోహర్ లోహియాతో పరిచయం ఏర్పడిన తర్వాత బద్రీ విశాల్ ఆయన భావాలకు ప్రభావితుడై జీవితాంతం సోషలిష్టుగా ఉండిపోయారు. 1955లో సోషలిష్టు పార్టీ స్థాపనలో కీలకపాత్ర పోషించారు. 1960లో లోహియా పిలుపునిచ్చిన పౌర నిరాకరణోద్యమంలో పాల్గొని జైలుకి వెళ్ళారు. బద్రీ విశాల్ 1969లో ప్రారంభమైన ఉద్యమంలో ప్రత్యేక తెలంగాణ డిమాండ్‌కు గట్టి మద్దతు ప్రకటించారు. నిజాంతో తన కుటుంబానికున్న సాన్నిహిత్యాన్ని కూడా లెక్క చేయకుండా హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ తొలి సమావేశంలో పాల్గొని ప్రజాస్వామ్యం కోసం పిలుపునిచ్చారు. అప్పుడు కొత్తగా ఏర్పడిన మహారాజ్ గంజ్ శాసనసభ నియోజకవర్గం నుంచి బద్రీ విశాల్ 1967లో సంయుక్త సోషలిష్టు పార్టీ అభ్యర్థిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. 1972లో సంపూర్ణ తెలంగాణ ప్రజాసమితి అభ్యర్థిగా, 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా ఇదే నియోజకవర్గం నుండి రెండు సార్లు పోటీచేసి పరాజితుడయ్యారు. బద్రీ విశాల్ సోషలిష్ట్ అయినా తన రాజకీయాలకు అతీతంగా కళలను, కళాకారులను పోషించారు. ఎం.ఎఫ్.హుస్సేన్ తన ప్రసిద్ధ రామాయణం, మహాభారతం చిత్రాలను సోమాజీగూడలోని బద్రీ విశాల్ ఇంట్లో ఉంటూనే చిత్రీకరించారు. ఎం.ఎఫ్.హుస్సేన్ 1940దశకం చివరి నుండి 1970వ దశకం చివరి వరకు చిత్రించిన నాలుగు వందలకు పైగా చిత్రాలను బద్రి విశాల్ సేకరించారు. 2003 డిసెంబర్ 6న బద్రీ విశాల్ మరణానంతరం ఆయన సేకరణలో ఉన్న ఎం.ఎఫ్. హుస్సేన్ చిత్రాలు, 2013లో వేలంలో దాదాపు రూ.18కోట్లకు అమ్ముడు పోయాయి.

బద్రి విశాల్ పిత్తి జయంతి సందర్భంగా ఈ మార్చ్ 28 గురువారం 'బద్రి విశాల్ పన్నాలాల్ పిత్తి' ట్రస్ట్ నిర్వహణలో 18వ స్మారకోపన్యాసం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని కోహినూర్ హాలులో నిర్వహిస్తున్నారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఈ సభలో సుప్రీం కోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి ప్రధాన వక్తగా పాల్గొంటున్నారు.

● నందిరాజు రాధాకృష్ణ

అపూర్వ సామాజిక విప్లవానికి అంకురం

తెలుగుదేశం పార్టీ సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో ఎత్తుపల్లాలు దాటుకొంటూ చరిత్ర గతిలో తన ఉనికిని బలంగా చాటుకొంటూనే ఉంది. సంక్షోభం ఎదురైనప్పుడల్లా ముందడుగు వేస్తూనే వుంది. ఎన్టీఆర్ ఆత్మగౌరవానికి ప్రతీకైతే, చంద్రబాబునాయుడు ఆత్మవిశ్వాసానికి ప్రతిరూపంగా నిలిచారు. ఒక ఆర్థికనేరస్థుడి ఏలుబడిలో రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అరాచక, విధ్వంస పాలనకు గోరీ కట్టి తెలుగుదేశం పార్టీకి తిరిగి అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సమాయత్తం కావాలి.



కార్మికుల కరిగిన కండల్లో నుంచి, రైతు కూలీల రక్తం నుంచి, కష్టజీవుల కంటిమంటల్లో నుంచి, నిరుపేదల కన్నీటి నుంచి, అన్నార్తుల ఆక్రందనల నుంచి, శ్రామికుడి స్వేదం నుంచి, ఆడపడుచుల ఆర్తనాదాల నుంచి పుట్టిన పార్టీ తెలుగుదేశం అని ఎన్టీఆర్ చేసిన ప్రసంగం ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. 1982 మార్చి 29న ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి ప్రభంజనాన్ని సృష్టించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం ఒక చారిత్రక అవసరంగా తెలుగు ప్రజలు భావించారు. పార్టీ ఆవిర్భావానికి ముందు వరకు రాజకీయ అధికారం కొన్ని వర్గాల గుత్తాధిపత్యంలో కొనసాగింది. సమాజంలో ఆర్థిక, సాంఘిక అసమానతలకు గురవుతున్న బడుగు బలహీనవర్గాల వారికి రాజ్యాధికారం కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుంది.

రాజకీయ పద్మవ్యూహాల మధ్య, అన్నదాతల అవస్థల మధ్య, శ్రమజీవుల రెక్కల కష్టం మధ్య, తాగేందుకు నీరు, అడిగేందుకు నోరులేని అభాగ్యుల కడగండ్ల మధ్య, ప్రగతి కోసం – ప్రజాసంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాతనే తెలుగునాట ఆర్థిక, రాజకీయ, సామాజిక విప్లవం మొదలైంది. రాజకీయాలను సామాన్యుల చెంతకు చేర్చిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుంది. బూజుపట్టిన బూర్జువా వ్యవస్థను రూపుమాపి విప్లవాత్మకమైన విధానాలకు శ్రీకారం చుట్టింది ఆ పార్టీ.

ఎన్టీఆర్ రాజకీయరంగ ప్రవేశం చేసే నాటికి రాష్ట్రంలో రాజకీయ శూన్యత, అస్థిరత్వం నెలకొని ఉన్నాయి. తెలుగుజాతికి, తెలుగుభాషకు గుర్తింపు లేకుండా పోయింది. ఆనాటి ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు ఏడాదికి నలుగురు ముఖ్యమంత్రులను మారుస్తూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని హస్తినాపురంలో అణాపైసలకు అమ్మకానికి పెట్టారు. ఏ క్షణాన ఎవరు ముఖ్యమంత్రి అవుతారో, ఎవరు ఎంతకాలం ఉంటారో ఎవరికీ తెలియని పరిస్థితి దాపురించింది. ప్రజాభిప్రాయానికి తావులేకుండా సీల్డ్ కవర్లలో అభ్యర్థుల పేర్లు వచ్చేవి. అవినీతి సొమ్ము ఢిల్లీ పెద్దలకు అప్పజెప్పి పదవులు కొనుక్కునేవారు. సంక్షేమం, అభివృద్ధి కరువై దైనందిన పాలనకు రాజకీయ గ్రహణం పట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో నూతన రాజకీయ వ్యవస్థకు, కొంగొత్త సంస్కృతికి తెలుగుదేశం పార్టీ శ్రీకారం చుట్టింది. అప్పటివరకు మదరాసీలుగా గుర్తించబడిన తెలుగుజాతికి ప్రత్యేక గుర్తింపును, గౌరవాన్ని తీసుకువచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుంది.

కాంగ్రెస్ కుటిల రాజకీయాలతో దిగజారిన పాలనా ముఖచిత్రాన్ని చూసిన ఎన్టీఆర్ సింహగర్జన చేస్తూ విప్లవ శంఖారావాన్ని పూరించారు. తెలుగుజాతి ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం అనే సిద్ధాంతాలపై తెలుగుదేశం పార్టీ నిర్మితమైంది. చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా అని పిలుస్తూ ప్రజలను ఉత్సాహపరిచారు. చైతన్యరథం వేదికగా అందులో నిద్రిస్తూ, ప్రయాణిస్తూ, రోడ్డుపక్కన కాలకృత్యాలు తీర్చుకుంటూ తొమ్మిది నెలలు అవిశ్రాంతంగా పర్యటించి ప్రజలను చైతన్యపరిచారు. దేశంలో అమలవుతున్న సంక్షేమ పథకాలన్నిటికి ఎన్టీఆరే ఆద్యుడు. తెలుగుదేశం పార్టీ సృష్టించిన ప్రభంజనం రాజకీయ రంగాన్ని ఓ కుదుపు కుదిపింది. 125 మంది పట్టభద్రులు, 28 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు, 20 మంది డాక్టర్లు, 47 మంది డాక్టర్లు, 8 మంది ఇంజనీర్లు తమ అభ్యర్థులుగా రంగంలోకి దించారు. అభ్యర్థుల సగటు వయసు కూడా 47 సంవత్సరాలలోపే. యువత, విద్యావంతులు, మహిళలు, వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేశారు.

294 స్థానాలకు గాను 202 అసెంబ్లీ స్థానాల్లో తెలుగుదేశం పార్టీ విజయఢంకా మోగించింది. అహంకారానికి, ఆత్మగౌరవానికి జరిగిన పోరులో ఆత్మగౌరవం నిలిచింది, గెలిచింది. కేవలం తొమ్మిది నెలల్లోనే పార్టీని స్థాపించి, అధికారం చేపట్టి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకి ఎక్కారు. జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలను ఒకతాటిపైకి తెచ్చి కాంగ్రెస్కు ప్రత్యామ్నాయంగా నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు చేయడంలో తెలుగుదేశం పార్టీ ప్రముఖ పాత్ర వహించింది. కేంద్రంలో కనీసం అయిదు ప్రభుత్వాలు ఏర్పడటానికి, మనగలగడానికి కారణమైంది.

తెలుగుదేశం పార్టీ అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. సమాజమే దేవాలయం–ప్రజలే దేవుళ్లని నినదించిన గొప్ప మానవతావాది ఎన్టీఆర్. ఆకలిగా ఉన్న అన్నార్తులకు కిలో రూ.2కే బియ్యం అందించారు. పాలనా వికేంద్రీకరణ ద్వారా ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువచేయడానికి మాండలిక వ్యవస్థను ప్రవేశపెట్టింది. పురుషులతో సమానంగా మహిళలకు ఆస్తిలో సమానహక్కు కల్పించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 9శాతం రిజర్వేషన్, బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించారు. పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దుచేసి తెలంగాణ ప్రజలకు నిజమైన స్వేచ్ఛా స్వతంత్రాలు పంచారు. 1984లో ఎన్టీఆర్ను అప్రజాస్వామికంగా గద్దె దించినప్పుడు యావత్ తెలుగుజాతి ఒక్కతాటిపైకి వచ్చి ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని నడిపి చరిత్రలో నిలిచారు. తెలుగుదేశం పార్టీ తెలుగునాట విలక్షణ రాజకీయ వ్యవస్థగా ఏర్పడి అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, ప్రజల పక్షాన అనేక చారిత్రక ఉద్యమాలు నిర్మించింది. 22 ఏళ్ళు తెలుగు ప్రజలను పాలించింది.

సిద్ధాంతాలు, జాతీయ దృక్పథం, ఉన్నత విలువలతో 42 వసంతాలు పూర్తిచేసుకుని 43వ ఏడాదిలోకి అడుగుపెడుతోంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఎన్నెన్నో ఆటుపోట్లను, మరెన్నో సంక్షోభాలను, కుట్రలు, కుతంత్రాలను తట్టుకుని సమున్నతంగా నిలబడింది. సంక్షోభం ఎదురైనప్పుడల్లా రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు చేరువైంది. సంక్షోభాల నుంచి అవకాశాలను వెతుక్కుంటూ ముందుకుసాగింది.

విభజిత ఆంధ్రప్రదేశ్ లో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన ఘనత తెలుగుదేశానికే దక్కుతుంది. విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ను అభివృద్ధి పథంలో నిలిపేందుకు చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషిచేశారు. ఎవరు అవునన్నా కాదన్నా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాకనే సమాజంలోని అణగారిన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు వచ్చింది. బడుగుల బతుకుల్లో పచ్చదనం నింపి, నిరుపేదల ఆకలి తీర్చి గూడులేని దీన జనులకు నీడనిచ్చింది.

సైద్ధాంతిక నిబద్ధత, బలమైన వర్తమానం, ఆశావహ దృక్పథం తెలుగుదేశం పార్టీలో ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ నాయకులను తయారుచేసే కార్ఖానా మారి అనేకమంది నాయకులకు జన్మనిచ్చింది. తెలంగాణ ప్రస్తుత ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి ఇక్కడ తయారైనవారే. తెలుగుదేశం పార్టీ సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో ఎత్తుపల్లాలు దాటుకొంటూ చరిత్ర గతిలో తన ఉనికిని బలంగా చాటుకొంటూనే ఉంది. ఎన్నడూ ఓటమితో నిరాశగా వెనకడుగు వేసిఎరుగదు. సంక్షోభం ఎదురైనప్పుడల్లా మహోత్సవంతో ముందడుగు వేస్తూనే వుంది. తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవీధులలో వెలుగెత్తి చాటుతూ రాజకీయ కుట్రలు, మానసిక దాడులను తట్టుకుని నిలబడి కలబడుతూనే ఉంది. 60 లక్షల మంది సభ్యులు ఉన్న ఏకైక పార్టీ తెలుగుదేశం. ఎన్టీఆర్ ఆత్మగౌరవానికి ప్రతీకైతే, చంద్రబాబునాయుడు ఆత్మవిశ్వాసానికి ప్రతిరూపంగా నిలిచారు. ఆర్థికనేరస్థుడి ఏలుబడిలో రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అరాచక, విధ్వంస పాలనకు గోరీ కట్టి తెలుగుదేశం పార్టీకి తిరిగి అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సమాయత్తం కావాలి.


◆ మన్నవ సుబ్బారావు

(మార్చి 29: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం)

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

గురువారం 28 మార్చి 2024

ఈ ఐదేళ్లలో టీడీపీ కార్యకర్తలపై నిర్బంధాలు ప్రయోగించారు. అయినా బెదిరిపోకుండా చంద్రబాబుకు మీరంతా అండగా ఉన్నారంటే దానికి కారణం నమ్మకం. ఈ ఎన్నికలు కురుక్షేత్ర పోరాటం, స్వాతంత్ర్య పోరాటం లాంటివి. ధైర్యంగా ఉండాలి. నిర్బంధాల వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి. - భువనేశ్వరి




మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శనిలా తయారైంది అధికార వైసీపీ అభ్యర్థుల పరిస్థితి. ముందే డబ్బు భారీగా ముట్టింది.. ఇక ఎన్నికలు రావడం.. డబ్బు పంచేయడం.. గెలిచేయడమే తరువాయి.. అంటూ పగటి కలలు కన్న వారిపై ఎన్నికల సంఘం నీళ్లు చల్లింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వారానికే నోటిఫికేషన్ వచ్చి, నెల రోజుల్లో పోలింగ్ ప్రక్రియను ముగించేస్తారని భావించిన వైసీపీ నేతలు సుమారు 2 నెలలు సాగే ఎన్నికల షెడ్యూల్‌ను చూసి షాక్ అయ్యారు. షెడ్యూల్‌కు ముందే రెండు జిల్లాల్లోని వైసీపీ అభ్యర్థులకు రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల చొప్పున అందడంతో డబ్బు పెట్టి గెలిచేద్దామనుకున్న వారు ఇప్పుడు రెండు నెలలు సాగే ఎన్నికల ప్రక్రియతో పాటు ఖర్చు కూడా మరో రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకూ పెరిగే అవకాశం ఉండటంతో ఏం చేయాలో తెలియని సందిగ్ధంలో లోలోపల మదనపడిపోతున్నారు. - విజయవాడ ఆంధ్రజ్యోతి

లబ్ డబ్బు

వైసీపీ అభ్యర్థుల గుండెల్లో ఎన్నికల గుబులు

- ఎన్నికల తేదీ పెరగడంతో సరిపోని నిధులు
- ఇప్పటికే పలువురికి కానుకలు, కాసుల పంపిణీ
- మిగిలిన సొమ్ము నాయకులు, కార్యకర్తలకే సరి
- ఓట్ల కోసం జేబులో డబ్బు తీయక తప్పని పరిస్థితి
- ఏం చేయాలో తెలియక సతమతం



ఖర్చు తడిసి మోపెడు

కోడ్ అమల్లోకి వచ్చాక తమ పంపకాల తంతు సాగదని భావించిన వైసీపీ అభ్యర్థులు షెడ్యూల్ రాక ముందే వలంటీర్లు, ఆశా వర్కర్లు, డ్వాక్రా సంఘాలు, యానిమేటర్లు ఇలా క్షేత్రస్థాయిలో పనిచేసే చిరుద్యోగులందరితోనూ సమావేశాలు ఏర్పాటు చేసి, భోజనాలు పెట్టి కానుకలు, కాసులు పంచేశారు. వారి ద్వారా ఓటర్లను ప్రభావితం చేయవచ్చన్నది వైసీపీ అభ్యర్థుల భావన. ముందస్తుగా వచ్చిన డబ్బుల్లో కొంత మొత్తంతో ఈ పందేరాలు చేసి మిగిలిన డబ్బుతో ఎన్నికల్లో గట్టెక్కేయాలని భావించారు. కానీ, పరిస్థితి తారుమారైంది. చాలా మంది అభ్యర్థులు నియోజకవర్గాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయ నిర్వహణ, రోజువారీ ప్రచారానికి వచ్చేవారికి భోజనాలు, మందు, ఇతర ఖర్చులు.. ఇలా ఎంత లేదన్నా ఒక్కో అభ్యర్థికి రోజుకు రూ.10 లక్షల పైచిలుకు ఖర్చవుతోంది. దీనికి తోడు ఊహించని విధంగా గ్రామ, మండల స్థాయి నాయకుల బ్లాక్‌మెయిల్ తాకిడి ఎక్కువైంది. ఇటీవల పెనమలూరు నియోజకవర్గంలో జరిగిన సంఘటనే దీనికి ఉదాహరణ. నియోజకవర్గానికి చెందిన ఓ గ్రామస్థాయి నాయకుడు గ్రామంలో అధికశాతం ఉన్న ఓ సామాజికవర్గం ప్రతిపక్ష పార్టీ నాయకుడికి టచ్‌లోకి వెళ్లిందని, వెంటనే వారిని మచ్చిక చేసుకోకపోతే మన గెలుపుపై ప్రభావం చూపే అవకాశం ఉందని చెప్పి అదే సామాజికవర్గానికి చెందిన నాయకుడికి సుమారు రూ.10 లక్షలు ఇప్పించారు. ఇలాంటి ఘటనలు దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ జరుగుతున్నాయి. అధికారంలో ఉన్న ఈ ఐదేళ్లలో ఎమ్మెల్యే, ఆయన చుట్టుపక్కల ఉన్న నలుగురైదుగురు తప్ప గ్రామ, మండలస్థాయి నాయకులెవరూ పెద్దగా సంపాదించుకున్నది లేదు. దీంతో ఈ ఎన్నికల్లో ఎలాగైనా కాసులు కూడబెట్టుకోవాలన్న ఆలోచనలో వారంతా ఉన్నారు. ఏదో ఒక రకంగా అభ్యర్థిని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు గుంజుతున్నారు.

ఇంటి దొంగలతో బెంబేలు

వైసీపీ అభ్యర్థులను ఇంటి దొంగల బెడద వెంటాడుతోంది. మైలవరం నియోజకవర్గ పరిశీలకుడిగా ఉన్న వ్యక్తిని ఇటీవల మార్చేసి వేరే వారిని నియమించారు. ఈ మార్పు వెనుక పెద్ద కథే నడిచిందని చెబుతున్నారు. మైలవరం నియోజకవర్గానికి తొలి విడతగా రూ.12 కోట్ల నగదును పంపారు. ఈ మొత్తంలో రూ.6 కోట్ల వరకు వలంటీర్లు, మహిళా సంఘాలు, ఇతరులకు కానుకలు, కాసుల పంపిణీకి వినియోగించారు. ఈ మొత్తం ఖర్చు పాత పరిశీలకుడి కనుసన్నల్లో నడిచింది. ఆ మొత్తంలో సుమారు రూ.2 కోట్ల వరకు గోల్‌మాల్ జరిగిందని వైసీపీ పెద్దలు లెక్కలు తేల్చారు. దీంతో ఆగమేఘాలపై పరిశీలకుడిని మార్చేసి కొత్త వ్యక్తిని నియమించారు. ఇప్పుడు ఈయన్ను కూడా మార్చేసి మూడో కృష్ణుడిని రంగంలోకి తీసుకురానున్నట్లు సమాచారం. పార్టీ నుంచి వచ్చిన డబ్బుతో పాటు తమ సొంత డబ్బును పోలింగ్ తేదీ వరకు భద్రపర్చడం వైసీపీ అభ్యర్థులకు పెద్ద పనిగా తయారైంది. అధికారికంగా పార్లమెంట్ అభ్యర్థి రూ.90 లక్షల వరకు, అసెంబ్లీ అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేసే అవకాశం ఉంది. కానీ, పార్లమెంట్ అభ్యర్థి తక్కువలో తక్కువ రూ.100 కోట్ల పైచిలుకు ఖర్చు చేసే పరిస్థితి ఏర్పడింది. ఇక అసెంబ్లీ అభ్యర్థికి కనీసం రూ.50 కోట్ల పైచిలుకు ఖర్చవుతుంది. ఐదేళ్లు దోచుకున్న సొమ్ముతో వైసీపీ అభ్యర్థులు ఈ ఖర్చును మరింత పెంచేస్తున్నారు. ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో అడ్డగోలుగా డబ్బు పంపిణీకి తెగబడుతున్నారు. వైసీపీ అడ్డగోలుగా చేసే డబ్బు పంపిణీని నిలువరించడంతో పాటు ఎన్నికల అక్రమాలను అడ్డుకోవాలన్న ఉద్దేశంతోనే బీజేపీతో టీడీపీ చేతులు కలిపిందన్నది ఆ పార్టీ నాయకుల మాట.

కోడ్ కష్టాలతో..

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ లేకుండాపోయింది. దీంతో అప్పటి వరకు సమావేశాలు, భోజనాలు అంటూ అధికారులను పీక్కుతిన్న వీరికి ఇప్పుడు దిక్కుతోచడం లేదు. ముఖ్యంగా మచిలీపట్నం, పెడన, పెనమలూరు, గుడివాడ, నందిగామ, విజయవాడ సెంట్రల్‌లో పోటీ చేస్తున్న అభ్యర్థులు కోడ్ అమల్లోకి వచ్చే వరకు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసి తమ ప్రచారానికి వాడుకున్నారు. మాజీ మంత్రి, సిటింగ్ ఎమ్మెల్యే పేర్ని నాని తనయుడు కిట్టు ప్రచార ఖర్చంతా సర్కారు ఖాతాలో నుంచో లేకపోతే అధికారుల జేబుల నుంచో భరించాల్సి వచ్చింది. పెనమలూరులోనూ అదే పరిస్థితి. జోగి రమేశ్ మంత్రిగా ఉండటంతో ఆయన నియోజకవర్గంలో విపరీతమైన అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఎన్నికల కోడ్ వచ్చే వరకు ప్రభుత్వ సొమ్ముతో ప్రచారం చేసుకున్న మంత్రి జోగి రమేశ్ బాధ ప్రస్తుతం వర్ణనాతీతంగా ఉంది. గతంలో వలంటీర్లతోను, ఆశా వర్కర్లతోను, మహిళా సంఘాలతోను సమావేశాలు ఏర్పాటు చేసి భోజనం ఖర్చును వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీపై మోపేవారు. ఇప్పుడు జేబులో డబ్బు తీయాల్సి వచ్చేసరికి సమావేశాల జోరు తగ్గించారు. పెడనలోనూ అదే పరిస్థితి. ఇక్కడ వైసీపీ అభ్యర్థిగా ఉన్న ఉప్పాల రాము సతీమణి జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉండటంతో దాన్ని సాకుగా తీసుకుని ఆయన కోడ్ వచ్చే వరకు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. సతీమణి ప్రొటోకాల్‌ను అడ్డుపెట్టుకుని అధికార మందీమార్బలంతో అట్టహాసంగా ప్రచారం నిర్వహించారు. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఆయనకీ కష్టాలు మొదలయ్యాయి. విజయవాడ సెంట్రల్ నుంచి బరిలో ఉన్న వెలంపల్లి శ్రీనివాసరావు తన ప్రచారానికి వీఎంసీ అధికారులను, వలంటీర్లను తెగ వాడేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇప్పుడు జేబులో డబ్బు తీసి మరీ జనాలను తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మేయర్ ప్రొటోకాల్‌ను వాడుకుని అడ్డగోలు వ్యవహారాలకు తెరతీశారు. తన కార్యాలయానికి రాత్రికి రాత్రి రోడ్డు వేయించుకున్న ఘనత ఈయనది.

వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం

'నిజం గెలవాలి' యాత్రలో నారా భువనేశ్వరి పిలుపు

బిళ్లనపల్లిలో మహిళలు, రైతుల నీరాజనం

హనుమాన్‌జంక్షన్/హనుమాన్‌జంక్షన్ రూరల్, మార్చి 27 : ఈ ఐదేళ్లలో నోరెత్తితే నిర్బంధాలు, ప్రశ్నిస్తే జైలుకు పంపడాలు వైసీపీ ఘనత అని, ఇటువంటి రాక్షస పాలనకు ఈ ఎన్నికల్లో చరమగీతం పాడాలని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. అన్నదాతలకు, ప్రజలకు నీరందాలని పోలవరం ప్రాజెక్టు 72 శాతం పూర్తి చేసిన ఘనత టీడీపీదేనన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మరణించినవారి కుటుంబాలను పరామర్శించేందుకు ఆమె చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్ర బుధవారం బాపులపాడు మండలం బిళ్లనపల్లికి చేరింది. గ్రామంలోని రెండు కుటుంబాలను ఆమె పరామర్శించారు. రాత్రి 8 గంటలకు గ్రామానికి చేరుకున్న భువనేశ్వరిని చూసేందుకు మహిళలు, రైతులు పెద్దఎత్తున గ్రామానికి చేరారు. భువనేశ్వరి మాట్లాడుతూ టీడీపీపై అభిమానం, చంద్రబాబునాయుడుపై ఉన్న గౌరవంతో రాత్రి అయినా నాకోసం ఎదురుచూడటం పార్టీపై మీకున్న అభిమానాన్ని చాటుతోందన్నారు. పేదలకు అన్నం పెట్టేందుకు చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్లు స్థాపించి కోట్లాది మంది కడుపు నింపారన్నారు. విజన్ 2020 పేరుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైటెక్ సిటీ తెచ్చి లక్షలాది మంది యువతకు ఉపాధి చూపించిన ఘనత చంద్రబాబుదన్నారు. ఆయన మీద నమ్మకంతో అనేక పెద్దపెద్ద పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయన్నారు. విభజన తరువాత మరో ఐదేళ్లు చంద్రబాబుకు ప్రజలు అధికారం ఇచ్చి ఉంటే రాష్ట్రం రూపురేఖలు మారిపోయేవన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు, నీరందించే పోలవరం ప్రాజెక్టును ఆపివేశారన్నారు. చంద్రబాబునాయుడు మీద కక్షతో టీడీపీ పెట్టిన సంక్షేమ పథకాలను ఆపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడుపై చాలా ప్రభుత్వాలు కేసులు వేసినా నిరూపించలేకపోయాయని, అదీ ఆయనలోని నిజాయితీ అని అన్నారు. అందుకే మీరందరూ చేయిచేయి కలిపి కొన్ని రోజులు కష్టపడితే మన ప్రభుత్వం వస్తుందన్నారు. 'ప్రతి ఓటూ కూటమికే వేయాలి. దీనికి మీరు సైనా' అంటూ ప్రజలను ఆమె ఉత్తేజపరచారు. ప్రజలు కూడా తాము సంసిద్ధమని తెలిపేలా సై..సై అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, కొనకళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

- బిళ్లనపల్లిలో మృతి చెందిన టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎదురువాడ కిరణ్ కుటుంబ సభ్యులను, ఎదురువాడ బసవరావు కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించారు. కిరణ్ కుమారులతో మాట్లాడుతూ బాగా చదువుకోవాలని, టీడీపీ, ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున అండగా నిలబడతామని భరోసా కల్పించారు.



బిళ్లనపల్లిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న భువనేశ్వరి

నేడు గుడివాడ నియోజకవర్గంలో పర్యటన

గుడివాడ : నిజం గెలవాలి యాత్రలో భాగంగా గురువారం నారా భువనేశ్వరి నియోజకవర్గంలో పర్యటించనున్నారని టీడీపీ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3.40 గంటలకు గుడివాడ మండలం మోటూరు, 4.30 గంటలకు గుడ్లవల్లేరు మండలం అంగలూరు, 5 గంటలకు పోలిమెట్ల గ్రామాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు.



పశ్చిమపై వీడిన ఉత్కంఠ

- సుజనా చౌదరి పేరు ఖరారు చేసిన బీజేపీ అధిష్ఠానం
- మచిలీపట్నం ఎంపీ, అవనిగడ్డ ఎమ్మెల్యేపై వీడని సస్పెన్స్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా యలమంచిలి సుజనా చౌదరిని బీజేపీ అధిష్ఠానం ఖరారు చేసింది. పొత్తుల్లో భాగంగా విజయవాడ పశ్చిమను తొలుత జనసేనకు కేటాయించారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో ఈ స్థానాన్ని బీజేపీకి ఇచ్చారు. ఈ స్థానం నుంచి బీజేపీ తరఫున పలువురి పేర్లు ప్రచారంలోకి వచ్చినా చివరికి సుజనా చౌదరి వైపు పార్టీ పెద్దలు మొగ్గు చూపారు. సుజనా చౌదరి కంచికచర్లకు చెందినవారు. ఆయన రాజకీయ ప్రస్థానం టీడీపీ నుంచి ప్రారంభమైంది. ఎన్టీఆర్ ట్రస్టు అడ్వయిజర్‌గా ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. ఆ తర్వాత పార్టీలో కీలకనేతగా ఎదిగారు. రాజ్యసభ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా పనిచేశారు. తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో ఆయన టీడీపీని వీడి బీజేపీలో చేరారు.

ఎన్టీఆర్ జిల్లా కూటమి అభ్యర్థులు ఖరారు

పశ్చిమ సీటుపై స్పష్టత రావడంతో ఎన్టీఆర్ జిల్లాలో అన్ని స్థానాలకు కూటమి అభ్యర్థులు ఖరారయ్యారు. ఇక మచిలీపట్నం ఎంపీ, అవనిగడ్డ అసెంబ్లీ స్థానాలపై స్పష్టత రావాల్సి ఉంది. - మిగతా 6లో



ఉంగుటూరు మండలం తెల్రప్రోలు వాగు స్థలంలో ఆక్రమణలు షురూ

తెల్రప్రోలులో వాగు కబ్జా

- వైసీపీ నేతల అండదండలతో గప్‌చుప్‌గా వాగు ఆక్రమణలు
- పేదలను ఉసిగొలిపి ఆక్రమణలకు పిలుపు
- ఇళ్ల పట్టాలిస్తామంటూ మభ్యపెట్టే ప్రయత్నం
- ఓట్ల కోసం వైసీపీ దుష్టరాజకీయం

ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. వైసీపీ నాయకుల దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. ఓట్ల రాజకీయాలు పతాకస్థాయికి చేరుకుంటున్నాయి. పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో వారిని మభ్యపెట్టి ఓట్లను దండుకోవటానికి ప్రభుత్వ స్థలాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇళ్ల పట్టాలిస్తామని, ఇళ్లు వేసుకోమని ఉసిగొలుపుతున్నారు. ఓట్ల వేట లక్ష్యంగా సాగిస్తున్న ఈ చర్యలతో అధికార పార్టీ లాభపడుతుండగా .. పాపం చివరికి ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తుతోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ /ఉంగుటూరు): కృష్ణాజిల్లా గన్నవరం మండలంలో ఓట్ల వేటలో భాగంగా ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువలను ఆక్రమించుకున్నవారికి పొజిషన్ పట్టాలిచ్చేయటం తెలిసిందే. గన్నవరం మండలంలో పలు కాలువలను కబ్జా చేసిన వారి పేరుతో రికార్డులు కూడా మారిపోయిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఇదే తరహాలో బాపులపాడు మండలంలో వాగు, చెరువు భూముల్లో జగనన్న కాలనీల పేరుతో పట్టాలిచ్చేయటం జరిగింది. ఇదే విధానాన్ని ఉంగుటూరు మండలంలో కూడా వైసీపీ నాయకులు అనుసరిస్తున్నారు. జగనన్న కాలనీలంటూ నయవంచన చేస్తున్నారు. వాగు భూములను ఆక్రమించుకోమని పురి కొల్పారు. ఉంగుటూరు మండలంలోని తెల్రప్రోలు గ్రామంలో రైల్వేట్రాక్‌కు సమీపంలో ఉన్న వాగు స్థలం 7 ఎకరాల మేర ఆక్రమణలకు గురౌతోంది. ఈ భూమిని కొంత కాలంగా సాగు చేసుకుంటున్నారు. సాగు వరకు పర్వాలేదు. ఎందుకంటే వరద వస్తే పంట వరకు కొట్టుకు పోతుంది. పక్కాగా ఇళ్లు వేస్తే మాత్రం వాగు డైరెక్షన్ మారి పరిసర ప్రాంతాల్లో ఉన్న జగనన్న కాలనీతో పాటు, పంట పొలాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఈ వాగు చాలా ప్రధానమైనది. బల్లిపర్రు ఎగువ క్యాచ్‌మెంట్ ఏరియా వరద నీరు ఈ వాగులోకే వస్తుంది. ఇక్కడి నుంచి ఈ వాగు తెల్రప్రోలులోని రైల్వేబ్రిడ్జి, ఎన్‌హెచ్ - 16, ఏలూరు కాల్వల దిగువగా అంటే అండర్ కెనాల్ ద్వారా ప్రవహిస్తూ బుడమేరులో కలుస్తుంది. దీనిని బట్టి ఈ కాలువకు ఉన్న ప్రాధాన్యత ఏమిటో అర్థం అవుతుంది. ఇలాంటి కాలువపై ప్రస్తుతం తాత్కాలికంగా పాకలు ప్రారంభించారు. ఎన్నికల ముసుగులో పక్కా ఇళ్లు కట్టుకోమని, పట్టాలతో పాటు పొజిషన్ సర్టిఫికెట్లు కూడా ఇప్పిస్తామని వైసీపీ నేతలు ఆఫర్లు చేస్తున్నారు. వాగు భూముల్లో ఏ విధంగా పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తారో రెవెన్యూ అధికారులే చెప్పాలి. పేదలకు ఇలాంటి విషయాల మీద అవగాహన ఉండదన్న ఉద్దేశంతో - వైసీపీ నేతలు వారిని మభ్యపెడుతున్నారు. ఇలా మభ్యపెట్టడం వల్ల వారికి ప్రయోజనం చేకూర్చటం ద్వారా ఓట్లను దండుకోవచ్చన్నది వైసీపీ నేతల వ్యూహంగా ఉంది. వాగు ఆక్రమణలను తక్షణం అరికట్టాలని లేనిపక్షంలో పోరాటాలు నిర్వహిస్తామని స్థానిక రైతాంగం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా వారు పట్టించుకోవటం లేదు. గ్రామ టీడీపీ నాయకులు కూడా ఈ విషయాలపై స్థానిక రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకు వచ్చినా పట్టించుకోవటం లేదు. అధికార పార్టీ నేతలకు ఉంగుటూరు మండల రెవెన్యూ అధికారులు కూడా సహకారం అందిస్తుండటం గమనార్హం.



దుర్గమ్మ ఆదాయం రూ. 3.78 కోట్లు

25 రోజులకు లెక్కించిన ఆలయ సిబ్బంది - 6లో..



బార్ వద్ద స్నేహితుడిపై దాడి చేస్తున్న వంశీ, దాడి అనంతరం నడిరోడ్డుపై కేకలు

మద్యం మత్తులో బీభత్సం

- డబ్బు ఇవ్వలేదని స్నేహితుడిపై బీరు బాటిల్‌తో దాడి
- బాటిల్ పట్టుకుని నడిరోడ్డుపై వికృతంగా కేకలు

వన్‌టౌన్, మార్చి 27 : మద్యం తాగడానికి డబ్బులివ్వలేదని ఓ యువకుడు మత్తులో స్నేహితుడిపై బీరు బాటిల్‌తో దాడి చేశాడు. అంతటితో ఆగకుండా నడిరోడ్డుపై వికృతంగా అరుస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాడు. దుర్గాపురంలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. బాధితుడి తల్లి జోగు జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం సూర్యారావు పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భానునగర్ చర్చి వెనుక జోగు దుర్గారావు (38) అనే వ్యక్తి నివాసముంటున్నాడు. కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. మంగళవారం రాత్రి 10.30 గంటలకు స్నేహితుడు కొప్పుల వంశీతో కలిసి చెర్రీస్ బార్ వద్ద మద్యం సేవించడానికి వెళ్లాడు. మద్యం తాగుతుండగానే ఇద్దరి మధ్య ఘర్షణ మొదలైంది. తాగడానికి ఇంకా డబ్బు కావాలని వంశీ.. దుర్గారావును కోరాడు. అందుకు దుర్గారావు తన వద్ద డబ్బు లేదన్నాడు. దీంతో వంశీ బలవంతంగా దుర్గారావు జేబులు చూసి డబ్బు ఉన్నట్టు గుర్తించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ పెద్దదైంది. మద్యం మత్తులో ఉన్న వంశీ బీరు బాటిల్‌తో దుర్గారావుపై విచక్షణరహితంగా దాడి చేశాడు. అంతటితో ఆగకుండా వికృతంగా కేకలు వేశాడు. సమాచారం తెలుసుకున్న సౌత్ ఏసీపీ రత్నరాజు, సూర్యారావుపేట సీఐ దుర్గారావు, క్లూస్ టీం సిబ్బంది, ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించి వివరాలు తెలుసుకుంది. తీవ్రంగా గాయపడిన దుర్గారావును, స్వల్పంగా గాయపడిన వంశీని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.





దుర్గగుడిలో కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

దుర్గమ్మకు కానుకల ఆదాయం

25 రోజులకు రూ.3.78 కోట్లు

వన్‌టౌన్, మార్చి 27 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం మహామండపంలోని ఆరో అంతస్తులో లెక్కించారు ఈవో రామారావు, ఈఈ కోటేశ్వరరావు, పోలీసు, ప్రత్యేక పోలీసు తదితరుల పర్యవేక్షణలో మొత్తం 25 రోజులకుగాను వచ్చిన కానుకలను లెక్కించారు. నగదు రూపేణా రూ. 3,78,72,537, 900 గ్రాముల బంగారం, ఏడు కిలోల 820 గ్రాముల వెండి లభించింది. 3633 యూఎస్‌ఏ డాలర్లు, 100 ఓమన్ రియాల్స్, 20 యూకే పౌండ్లు, 30 ఆస్ట్రేలియా డాలర్లు, 135 యూరో డాలర్లు, 138 సింగపూర్ డాలర్లు, 30 యూఏఈ దీర్హమ్‌లు, 2.5 కువైట్ దీనార్లు, 104 ఖతార్ రియాల్స్, ఇండోనేషియా రూపాయలు 60 వచ్చాయి.



వేణుగోపాలస్వామికి పూర్ణాహుతి

వైభవంగా వేణుగోపాలుని వసంతోత్సవం

గంపలగూడెం, మార్చి 27 : నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామికి వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు తిరునగరి గోపాలచార్యుల ఆధ్వర్యంలో స్వామికి సువర్ణోత్సవములు, వసంతోత్సవం, పూర్ణాహుతి, చక్రస్నానం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామికి పల్లకిలో గ్రామోత్సవం చేశారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో నీటి కొలనులో స్వామి తెప్పోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా పీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన, శివరంజనీ నాట్య మండలిచే శ్రీకృష్ణార్జున గయోపాఖ్యానం, పలు నాటకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావూరి శశిరేఖ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్వీ సాంబశివరావు, సర్పంచ్ దుబ్బాకు రామకృష్ణ, ట్రస్టుబోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో సమావేశమైన సర్పంచ్‌లు

మండలికి సీటు ఇవ్వకుంటే రాజీనామా

» హెచ్చరించిన సర్పంచ్‌లు

అవనిగడ్డ, మార్చి 27 : అవనిగడ్డ అసెంబ్లీ సీటును మండలి బుద్ధప్రసాద్‌కు ఇవ్వకుంటే సామూహిక రాజీనామాలు చేస్తామని నియోజకవర్గ టీడీపీ సర్పంచ్‌లు అల్టిమేటం జారీచేశారు. బుధవారం అవనిగడ్డలో సమావేశమైన సర్పంచ్‌లు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు, ఒత్తిళ్లకు గురైన సమయంలో మాజీ ఉపసభాపతి తమకు అండగా నిలిచారని, అలాంటి వ్యక్తిని కాదని పొత్తులో భాగంగా ఇతరులకు కేటాయిస్తే పార్టీకి రాజీనామా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ముప్పనేని రవిప్రసాద్, పైడిపాముల కృష్ణకుమారి, బాణావత్ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు నిర్ణయాలు వెబ్‌సైట్‌లో ఉంచాలి

» పీవీ ఫణికుమార్

మచిలీపట్నం టౌన్, మార్చి 27 : వైసీపీ పాలనలో వెంకటేశ్వరస్వామి ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు నిర్ణయాలను వెబ్‌సైట్‌లో ఎందుకు ఉంచడం లేదని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కృష్ణాజిల్లా కన్వీనర్ పీవీ ఫణికుమార్ ప్రశ్నించారు. బుధవారం శిడింబి అగ్రహారంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీటీడీ చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలతో కాంట్రాక్టర్లకు వర్కులు కట్టబెట్టి కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా వెబ్‌సైట్‌లో టీటీడీ ఆదాయ వ్యయాల వివరాలు ఉంచాలన్నారు. 2023 సెప్టెంబరు నుంచి బోర్డు తీర్మానాలను ఆన్‌లైన్‌లో ఉంచడం లేదని ఆరోపించారు. దేవస్థాన సత్రాలు కూల్చడం వల్ల పేద భక్తులు అలిపిరి, చెట్లకింద ఉండాల్సి వస్తోందన్నారు. కోడ్ అమలులో ఉన్నా కొత్తగా వర్క్ ఆర్డర్లు ఇస్తున్నారని ఆరోపించారు.

సరకు రవాణాలో నెంబర్ వన్

» ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేసిన విజయవాడ డివిజన్


» మార్చి 26 వ తేదీ నాటికి రూ. 3975 కోట్ల ఆదాయం

» 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ. 3968 కోట్ల రికార్డు బ్రేక్

» మార్చి 31 నాటికి రూ. 4 వేల కోట్లకు చేరుకునే అవకాశం

» వివరాలను డీఆర్‌ఎం ఆనంద్‌కు వివరించిన డీసీఎం రాంబాబు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ / రైల్వేస్టేషన్) : ఆర్థిక సంవత్సరం ముగియటానికి మరో ఐదు రోజుల ముందుగానే సరకు రవాణాలో విజయవాడ రైల్వే డివిజన్ ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేసింది. సరకు రవాణాలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.3968 కోట్ల రికార్డును చెరిపేస్తూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో మరో ఐదు రోజులు ముందుగానే రూ.3975 కోట్లను సాధిస్తూ ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేసింది. మార్చి 26వ తేదీ నాటికి ఈ గణాంకాలను నమోదు చేసింది. ఆల్‌టైమ్ రికార్డు వివరాలను బుధవారం విజయవాడ



రైల్వే కమర్షియల్ విభాగం సీనియర్ డీసీఎం వి.రాంబాబు, విజయవాడ డీఆర్‌ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్‌కు వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 36.2 మిలియన్ మెట్రిక్ టన్నుల ఫ్రైట్ లోడింగ్ ద్వారా ఈ ఆదాయం సాధించినట్టు రాంబాబు వివరించారు. విజయవాడ డివిజన్ సాధించిన ప్రగతి దేశంలోనే అత్యుత్తమ ఫలితాల జాబితాలో ఉండే అవకాశం ఉంది. ఈ ఏడాది మార్చి 16వ తేదీ నాటికే 2022-23లో సాధించిన ఆదాయాన్ని దాటి 8 శాతం వృద్ధితో రూ. 3878 కోట్ల ఆదాయాన్ని సాధించింది. దీంతో 2018- 19 లో సాధించిన ఆదాయం రూ. 3968 కోట్లపై రైల్వే డివిజనల్ కమర్షియల్ విభాగం అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలో మార్చి 26 వ తేదీ అంటే కేవలం పది రోజులలోనే ఆల్‌టైమ్ రికార్డును తిరగరాశారు. మార్చి 31వ తేదీ నాటికి రూ. 4 వేల కోట్ల ఆదాయం లక్ష్యంగా కమర్షియల్ విభాగం అధికారులు అడుగులు వేస్తున్నారు. విజయవాడ రైల్వే డివిజన్ సాధించిన ప్రగతి వెనుక అదానీ కృష్ణపట్నం పోర్టు ద్వారా అత్యధిక ఆదాయం వచ్చింది. కాకినాడ సీ పోర్టు ద్వారా వచ్చిన ఆదాయం రెండవ స్థానంలో ఉంది. ఈ ఏడాదిలో బొగ్గు 19.36 మిలియన్ మెట్రిక్ టన్నులు, ఎరువులు 6.68 మిలియన్ మెట్రిక్ టన్నుల మేర ప్రధాన రవాణా వస్తువుల కేటగిరిలో ఉన్నాయి.

అమరావతి రాజధాని కోసం..

అవమానాలెదుర్కొన్నా

» చంద్రబాబు సీఎం కావడం చారిత్రక అవసరం : వసంత వెంకట కృష్ణ ప్రసాద్

ఇబ్రహీంపట్నం, మార్చి 27 : వైసీపీలో ఉండగా అమరావతి రాజధాని కోసం అడిగి అనేక అవమానాలు ఎదుర్కొన్నానని.. తనతో పాటు ఉన్న ఎమ్మెల్యేల్లో మల్లాది విష్ణు ఒక్కరే అమరావతి కోసం తనతో కలిసి ప్రశ్నించారని మైలవరం టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ గుర్తు చేశారు. విజయవాడ పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలిసి ఆయన గుంటుపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీ ప్రజలకు అభివృద్ధితో కూడిన సంక్షేమం అవసరమని, అది చంద్రబాబు వల్లే సాధ్యమవుతుందని, ఆయన్ను సీఎం చేసుకోవడం చారిత్రాత్మక అవసరమన్నారు. ధర్నా అంటూ మైలవరం నియోజకవర్గ ప్రజల్ని పిలిచి చంద్రబాబు ఇంటిపైకి దాడికి వెళ్లారన్నారు. కక్షలు, కార్పణ్యాలు, వ్యక్తిగత దూషణలు, దాడులు ఇలా ఎంతకాలం పరిపాలన సాగిస్తారన్నారు. బూడిద, మట్టి, గ్రావెల్, ఇసుక మాఫియా చేసేవారు వేరొకరైతే.. ఆ నిందలు మొత్తం తనపై మోపి మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. వ్యాపారాలు పక్కన బెట్టి మైలవరం నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు వస్తే.. ఒక్కపైసా కూడా అభివృద్ధికి నిధులివ్వకుండా మొండిచేయి చూపి వేధించారన్నారు. గోదావరి జలాలను చింతలపూడి ద్వారా ఎన్ఎస్పీ కాలువల్లో



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వసంత వెంకట కృష్ణ ప్రసాద్

పారించేందుకుగాను గత ప్రభుత్వంలో రూ.3 వేల కోట్లు ఖర్చుచేస్తే, వైసీపీ ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల పథకానికి కేవలం 5శాతం నిధులు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరులో పేదలకు సేవచేస్తున్న ఎన్నారైపై వైసీపీ ప్రవర్తించిన తీరు దారుణమన్నారు. దేవినేని ఉమాకు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదన్నారు. టీడీపీలో ఉన్నత స్థానం ఆయనకు లభిస్తుందన్నారు. వైఎస్, కిరణ్‌కుమార్‌రెడ్డిలు గత ప్రభుత్వాలు చేసిన పనుల్ని కొనసాగిస్తే జగన్ మాత్రం తిరోగమనంలో వెళ్లారన్నారు. విద్యుత్, బస్సు చార్జీలు విపరీతంగా పెంచారన్నారు. ఇసుక దోపిడీపై ఎవ్వరూ మాట్లాడవద్దని హుకుం జారీ చేశారని ఆవేదన చెందారు. వైసీపీని వీడి టీడీపీలోకి వచ్చిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ ఒంటెత్తు పోకడ నచ్చక పార్టీని వీడి టీడీపీలో చేరినట్టు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలో అన్నిస్థానాల్లో టీడీపీ కైవసం చేసుకోవాలని, దీనికి ప్రజలంతా సంపూర్ణ మద్దతివ్వాలని కోరారు. తనవల్ల గుంటుపల్లి గ్రామంలో ఇబ్బందులు పడిన ప్రతిఒక్కరికీ ఆయన పేరు పేరునా క్షమాపణలు చెప్పారు. ఏదేమైనా ప్రతి ఒక్కరిని కలుపుకొని టీడీపీ విజయానికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు

చల్లపల్లి, మార్చి 27 : చల్లపల్లి స్టేషన్ పరిధిలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. జాతీయ రహదారి(బైపాస్)పై గంగులవారిపాలెం సమీపంలో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. మోపిదేవి మండలం కప్తాను



పాలెంలోని వేములపల్లి హోం ఫుడ్స్ నిర్వాహకులు వేములపల్లి శ్రీహరి దంపతులు కప్తానుపాలెం నుంచి బొలెరో వాహనంలో రామానగరం వెళుతుండగా ఆక్వా కంటైనర్ ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీహరికి తీవ్రగాయాలుకాగా ఆసుపత్రికి తరలించారు. మరో రామానగరం చెరువు సమీపంలో పలావ్ స్టాల్ నడుపుకుంటున్న చల్లపల్లికి చెందిన అబూ బకర్ సిద్ధిఖ్ షాపు సమీపంలో రోడ్డుపై నడిచి వెళుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో యువకుడికి కాళ్ల, చేతులు విరిగాయి. కుటుంబ సభ్యులు సిద్ధిఖ్‌ను గుంటూరు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

నానికి ప్రజాసమస్యలు పట్టవా : వెనిగండ్ల

గుడివాడ, మార్చి 27 : స్థానిక ఎమ్మెల్యే కొడాలి నానికి ఓట్ల రాజకీయం తప్ప ప్రజల బాగోగులు పట్టవా అని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము ప్రశ్నించారు. బుధవారం 32వ వార్డులో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత స్థానిక పాటిమీద గల వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి వార్డులో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, డబ్బు సంపాదన తప్ప ప్రజాసమస్యలు పట్టని వ్యక్తి ఎమ్మెల్యేగా ఉండటం దురదృష్టకరమన్నారు. నానికి నిన్నటి వరకు కనిపించని ప్రజలు ప్రస్తుతం దైవసమానులుగా కనిపిస్తున్నారని ఎద్దేవ చేశారు. నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని వెనిగండ్ల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, మజ్జి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కుదరవల్లిలో వెనిగండ్లకు ఘన స్వాగతం

నందివాడ (కుదరవల్లి) : కుదరవల్లి మాజీ సర్పంచ్ మసిముక్కు వేణు ఆధ్వర్యంలో వెనిగండ్లకు ఘనస్వాగతం లభించింది. బుధవారం కుదరవల్లిలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి గ్రామ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలంతా వైసీపీ మోసాలను గమనించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని కోరారు. రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ఓటు ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు. మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద వెనిగండ్ల, రావి, కార్యకర్తలు

నోట్లో ఆలౌట్ పోశారు

» నేరం అంగీకరించమని ఒత్తిడి చేశారు

» న్యాయాధికారికి వాంగ్మూలం ఇచ్చిన నిందితురాలు

» పెనమలూరు ఇన్‌స్పెక్టర్, మహిళా ఎస్సైకి షోకాజ్ నోటీసులు

విజయవాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : "నేరం అంగీకరించి కేసును రాజీ చేసుకోవాలని పోలీసులు ఒత్తిడి చేశారు. అంగీకరించకపోయే సరికి నోట్లో ఆలవుట్ లిక్విడ్ పోశారు. ప్రైవేటు వైద్యులతో వైద్యం చేయించారు. మహిళనని చూడకుండా అసభ్యకరంగా దూషించారు. నా కుటుంబసభ్యులను ఇష్టానుసారంగా తిట్టారు" అని దావులూరి పద్మావతి అనే నిందితురాలు న్యాయాధికారికి వాంగ్మూలం ఇవ్వడం కృష్ణా జిల్లాలో సంచలనం కలిగించింది. నిందితురాలి వాంగ్మూలం నమోదు చేసుకున్న న్యాయాధికారి సంబంధిత పోలీసులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం గంగూరులోని యూనియన్ బ్యాంక్ ఇండియా మేనేజర్ దావులూరి పద్మావతికి, ఆమెకు పరిచయం ఉన్న యోగేశ్వరరావుకు మధ్య వివాదం ఉంది. తాను బ్యాంక్‌లో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను పద్మావతి కాజేసిందని పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆరోపణల నేపథ్యంలో బ్యాంక్ ఉన్నతాధికారులు పద్మావతిని సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న పద్మావతిని పెనమలూరు పోలీసులు ఈనెల 22వ తేదీన అరెస్టు చేశారు. ఆ మర్నాడు విజయవాడ సెంట్రల్ తహసీల్దార్, మండల మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. వాస్తవానికి పద్మావతిని ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ (తాలుకా) కోర్టులో హాజరుపరచాల్సి ఉంది. ఆ రోజున న్యాయాధికారులకు శిక్షణ తరగతులు ఉండటంతో సెంట్రల్ తహసీల్దార్‌కు ఇన్‌చార్జి ఇచ్చారు. తహసీల్దార్ ఎదుట ఆమెను హాజరుపరచగా రిమాండ్ విధించారు. తాను చెప్పుకునేది ఉందని పద్మావతి విన్నవించుకుంది. తనకు రిమాండ్ విధించే అధికారం ఉందని, వాంగ్మూలాన్ని రికార్డు చేసే అధికారం లేదని చెప్పి తహసీల్దార్ ఆమె విన్నపాన్ని తిరస్కరించారు. విజయవాడలో ఉన్న జిల్లా కారాగారంలో ఖాళీ లేకపోవడంతో పద్మావతిని మచిలీపట్నంలోని సబ్‌జైలుకు తరలించారు.

తండ్రి వేసిన పిటిషన్‌తో..

తర్వాత పద్మావతి తండ్రి దావులూరి వెంకట రంగారావు కుమార్తె తరఫున మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో ప్రత్యేకంగా ఒక పిటిషన్ వేశారు. రిమాండ్ విధించే ముందు తన కుమార్తె చెప్పదలచుకున్న విషయాన్ని మండల మేజిస్ట్రేట్ వినలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ సమయంలో పోలీసులు ఆమెను దారుణంగా వేధించారని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయాధికారి ఎ.సత్యానంద్ ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు నిందితురాలి వాంగ్మూలం వినాలని ఆదేశాలు జారీచేశారు. మచిలీపట్నం జైల్లో ఉన్న పద్మావతిని పోలీసులు కోర్టులో మంగళవారం హాజరుపరిచారు. తనపై ఫిర్యాదు చేసిన యోగేశ్వరరావుతో కేసును రాజీ చేసుకోవాలని, బంగారం అతనిదేనని అంగీకరించాలని పోలీసులు విచారణలో ఒత్తిడి చేశారని ఆమె ఆరోపించింది. దీనికి ఒప్పుకోకపోవడంతో నోటిలో ఆలవుట్ లిక్విడ్‌ను పోశారని న్యాయాధికారి దృష్టికి తీసుకెళ్లింది. అంతేగాకుండా తనను, కుటుంబసభ్యులను అసభ్యకరంగా దూషించారని చెప్పింది. అపస్మారకస్థితిలోకి వెళ్లిన తర్వాత ప్రైవేటు వైద్యులతో చికిత్స చేయించి కోర్టులో హాజరుపరిచారని వాంగ్మూలం ఇచ్చింది.

లిక్విడ్‌లో ఉన్న రసాయనాలు శరీరంలో చేరడంతో వణుకు వస్తోందని చెప్పింది. పద్మావతి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి లెనిన్‌బాబు పెనమలూరు ఇన్‌స్పెక్టర్ రామారావు, మహిళా ఎస్ఐ ఉషారాణికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పద్మావతి వాంగ్మూలంపై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. ఆమెను విజయవాడలోని జిల్లా జైల్లో ఉంచాలని ఆదేశాలు ఇచ్చారు. ఆమెకు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించి, శరీరంలో లిక్విడ్ రసాయనాలు ఎంత మేరకు ఉన్నాయో నిర్ధారించి ఆ నివేదికను వచ్చేనెల రెండో తేదీ నాటికి అందజేయాలని జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

సీ-విజిల్ ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మార్చి 27 : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ)ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, అదేవిధంగా సీ-విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఢిల్లీరావు, జేసీ పి.సంపత్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తదితరులతో కలిసి హాజరయ్యారు. వివిధ ఫారాల పరిష్కారం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల ప్రచారం, అనుమతుల జారీ, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సీఈవో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు జిల్లాలో ఎంసీసీ అమలు సరళితో పాటు వివిధ అంశాలను వివరించారు. సీ-విజిల్ ద్వారా వచ్చిన 188 ఫిర్యాదులను సత్వరం పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా అనుమతుల కోసం ఎన్‌కోర్‌లో 198 విజ్ఞప్తులు వచ్చాయన్నారు. వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్)ను ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారుల సమన్వయంతో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులు

లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి

వన్‌టౌన్ : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టాన్ని ఎన్‌టీఆర్ జిల్లాలో పటిష్ఠంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఇందుకు సంబంధించిన డెకాయ్ ఆపరేషన్‌లను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. నగరంలోని కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో బుధవారం లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేషన్ అథారిటీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, నియమ నిబంధనల గురించి వివరించారు. చట్ట ఉల్లంఘనలు జరగకుండా చర్య తీసుకోవాలని కోరారు. ఏఎన్ఎంలు, అంగన్వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కొత్త స్కానింగ్ సెంటర్‌ల ఏర్పాటుకు వచ్చిన ఐదు దరఖాస్తులు, రెన్యూవల్‌కు సంబంధించి 8 దరఖాస్తులు, రిజిస్టర్ సర్టిఫికేట్‌ల సవరణలకు సంబంధించి 15 దరఖాస్తులు, రిజిస్ట్రేషన్ రద్దుకు సంబంధించి 2 దరఖాస్తులు వచ్చాయి. వీటిని కమిటీ పరిశీలించి ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిషన్‌లో భాగంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో డిజిటలైజేషన్‌లో జరిగే కార్యక్రమాలపై గోడపత్రికను, కరపత్రాలను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, అదనపు జిల్లా జడ్జి, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఏ.సత్యానంద్, పోలీస్ కమీషనరేట్ నుంచి కె.శ్రీనివాసరావు, కె.నాగిని, వాసవ్య మహిళా మండలి చైర్‌పర్సన్ లక్ష్మీ, డీపీఎంవో డాక్టర్ నవీన్, డిజిటల్ హెల్త్ మిషన్ ప్రతినిధి మనోజ్ తదితరు పాల్గొన్నారు.





జాబితాను చూపుతున్న నెట్టెం తదితరులు

ఒక్క చాన్స్‌తో జగన్ రూ.8,23,600కోట్లు దోపిడీ

» ఎన్నికలు వచ్చాయనే ప్యాలెస్ విడిచి ప్రజల్లోకి

» నెట్టెం రఘురాం ధ్వజం

జగ్గయ్యపేట, మార్చి 27 : ఒక్క చాన్స్ అని ప్రజలను నమ్మించి సీఎం అయిన జగన్ రెడ్డి ఐదేళ్లలో రూ.8,23,600 కోట్లు దోచేసి.. ముఖ్యమంత్రి హోదాలో పరదాలు లేకుండా ఏనాడూ భూమ్మీద కాలుమోపని నిన్ను.. ఎన్నికల వస్తున్నాయని తిరిగి బస్సుయాత్ర చేపడితే ప్రజలు నిన్ను నమ్ముతారా.. అని మాజీమంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. బుధవారం పట్టణంలో తన నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, 85 శాతం హామీలను తుంగలో తొక్కిన జగన్‌రెడ్డిని ఓడించేందుకు ప్రజలు సిద్ధం అంటున్నారని అన్నారు. ఐదేళ్లలో జగన్ రెడ్డి రూ.8,23,600 కోట్లు దోచేశాడని ఆరోపించారు. నాసిరకం మద్యం తాగి 35లక్షల మంది ఆరోగ్యం దెబ్బతినగా, 30వేల మంది ప్రాణాలు కోల్పోయారని, అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని మాట తప్పాడని, రోడ్ల గురించి మర్చిపోవాల్సి వచ్చిందని చెప్పారు. అన్ని రకాలుగా మాట తప్పి, మడమ తిప్పిన జగన్ రెడ్డికి బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అధికారంలోకి రాగనే అమరావతిని వాషింగ్టన్‌గా మారుస్తానని, రాష్ట్రాన్ని మొత్తం వాష్ చేశాడని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.1,14,566 కోట్లు దారి మళ్లించాడని ఆరోపించారు. సమావేశంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి, గింజుపల్లి రమేష్, కారుపాటి డేవిడ్, తాళ్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రూపాయి పెట్టుబడి రాలేదు

» దేవినేని ఉమా



గొల్లపూడి, మార్చి 27 : ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రానికి రూపాయి పెట్టుబడి రాలేదని, ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. బుధవారం ఆయన గొల్లపూడిలో విలేకర్లతో మాట్లాడుతూ, గతంలో టీడీపీ హయాంలో చంద్రబాబు నాయుడు రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చారని గుర్తు చేశారు. ఉద్యోగాల భర్తీ, రెగ్యులరైజ్ అంతా ఎన్నికల డ్రామాలు అని ఉత్తుత్తి జీవోలు, డమ్మీ బటన్లతో ఇప్పటి వరకు జగన్ రెడ్డి ప్రజలను మోసం చేశారన్నారు. వైసీపీకి ఓటు వేస్తే తమ కుటుంబాలకు అన్యాయం చేసుకున్నట్టే అన్నారు. కూటమి అధికారం చేపట్టిన వెంటనే చంద్రబాబు తొలి సంతకం మెగా డీఎస్సీపైనే పెడతారన్నారు.

పశ్చిమపై వీడిన ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

అవనిగడ్డ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా ఎవరు పోటీ చేస్తారన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. ఇక్కడి నుంచి రేసులో ప్రముఖ వ్యాపారవేత్త విక్కుర్తి శ్రీనివాస్, ఎన్ఆర్ఐ బొబ్బా గౌతమ్, అప్పికట్ల అప్పారావు, మాదివాడ వెంకటకృష్ణ రామాంజనేయులు ఉన్నారు. వీరిలో విక్కుర్తి శ్రీనివాస్‌కు టికెట్ ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ రెండు స్థానాలతో పాటు మచిలీపట్నం పార్లమెంట్ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. ఈ స్థానం నుంచి వల్లభనేని బాలశౌరి పేరును ప్రకటించాల్సి ఉంది.

బయోడేటా..

పేరు : యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి)
పుట్టిన తేదీ : జూన్ 2, 1961
స్వగ్రామం : పొన్నవరం, కంచికచర్ల, ఎన్టీఆర్ జిల్లా
తల్లిదండ్రులు : వై.జనార్దన్‌రావు, సుశీల కుమారి
భార్య : పద్మజ
పిల్లలు : కార్తీక్, నాగచాందిని
విద్యాభ్యాసం : మెకానికల్ ఇంజనీరింగ్

కుటుంబ నేపథ్యం : సుజనా తాతగారు యలమంచిలి సత్యనారాయణ చౌదరి కృష్ణాజిల్లా నుంచి ఎంపికైన తొలి ఐపీఎస్ అధికారి. సుజనా కుటుంబబంధాలకు అధిక గౌరవం ఇస్తారు. ఆంగ్లంలో తల్లి పేరులోని తొలి రెండు అక్షరాలు, తండ్రి పేరులోని తొలి నాలుగు అక్షరాలతో తన కంపెనీకి 'సుజనా' అని పేరు పెట్టుకున్నారు.

రఘురామకు అసెంబ్లీ స్పీకర్ ఇవ్వాలి

» జగన్ ఆయన్ను అధ్యక్షా అని పిలవాలి

» నార్నె వెంకట సుబ్బయ్య

పాయకాపురం, మార్చి 27 : 'నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజును వైఎస్ జగన్ చేత అధ్యక్షా అని అనిపించాలి. ఇక చాల్లే కూర్చో అని స్పీకర్ హోదాలో రఘురామ జగన్‌ను అనాలి. అప్పుడే రఘురామకృష్ణరాజుకు రాష్ట్రంలో తగిన గౌరవం దక్కినట్టు అవుతుంది' అని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య అన్నారు. బుధవారం చేసిన ఓ ప్రకటనలో రఘురామరాజును అసెంబ్లీ స్పీకర్ హోదాలో చూడాలని ఆయన కోరుకున్నారు. రాష్ట్రంలో బీజేపీ మనుగడ కోసం పరోక్షంగా, ప్రత్యక్షంగా కష్టపడిన వ్యక్తికి ఆ పార్టీ నర్సాపురం ఎంపీ సీటు కేటాయిస్తుందని అందరు భావించారన్నారు. అయితే బీజేపీ రఘురామకు సీటు ఇవ్వకుండా ఓ విధంగా మోసగించిందన్నారు. ఆయనకు టీడీపీ తగిన గౌరవం ఇవ్వాలని సుబ్బయ్య కోరారు.

సజ్జల మూల్యం చెల్లించుకోక తప్పదు : షేక్ బాజీ

అమరావతి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేరుతో రోజుకో నకిలీ ప్రకటన విడుదల చేయిస్తోన్న సజ్జల భార్గవ్(వైసీపీ సోషల్ మీడియా) తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రాష్ట్ర బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ హెచ్చరించారు. అధికార పార్టీ అక్రమాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, ప్రజల డేటా వలంటీర్ల దగ్గర నిక్షిప్తం చేయించడం, అంగన్వాడీలను పోలింగ్ బూత్‌లలో నియమించే యత్నం వద్దని కోరినట్లు చెప్పారు. ఇప్పటికీ పలు చోట్ల పార్టీ రంగులు కనిపిస్తుండటం, రేషన్ వాహనాలపై స్టిక్కర్లు అలాగే ఉంచడంపైనా అభ్యంతరం వ్యక్తం చేశామన్నారు. వికలాంగ ఉపాధ్యాయులకు ఎన్నికల డ్యూటీ వేయవద్దని, చివరి నిముషం వరకూ ఓటర్లకు అవకాశం కల్పించాలని ఈసీకి విన్నవించినట్లు బాజీ బుధవారం విలేకర్లకు వివరించారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.00

విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా సత్యనారాయణ



విద్యాధరపురం, మార్చి 27: విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడుగా గడ్డం సత్యనారాయణను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల పాటు ఈ పదవీ కాలం ఉంటుంది. పదవీ కాల సమయంలో మహాసభ భవన నిర్మాణానికి, సంఘ అభ్యున్నతికి సహాయ సహకారాలు అందించడంతో పాటు ఆర్యవైశ్య జాతి ఆర్థిక, సామాజిక, రాజకీయ వైభవానికి తనతో పాటు సత్యనారాయణ కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు రామసత్యనారాయణ తన ఉత్తర్వులలో పేర్కొన్నారు.

సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలి

విద్యార్థులకు దుర్గగుడి ఈవో రామారావు హితవు

వన్‌టౌన్, మార్చి 27: చదువుతో పాటు విద్యార్థులు సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలని దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు హితవు పలికారు. కేబీఎన్ కళాశాలలో బుధవారం జరిగిన స్పోర్ట్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ సమాజాన్ని విద్యార్థులు అవగతం చేసుకోవాలన్నారు. బాధ్యతా యుతంగా జీవితాన్ని సాగించాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమను తాము తీర్చిది ద్దుకోవాలని పేర్కొన్నారు. 59 ఏళ్ల విద్యా సేవలందిస్తున్న కళాశాల పాలకవర్గాన్ని అభినందించారు. గుంటూరు టీజేపీఎస్ కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం మాట్లాడుతూ కళాశాల విద్యారంగంలో చక్కని సేవలందిస్తోందని చెప్పారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు టి.శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ కాలనుగుణంగా వస్తున్న మార్పులను ఆకళింపు చేసుకుని విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు సమర్పించిన నివేదికలలో గతేడాది సాధించిన విజయాలను పేర్కొన్నారు. సహాయ కార్యదర్శి జీవీ రామారావు, కోశాధికారి అన్నం రామకృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్స్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, డాక్టర్ కే.రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.



విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

చాముండి గోల్డ్, డైమండ్స్ షోరూమ్ ప్రారంభం



చాముండి గోల్డ్, డైమండ్స్ షోరూమ్ (ఇన్‌సెట్లో) ప్రారంభిస్తున్న అధినేత

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 27 : వస్త్ర వ్యాపార రంగంలో అగ్రగామిగా నిలిచిన చిల్లపల్లి నాగేశ్వరరావు అండ్ సన్స్ నాణ్యమైన బంగారు, వజ్రాభరణాలను అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందుతున్నారు. అందులో భాగంగా వినియోగదారులకు మరింత అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో నగరంలో విన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో నూతనంగా చాముండి గోల్డ్, డైమండ్స్ షోరూమ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ అధినేత చిల్లపల్లి శ్రీకర్ మాట్లాడుతూ వివాహాది, ఇతర శుభకార్యాలకు వినియోగదారులు కోరుకునే సరికొత్త మోడల్స్‌లో, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బంగారు, వజ్రాభరణాలను అందిస్తున్నామని తెలిపారు. డైమండ్‌లో విక్టోరియన్, పోల్కి డైమండ్స్ కలెక్షన్, బంగారంలో యాంటిక్ జ్యూయలరీ, అమృత్‌సర్ కలెక్షన్‌లతో పాటు వివిధ ఆభరణాలు అందుబాటు ధరల్లో లభిస్తాయని తెలియజేశారు.

బంగారు, వజ్రా భరణాల ప్రియులు షోరూమ్‌ను సందర్శించాలని కోరారు.

ఆర్టీసీ ఆపరేషన్ ఈడీ కోటేశ్వరరావుకు సన్మానం



కోటేశ్వరరావును సన్మానిస్తున్న నాయకులు

బస్టేషన్, మార్చి 27: ఆర్టీసీ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ.కోటేశ్వరరావు పదవీ విరమణ చేయనున్న సందర్భంలో బుధవారం ఆయనను ఆర్టీసీ హౌస్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఒక కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు వీడ్కోలు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా రవాణా సంస్థ బీసీ ఎంప్లాయీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్‌పీ శేషగిరిరావు, జైభీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.కిరణ్‌బుజ్జి, డీవీఎస్ఎస్ నారాయణ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోటేశ్వరరావు తన ఉద్యోగ సమయంలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను సావధానంగా విని పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. ఉద్యోగులకు ఆయన ఇచ్చిన సహకారం మరువలేనిదన్నారు.

భవనం పైనుంచి పడి వాచ్‌మన్ మృతి

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 27 : నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం పి. నైనవరం గ్రామానికి చెందిన నగిరికంటి సామియేలు(41) అజిత్‌సింగ్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌కు వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం భవనం నాల్గవ అంతస్థులో వాటరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ పడిపోయాడు. చుట్టు ప్రక్కల వారు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖుద్దూస్‌నగర్‌లో అన్న క్యాంటీన్

పాత రాజరాజేశ్వరిపేట, మార్చి 27 : అన్ని దానాల్లో కల్లా అన్నదానం గొప్పదని తెలుగు యువత పశ్చిమ నియోజకవర్గం అధ్యక్షుడు ఆర్. మాధవ అన్నారు. కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో 34వ డివిజన్‌లోని ఖుద్దూస్‌నగర్‌లో బుధవారం అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పేదలకు భోజనం అందజేశారు. నేతలు కట్టా బాబ్జి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ద్రోహి వెలంపల్లి

డూండీ రాకేష్

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 27 : ఆర్యవైశ్యుల ద్రోహి వెలంపల్లి శ్రీనివాసరావు అని, ఆయనను నమ్మవద్దని రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నేత డూండీ రాకేష్ సూచించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం నేతలు ఆర్యవైశ్యుల ద్రోహి వెలంపల్లి శ్రీను పేరుతో ముద్రించిన కరపత్రాన్ని విడుదల చేశారు. వెలంపల్లి శ్రీనివాస్ మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆర్యవైశ్యులకు చేసిన పలు ద్రోహాలకు సంబంధించి వివరాలను కరపత్రాల్లో ముద్రించారు. అనంతరం డూండీ రాకేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధిని వెలంపల్లి అడుగడుగునా అడ్డుకున్నారని విమర్శించారు. ఆర్యవైశ్యులు వెలంపల్లిని నమ్మవద్దని, టీడీపీని గెలిపించాలని కోరారు.

చంద్రబాబుతోనే ప్రశాంత పాలన

జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

మొగల్రాజపురం, మార్చి 27: జగన్ జనాన్ని భయపెట్టే పాలన చేస్తుంటే చంద్రబాబు ప్రజలు ప్రశాంతంగా ఉండే పాలన అందిస్తారని ప్రజలు అనుకుంటున్నారని రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయం, చంద్రబాబు సీఎం అవడం ఖాయం అని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ చెప్పారు. స్థానిక 7వ డివిజన్‌లో బుధవారం ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు చోట్ల స్థానికులతో మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. బీజేపీ జనసేన బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థిగా గద్దె రామ్మోహన్‌ను, పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)ని సైకిల్ గుర్తు మీద ఓటేసి గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాబోతోందని, రాగానే చెత్త పన్నులను రద్దు చేస్తామని చెప్పారు. గుమ్మడి గురుప్రసాద్, పెనుగొండ శ్రీనివాస్, పరసా లక్ష్మణ్, మాదల మల్లిఖార్జునరావు, దోమకొండ అశోక్, రవి, తదితరులు పాల్గొన్నారు.



ఇంటింట ప్రచారంలో గద్దె అనురాధ

మళ్లీ గద్దె విజయం తథ్యం

- చెన్నుపాటి గాంధీ, గద్దె క్రాంతికుమార్

పటమట: వచ్చే ఎన్నికల్లో జనసేన, బీజేపీలు బలపర్చిన తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని టీడీపీ నాయకులు చెన్నుపాటి గాంధీ, గద్దె క్రాంతిలు అన్నారు. 9వ డివిజన్‌లోని అపార్టుమెంట్స్ రోడ్డులో బుధవారం వీరిద్దరూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీ డీపీ అధికారంలోకి రాగానే అమలు చేసే సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ చెన్నుపాటి కాంతి శ్రీ, వై. దేవేంద్ర, ఏ. శ్రీదేవి, వై.బలరామకృష్ణ, ఎం. లక్ష్మీభవానీ, పి.సత్యనారాయణ, గోవిందు, ఎం. లక్ష్మీపతిలు పాల్గొన్నారు.

గుణదల: తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తనయుడు గద్దె రాజేష్ బుధవారం 6వ డివిజన్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తూర్పులో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న గద్దె రామ్మోహన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్, పల్లి దుర్గాప్రసాద్, అమిర్నేని కరుణ, పడాల ఆదినారాయణ, పి.వాసు, పల్లెపు దుర్గారావు, వనుము దుర్గారావు, షేక్ షకీలా, సప్పా శ్రీను, పిట్టా కనకశివ, మట్టా శివరామ్, వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



9వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న గద్దె క్రాంతి, చెన్నుపాటి కాంతి శ్రీ





పరీక్షా కేంద్రంలో పరిశీలించిన డీఈవో

విద్యార్థులతో కిక్కిరిసిన బస్సు

ముగిసిన పదో తరగతి పరీక్షలు

వన్‌టౌన్, మార్చి 27: నగరంలో పదోతరగతి పరీక్షలు ముగిశాయి. దీంతో విద్యార్థులంతా కోలహలంగా కనిపించారు. ఇళ్లకు వెళుతున్న విద్యార్థులు బస్సుల్లో, వాహనాల్లో ఎక్కి కేరింతలు కొట్టారు. పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించి ఇంటర్‌లో చేరుతామన్న ఆనందం వారిలో కనిపించింది. కాగితాలు చించి గాల్లో ఎగురవేశారు. ఒకరినొకరు అభినందనలు తెలుపుకున్నారు. క్లాస్‌మేట్స్ తమ ఫోన్ నెంబర్లను షేర్ చేసుకున్నారు. ఇంటర్‌లో ఎవరెక్కడ, ఏ కాలేజీలో చేరుతారన్నది ఇప్పుడే తెలియని పరిస్థితి కావడంతో మళ్లీ కలుస్తామంటూ టాటా గుడ్‌బైలు చెప్పుకున్నారు. ఈనెల 18 నుంచి పరీక్షలు ప్రారంభం కాగా బుధవారంసోషల్ స్టడీస్ పరీక్షతో ముగిశాయి.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఈవో

నగరంలో బుధవారం పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న పలు కేంద్రాలను డీఈవో సుబ్బారావు పరిశీలించారు. పరీక్షలు ముగింపు రోజు ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, కాపీయింగ్ జరగకుండా సునిశిత పర్యవేక్షణ చేయాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. స్వయంగా పలు కేంద్రాలకు వెళ్లి పరిశీలించారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద తనిఖీలు: రూ.లక్ష స్వాధీనం

వన్‌టౌన్, మార్చి 27: ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా ఫ్లైయింగ్ స్క్వాడ్, వన్‌టౌన్ పోలీసులు, ప్రత్యేక ఎన్నికల అధికారులు ప్రకాశం బ్యారేజీ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో ఎలాంటి బిల్లులు లేకుండా తీసుకువెళుతున్న రూ.లక్షను స్వాధీనం చేసుకున్నారు. మధురానగర్‌కు చెందిన ఓ బిల్డర్ కారులో బుధవారం మంగళగిరి మండలం ఎర్రబాలెం నుంచి విజయవాడ రాగా ప్రకాశం బ్యారేజీ వద్ద అధికారులు వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో రూ.లక్ష నగదు కనిపించింది. దీనికి సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో అధికారులు ట్రెజరీ అధికారులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో రిప్రజెంటేటివ్ మృతి

వన్‌టౌన్, మార్చి 27: గొల్లపూడి జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి కిందపడటంతో ఓ మెడికల్ రిప్రజెంటేటివ్ మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం ఉదయం జరిగింది. నున్నలో కలివేటి సునీల్ కుమార్ (42) కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఓ ప్రముఖ మెడికల్ కంపెనీలో రిప్రజెంటేటివ్ పనిచేస్తున్నాడు. ఇతను బుధవారం ఉదయం 7 గంటలకు డ్యూటీ నిమిత్తం బైక్‌పై బయలుదేరాడు. గొల్లపూడి ఎస్ఎస్ మార్బుల్ సమీపంలో జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో సునీల్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని గొల్లపూడిలోని ఆంధ్ర ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే సునీల్‌కుమార్ మృతి చెందినట్టు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు ఆసుపత్రికి చేరుకున్నారు. సునీల్‌కుమార్ బంధువు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొగల్రాజపురం, మార్చి 27: విద్యుత్ మరమ్మతులు మెయింటెనెన్స్ నిమిత్తం గురువారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు మొగల్రాజపురం సెక్షన్ మహాత్మాగాంధీ ఇండోర్ సబ్ స్టేషన్, 11కేవీ జమ్మిచెట్టు ఫీడర్ పరిధిలో మధుగార్డెన్ ఏరియా, ఏఎస్ రామారావు రోడ్డు, శాంతి నగర్, జమ్మిచెట్టుసెంటర్, ఉడ్‌పేట, బాడవ పేట, వాటర్ ట్యాంకు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. **భారతీనగర్:** రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలో గురువారం ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ నిలిపివేయుచున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరలక్ష్మీ నగర్, ఎల్ఐసీ కాలనీ, ప్రశాంతి నగర్, జయప్రకాష్ నగర్, ఫిల్మ్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ శాఖ బలవంతపు వసూళ్లు నిలిపివేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

పాయకాపురం, మార్చి 27 : అదనపు డిపాజిట్ల పేరుతో బలవంతపు వసూళ్లు చేయడం విద్యుత్ శాఖ అధికారులు మానుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. బుధవారం పాయకాపురం శాంతినగర్ ప్రాంతంలో బాబురావు ఆ పార్టీ నేతలతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా అదనపు డిపాజిట్లు చెల్లించని విద్యుత్ కనెక్షన్లను సిబ్బంది తొలగిస్తుండటాన్ని ఆయన గమనించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను బాబూరావు దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ తక్షణం విద్యుత్ శాఖ బలవంతపు వసూళ్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న బాబూరావు

అధ్వాన రోడ్లు, డ్రెయిన్లతో తంటాలు

●మురుగు పారుదల లేక ప్రజల పాట్లు ●43వ డివిజన్‌లో పేరుకుపోతున్న సమస్యలు



మసీదు రోడ్డుపై మురుగునీరు

భవానీపురం, మార్చి 27 : 43వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో అధ్వాన రోడ్లు, డ్రెయిన్లతో మురుగు పారుదల లేక ప్రజలు తంటాలు పడుతున్నారు. హెచ్‌బి కాలనీ వాటర్ ట్యాంక్(మసీదు) రోడ్డుపైన మురుగు నీరు నిల్వ ఉండటంతో ఇటువైపుగా రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రంజాన్ ప్రార్థనలకు వెళ్లే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వైసీపీ పశ్చిమ ఇన్‌చార్జిగా నియమితులైన ఆసీఫ్ కు రంజాన్‌కు ముందుగానే రోడ్డు వేయాలని అక్కడ వారు విన్నవించినా పట్టించుకోలేదు. ఈ రోడ్డు అభివృద్ధి పనులకు అక్కడే వేసిన శిలాఫలకం పాలకులు పట్టింపులేమిని ప్రశ్నిస్తోంది. భవానీపురం బైపాస్ ఐరన్ యార్డు నుంచి చర్చి వరకు మెయిన్ రోడ్డుపై డ్రెయిన్ ఆక్రమణలతో పూడుకుపోయింది. మురుగు నిల్వ ఉండిపోవడంతో ఇటువైపుగా రాకపోకలు సాగించే ప్రజలు దుర్వాసనతో అల్లాడుతున్నారు. ఇటువైపుగా సుందరీకరణలో భాగంగా ఫ్లేవర్ బ్లాక్స్ ఏర్పాటు చేస్తున్నారు. డ్రెయిన్ అభివృద్ధి లేక పూడుకుపోవడంతో రానున్న వర్షాకాలంలో మురుగు పోయే మార్గం లేకుండా పోతాది. ఎన్నికల సమయం కావడంతో పాలకులు ఓట్లు అడగడంపై చూపే శ్రద్ధ ఈ సమస్యలను పరిష్కరించడంపై కూడా చూపించాలని ప్రజలు కోరుతున్నారు.



భవానీపురం బైపాస్ వద్ద ..

ఆన్‌లైన్ యాప్ ద్వారా రూ.30 లక్షలకు టోకరా

పెనమలూరు, మార్చి 27 : ఆన్‌లైన్ యాప్‌లో విడతలవారీగా పెట్టుబడులు పెట్టి ముప్పై లక్షల మోసపోయిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పోరంకి గ్రామానికి చెందిన వంగూరు మణికుమార్ చెన్నైలోని ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. ఇంటి వద్దనే ఉంటూ వర్క్ ఫ్రం హోమ్ ద్వారా ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల 23న వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన లింక్ ఓపెన్ చేసి పెట్టుబడి పెట్టడం ప్రారంభించాడు. విడతల వారీగా ఈ నెల 19 వరకు సుమారు రూ.17లక్షలను పెట్టుబడగా పెట్టాడు. తాను ఇన్వెస్ట్ చేసిన మొత్తానికి లాభంతో కలిపి రూ.30 లక్షలను డ్రా చేద్దామని ప్రయత్నించగా 5శాతం సర్వీస్ ట్యాక్స్ కట్టించుకొని విత్‌డ్రా చేయనియ్యకుండా డబ్బులు లాగేసుకొన్నారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన మణికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



మొదటి పార్ట్‌కి ఏమాత్రం తగ్గదు

సిద్ధు జొన్నలగడ్డ

సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. మల్లిక్‌రామ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. చిత్రబృందం బుధవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "డీజే టిల్లు' యువతను దృష్టిలో పెట్టుకొని తీసిన సినిమా. టిల్లు పాత్రను ప్రేక్షకులు హృదయాల్లో పెట్టుకున్నారు. అందుకే సీక్వెల్ అంటే మొదట భయపడ్డాను. 'టిల్లు స్క్వేర్' కోసం మా టీం అంతా శక్తికి మించి కష్టపడింది. మొదటి



పార్ట్‌కి ఏమాత్రం తగ్గదు. ఈ సినిమాలో థ్రిల్లింగ్, షాకింగ్, సర్‌ప్రైజ్ అంశాలు చాలా ఉన్నాయి. మా నిర్మాత నాగవంశీ, త్రివిక్రమ్, చినబాబు గారికి ధన్యవాదాలు. నేనూ, అనుపమా కలసి ఉన్న పోస్టర్‌ను విడుదల చేసినప్పుడు కొందరు నెగెటివ్ కామెంట్స్ చేశారు. అమ్మాయిని అలా కామెంట్ చేయడం సరికాదు' అన్నారు. మల్లిక్‌రామ్ మాట్లాడుతూ "డీజే టిల్లు' లాగానే 'టిల్లు స్క్వేర్' చిత్రాన్ని కూడా ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. సిద్ధుతో ఈ రెండేళ్ల ప్రయాణాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అని చెప్పారు. డీజే టిల్లూకన్నా ఈ చిత్రం నాలుగురెట్లు వసూళ్లు సాధించాలని దర్శకుడు వెంకీ అట్లూరి ఆకాంక్షించారు. సిద్ధూ ఎనర్జీ లాస్ట్ ఫ్రేమ్ వరకూ ఓ రేంజ్‌లో ఉంటుంది, ఈ సినిమా కూడా సూపర్ హిట్ అవుతుందని దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ తెలిపారు. సిద్ధూ ఎనర్జీ మైండ్ బ్లోయింగ్, పార్ట్ 2 డబుల్ బొనాంజా అవుతుంది అని దర్శకుడు బాబీ చెప్పారు. చిత్రబృందం సక్సెస్ పార్టీకి సిద్ధంగా ఉండాలని నీరజ కోన కోరారు.

మా అమ్మాయని రికమెండ్ చేయలేదు




మా అమ్మాయి మాళవిక మోహనన్‌ను నేనేమీ రికమెండ్ చేయలేదు. తనకు తానే గుర్తింపు తెచ్చుకుంది. నా ప్రమేయం లేకుండా నటిగా ఆమె నిరూపించుకోవాలి. ప్రస్తుతం తను విక్రమ్‌తో నటిస్తున్న 'తంగలాన్' మూవీ మంచి గుర్తింపు తెస్తుంది" అని ప్రముఖ ఛాయాగ్రాహకుడు, హీరోయిన్ మాళవికా మోహనన్ తండ్రి కె.యు మోహనన్ చెప్పారు. ప్రస్తుతం తను సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేసిన 'ఫ్యామిలీ స్టార్' సినిమా గురించి మాట్లాడుతూ "ఇది ఒక బ్యూటిఫుల్ మూవీ. ఒక మిడిల్ క్లాస్ వ్యక్తి తన ఫ్యామిలీ కోసం ఏం చేశాడనేది మంచి మెసేజ్‌తో చూపించాం. మంచి లవ్ స్టోరీతో పాటు మనం నిర్లక్ష్యం చేస్తున్న కుటుంబ విలువలను తిరిగి గుర్తు చేసేలా ఉంటుంది" అన్నారు.

పెద్ద విజయాన్ని సాధించాలి



విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో'. రమాకాంత్ రెడ్డి దర్శకత్వంలో డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్‌లు నిర్మించారు. ఈ నెల 29న విడుదలవుతోంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో సుమన్, నిర్మాత ఏ.ఎం రత్నం అతిథులుగా విచ్చేశారు. సుమన్ మాట్లాడుతూ "ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి" అని కోరుకున్నారు. నిర్మాత ఏ.ఎం.రత్నం మాట్లాడుతూ "టైటిల్ కొత్తగా ఉంది" అని చెప్పారు. డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ మెప్పిస్తుంది" అని చెప్పారు. "సినిమా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని నిర్మాతలు అన్నారు. విశ్వ కార్తికేయ మాట్లాడుతూ "డిఫెరెంట్ కాన్సెప్టుతో వస్తోన్న ఈ చిత్రం మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది" అని చెప్పారు.



రామ్‌చరణ్, కియారా అడ్వానీ జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి జరగండి జరగండి అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. అనంత్ శ్రీరామ్ సాహిత్యానికి తమన్ స్వరాలు సమకూర్చారు. దలేర్ మెహందీ, సునిధీ చౌహాన్ ఆలపించారు.

ఒక్కటైన సిద్ధార్థ్, అదితి




హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితీరావు హైదరీల వివాహం వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లోని రంగనాథ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం జరిగింది. తమిళనాడు నుంచి వచ్చిన పురోహితులు వివాహ తంతును జరిపించారు. వివాహ కార్యక్రమం మొదలైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు స్థానిక పూజారులను కానీ, ఆలయ సిబ్బంది, స్థానికులను ఎవరినీ లోపలికి అనుమతించలేదు. అనుమతించిన కొద్దిమంది సెల్‌ఫోన్లను కూడా తీసుకున్నారు. వివాహ కార్యక్రమం పూర్తయిన వెంటనే వనపర్తి పట్టణంలోని వాసుదేవమ్మ తోటలో విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ తోట వనపర్తి సంస్థానాధీశులది. అదితీరావు హైదరీ వనపర్తి సంస్థానాధీశుల్లో చివరిరాజుగా ఉన్న రామేశ్వర్‌రావు మనమరాలు. ఆయన కూతురు విద్యారావు సంతానం అదితి. వనపర్తి సంస్థానాధీశుల కాలంలో నిర్మించిన శ్రీరంగాపూర్ రంగనాథ స్వామి ఆలయం ఇప్పటికీ సంస్థానాధీశుల ట్రస్టు ఆధీనంలోనే ఉండడంతో పెళ్లితంతును రహస్యంగా నిర్వహించగలిగారని చెప్పవచ్చు. హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితిరావు హైదరీ కలసి 'మహాసముద్రం' సినిమాలో నటించారు. ఆ సమయంలోనే వీరిమధ్య ప్రేమ చిగురించింది. సిద్ధార్థ్, అదితి ఇద్దరికీ ఇది రెండో వివాహం. సిద్ధార్థ్ తన చిన్ననాటి స్నేహితురాలు మేఘనను 2003లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత 2007లో ఇద్దరి మధ్యలో వచ్చిన విభేదాల కారణంగా విడాకులు తీసుకున్నారు. అదితి 2002లో సత్యదీప్ మిశ్రాను పెళ్లి చేసుకొని, 2012లో విడిపోయారు.

- మహబూబ్‌నగర్ (ఆంధ్రజ్యోతి)









అందాల పోటీల్లో సౌదీ బ్యూటీ



సౌదీ అరేబియా, మొట్టమొదటిసారిగా ఈ ఏడాది మిస్ యూనివర్స్ అందాల పోటీల్లో పాల్గొనబోతోంది. సెప్టెంబరు 18న మెక్సికోలో జరగబోతున్న ఈ అంతర్జాతీయ పోటీలో, ఆ దేశం తరపున 27 ఏళ్ల రూమీ అల్‌కతానీ పాల్గొనబోతోంది. ఈ అందాల రాశి గురించిన విశేషాలు.

"మిస్ యూనివర్స్ 2014 పోటీల్లో పాల్గొన బోతున్నందుకు నాకెంతో గర్వంగా ఉంది. సౌదీ అరేబియా మిస్ యూనివర్స్ పోటీలో పాల్గొనడం ఇదే మొదటిసారి" అంటూ రూమీ అందాల పోటీల గురించి తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. రియాద్‌లో పుట్టిన రూమీ... మోడల్, కంటెంట్ క్రియేటర్‌గా పేరు తెచ్చుకుంది. గత ఏడాది బహ్రెయిన్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ, లుహానే యాకూబ్ అనే ముద్దుగుమ్మ మిస్ యూనివర్స్‌లో పాల్గొంది. ఆవిడ అడుగుజాడలనే అనుసరిస్తూ ఈ ఏడాది సౌదీ అరేబియా నుంచి రూమీ అల్‌కతానీ ఈ అందాల పోటీల్లో పాల్గొనబోతూ ఉండడం విశేషం!

ఆదరణకు కొదవ లేదు

రూమీ అల్‌కతానీ సౌదీ మహిళల స్వయం స్వావలంబన కోసం ఎంతో కాలంగా కృషి చేస్తోంది. గతంలో, మిస్ ఏసియా ఇన్ మలేసియా, మిస్ అరబ్ పీస్, మిస్ యూరప్ మొదలైన ఎన్నో అంతర్జాతీయ పోటీల్లో రూమీ సౌదీ అరేబియాకు ప్రాతినిధ్యం వహించింది. మిస్ సౌదీ అరేబియా కిరీటాన్ని దక్కించుకున్న రూమీ, మిస్ మిడిల్ ఈస్ట్ (సౌదీ అరేబియా), మిస్ అరబ్ వరల్డ్ పీస్ (2021), మిస్ ఉమన్ (సౌదీ అరేబియా)గా కూడా గెలుపొందింది. ఇన్‌స్టాలో పది లక్షల మంది ఫాలోవర్లను కలిగి ఉన్న రూమీకి ఇతర సామాజిక మాధ్యమాల్లో కోట్లకొద్దీ అభిమానులున్నారు. డెంటిస్ట్రీలో బ్యాచిలర్ డిగ్రీ కలిగి ఉన్న ఈ అమ్మడు, ఇంగ్లీష్, ఫ్రెంచ్, అరబిక్ భాషలను ధారళంగా మాట్లాడగలుగుతుంది.

అతని చలవే!

యువరాజు, 32 ఏళ్ల మొహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్, విజన్ 2020లో భాగంగా, సౌదీలోని మహిళలకు ఎన్నో సౌలభ్యాలను కల్పించాడు. 2017లో క్రౌన్ ప్రిన్స్‌గా ఎంపికైనా మొహమ్మద్, అప్పటి నుంచి ఆ దేశంలో ఎన్నో ఆర్థిక, సామాజిక మార్పులకు పూనుకున్నాడు. ఇప్పుడు సౌదీ అరేబియాలో మహిళలు వాహనాలను నడపగలుగుతున్నారు. పురుషులతో సమానంగా బహిరంగ క్రీడా కార్యక్రమాల్లో పాల్గొనగలుగుతున్నారు. పురుష గార్డియన్ అనుమతితో పని లేకుండా పాస్‌పోర్టులను పొందగలుగుతున్నారు. ఇలా సినిమాలు, మిక్స్‌డ్ జెండర్ వేడుకల మీద కూడా నిషేధాన్ని ఎత్తివేసిన సౌదీ అరేబియా, పాతకాలపు సంప్రదాయ నిబంధనల నుంచి బయటపడి, గణనీయమైన స్వేచ్ఛ వైపు అడుగులు వేయడం హర్షణీయం.



ఒక్క ఆలోచన చాలాసార్లు జీవితాలను మార్చేస్తుంది. రష్మి సావంత్‌కు వచ్చిన ఆలోచన ఆమె జీవితాన్నే కాదు... కడలిని నమ్ముకొని, దాని సమీపంలో నివసిస్తున్న అనేక మంది జీవితాలను మార్చేసింది. ఆమె ప్రారంభించిన 'కల్చర్ ఆంగన్'- మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పర్యాటక రంగాలలో కొత్త ఒరవడిని సృష్టిస్తోంది.

ఆ ఆలోచన వందల జీవితాలు మార్చేసింది!

మహారాష్ట్రలోని సింధుదుర్గ్ ప్రాంతంలో మడ అడవులు ఎక్కువ. వాటి వల్ల ఆ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు కూడా చాలా ఎక్కువగానే ఉంటారు. కానీ వారందరికీ ఆతిథ్యం ఇచ్చే సంస్థలు తక్కువ. ఒక వైపు పర్యాటకులకు ఆతిథ్యం అందిస్తూనే- ఆర్థిక సాధికారతను సాధించటానికి ఉద్దేశించిన కార్యక్రమమే రిష్మి సావంత్ ప్రారంభించిన 'కల్చర్ ఆంగన్'. "2013లో నాకు ఈ ఆలోచన వచ్చింది. మాండవి దగ్గర అందమైన మడ అడవులు ఉంటాయి. కానీ ఆ ప్రాంతంలో నివసించే బేస్తా వారు- చేపలు పట్టుకోవటానికి మాత్రమే అవి పరిమితమై ఉండేవి. ఆ ప్రాంతానికి పర్యాటకులను తీసుకువచ్చి... ప్రకృతి అందాలను చూపిస్తే- రెండు ప్రయోజనాలు ఉంటాయనుకున్నాం. వీటిలో మొదటిది- మడ అడవులు నాశనం కాకుండా ఉంటాయి. రెండోది- స్థానికంగా నివసించే వారికి ఆర్థిక స్వావలంబన కలుగుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని- ఐక్యరాజ్య సమితికి చెందిన 'యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' (యూఎన్‌డీపీ)కు ఒక ప్రతిపాదన పంపాను" అంటారు రష్మి. 2016లో యూఎన్‌డీపీ ప్రతినిధులు ఈ ప్రాంతంలో పర్యటించారు. అక్కడ



స్థానిక మహిళలతో మాట్లాడారు. తొమ్మిది మంది మహిళలతో 'స్వామిని' అనే స్వయం సహాయక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలోకి వచ్చే టూరిస్టులకు మడ అడవుల అందాలను చూపించటం వీరి పని. ఈ బృందం ప్రస్తుతం ఏడాదికి రెండు లక్షల రూపాయలు సంపాదిస్తోంది. "సముద్ర తీరాల్లో, మడ అడవుల సమీపంలో ఉన్న మహిళలకు కొద్ది సేపు మాత్రమే పని ఉంటుంది. మిగిలిన సమయాన్ని వారు సమర్థంగా వాడుకుంటే సంపాదన పెరుగుతుంది. ఈ ఆలోచనకు రూపమే నేను ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాలు" అంటారు రష్మి.

మొదలయింది ఇలా..

రష్మి పుట్టింది, పెరిగింది ముంబాయిలో. ఆమె భర్త ఒక ట్రావెల్ కంపెనీలో పనిచేస్తూ ఉండేవారు. పెళ్లైన కొత్తల్లో ఆమె తన భర్తతో కలిసి అనేక గ్రామాలకు వెళ్లేవారు.. అక్కడ అనేక మంది మహిళలను కలిసేవారు. "చాలామంది రోజువారి సంపాదనపైనే బతుకుతూ ఉండేవారు. కొందరికైతే నెలకు పది రూపాయలు దాచటం కూడా కష్టమయ్యేది. ఆ సమయంలో నాకు హోం స్టేలను ప్రోత్సహిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది" అంటారు రష్మి. ఆమెకు ఆ ఆలోచన రావటానికి కూడా ఒక కారణం ఉంది. 2000 సంవత్సరంలో రష్మి- 'ఎడిన్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్'కు వెళ్లి- అక్కడ ఒక హోం స్టేలో ఉన్నారు. తమ ఇంట్లో ఒక రూమ్‌ను అద్దెకు ఇచ్చి, వంట వండి పెట్టడం ద్వారా ఆ హోం స్టే యజమానురాలు చాలా సంపాదిస్తున్న విషయాన్ని రష్మి గమనించారు. మన వాళ్లు కూడా అదే పని చేస్తే- వారికి కూడా సంపాదన పెరుగుతుందనే ఆలోచన రష్మికి వచ్చింది. ఎంత మంది తన ఆలోచనకు స్పందిస్తారో చూడటానికి ఆమె - ఒక స్థానిక పత్రికలో ప్రకటన ఇచ్చారు. దానికి సుమారు 50 మంది సానుకూలంగా స్పందించారు. దేవగఢ్ అనే ప్రాంతానికి చెందిన- వైశాలి, విజయ్ లోకే అనే దంపతులు- ముందుకు వచ్చి 'పితృఛాయ' అనే హోంస్టేని ప్రారంభించారు. అతి కొద్ది కాలంలోనే దానికి విపరీతమైన ఆదరణ లభించింది.

అదే చాలదు...

అనేక ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఉండటానికి ఇల్లు, చూడటానికి కొన్ని ప్రదేశాలు ఉంటే చాలదు. స్థానికంగా వారికి అదనపు ఆకర్షణలు కావాలి. అవి వారి మనసులను దోచుకోవాలి. "ఇలా ఆలోచిస్తున్న సమయంలో- నేను ఒక రోజు పింగుళి అనే ఒక గ్రామానికి వెళ్లా. ఆ గ్రామం తోలుబొమ్మలాటలకు ప్రసిద్ధి. అక్కడ నివసించే అనేక కుటుంబాలు ఆ వృత్తిపైనే బతుకుతూ ఉంటాయి. ఛత్రపతి శివాజీ కాలం నుంచి వారు ఈ వృత్తిలోనే ఉన్నారని చెబుతారు. కానీ సరైన ఆదరణ లేక ఆ వృత్తిలోకి ఎవరు రావటం లేదని విన్నా. దాంతో టూరిస్టులను ఈ ప్రాంతానికి తీసుకువస్తే- ఒక వైపు అంతరించిపోతున్న తోలుబొమ్మలాట కళ తిరిగి బతుకుతుందనీ, మరో వైపు టూరిస్టులకు అదనపు ఆకర్షణ దొరుకుతుందనీ ఆలోచించా" అంటారు రష్మి. స్థానికుల సహకారంతో రష్మి- 'ఠక్కర్ ఆదివాసీ లోక్ కళా మ్యూజియం'ను స్థాపించారు. స్థానిక కళాకారులకు శిక్షణ ఇప్పించటం.. టూరిస్టులను అదనపు సౌకర్యాలు కల్పించటం మొదలుపెట్టారు. "మహిళలకు వంట వండటం సహజంగానే వస్తుంది. ఆ నైపుణ్యాన్ని సక్రమంగా వాడితే వారికి అదనపు ఆదాయం లభిస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని- 'హిర్‌కాని' అనే కమ్యూనిటీ కిచెన్‌ను ప్రారంభించాం. దీనిలో సుమారు 300 మంది సభ్యులుగా చేరారు. వీరు ఆహారంతో పాటు- జ్యూస్‌లు, పచ్చళ్లు లాంటివి టూరిస్టులకు విక్రయించటం మొదలుపెట్టారు. దీనితో వారికి అదనపు ఆదాయం వస్తోంది. ప్రస్తుతం సింధుదుర్గ ప్రాంతానికి వెళ్లిన వారందరూ 'హిర్‌కాని'కి తప్పనిసరిగా వెళ్తారు" అంటారు రష్మి.

అక్కడితో ఆగకుండా..

సింధుదుర్గ్ ప్రయోగం విజయవంతం కావటంతో రాజస్థాన్‌లోని పాలీలో కూడా హోం స్టేలను రష్మి ప్రారంభించారు. ఆ తర్వాత ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వంతో కలిపి మహిళా సాధికారత కోసం పనిచేయటం మొదలుపెట్టారు. "ప్రతి ప్రాంతంలోను మహిళలకు ఏదో ఒకటి చేయగలుగుతున్నానే తృప్తి మిగులుతోంది. నేను చేస్తున్న ప్రయోగం చిన్నదే కావచ్చు.. కానీ కొన్ని వందల కుటుంబాలను ఆదాయాన్ని సమకూరుస్తోంది. తద్వారా వారు నివసించే ప్రాంతం మెరుగుపడుతోంది" అంటారు రష్మి. ఆమెలా సామాజిక మార్పును కోరుకొనేవారు మరింతమంది ముందుకు రావాలని కోరుకుందాం.

కౌన్సెలింగ్

ఆ మొటిమలు ఎందుకు?

డాక్టర్! నా వయసు 22 ఏళ్లు. గత కొంత కాలంగా 'వెజైనల్ పింపుల్స్'తో బాధపడుతున్నాను. ఇవి ఎందుకొస్తాయి? కారణమేంటి? ఈ సమస్య నుంచి శాశ్వతంగా బయటపడేదెలా?

- ఓ సోదరి, హైదరాబాద్

వెజైనల్ పింపుల్స్‌కు ఎన్నో కారణాలుంటాయి. అయితే అవి తలెత్తే సందర్భాన్ని బట్టి కచ్చితమైన కారణాన్ని అంచనా వేయవచ్చు. శుభ్రత లోపించడం, లైంగిక వ్యాధులు, నెలసరి సమయంలో ఉపయోగించే ఉత్పత్తులు, ప్యూబిక్ హెయిర్ ఇన్‌ఫెక్షన్... వెజైనల్ పింపుల్స్‌కు ప్రధాన కారణం. నెలసరి తర్వాత ఈ సమస్య వేధిస్తుంటే, ఆ సమయంలో ఉపయోగిస్తున్న శానిటరీ న్యాప్కిన్లు, ఇతరత్రా నెలసరి ఉత్పత్తులే కారణంగా భావించాలి. లోదుస్తులు శుభ్రంగా ఉంచుకోవడం, వీలైనంత వరకూ గాలి ధారాళంగా ఆడే కాటన్ లోదుస్తులు ధరించడం అలవాటు చేసుకోవాలి. వీటితో సమస్య పరిష్కారం



కాని సందర్భాల్లో వైద్యులను కలవాలి. ఇన్‌ఫెక్షన్ ఉందని తేలితే, వైద్యులు సూచించినంత కాలం నోటి మాత్రలు, పైపూత మందులు వాడుకోవాలి. గాఢమైన సువాసనలు వెదజల్లే పౌడర్లు, వెజైనల్ వాష్‌లు ఉపయోగించడం మానుకోవాలి. రాత్రి వేళల్లో లోదుస్తులు ధరించడం మానేయాలి. పగటి వేళ బిగుతైన అండర్‌వేర్స్ జీన్స్ లాంటి వాడకం తగ్గించాలి. ఎక్కువగా చమట పట్టే వీలున్న వేసవి కాలంలో లోదుస్తుల విషయంలో ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలి. సింథటిక్ బదులుగా కాటన్‌కే ప్రాధాన్యం ఇవ్వాలి. శానిటరీ న్యాప్కిన్లు ప్రతి నాలుగు గంటలకోసారి మార్చుకుంటూ ఉండాలి. టాంపూన్లు, కప్స్ వాడకం మానేయాలి. లైంగిక వ్యాధులు సోకే అవకాశం లేకుండా జాగ్రత్తగా ఉండాలి.

డాక్టర్ అమిత్ శర్మ,
గైనకాలజిస్ట్, హైదరాబాద్.

స్ఫూర్తి

అసాధారణం... ఆమె జీవితం



అనూహ్యమైన స్టార్‌డమ్... క్షణం తీరికలేని షెడ్యూల్స్... స్వయంకృషితో నిర్మించుకున్న సౌధం ఒక్కసారిగా కుప్పకూలింది. కారు ప్రమాదం... కోమాలోకి నెట్టేసి... పాత జ్ఞాపకాలన్నీ చెరిపేస్తే... ఆత్మవిశ్వాసంతో నిలబడి... సానుకూల దృక్పథంతో తిరిగి మామూలు మనిషి అయింది. బాలీవుడ్ మ్యూజికల్ హిట్ 'ఆషికీ' కథానాయిక అనూ అగర్వాల్ ప్రయాణంలో ఊహకందని మలుపులే కాదు... కుదుపులూ ఎన్నో ఉన్నాయి. అన్నిటినీ అధిగమించి... నేడు ఎందరికో ప్రేరణగా మారిన అనూ జీవిత 'చిత్రం' ఇది.

స్వీయ నిర్మితం నుంచి స్వీయ స్వస్థత వరకు... అనూ అగర్వాల్ జీవితం నుంచి నేర్చుకోవాల్సిన అనుభవ పాఠాలు ఎన్నో. శరీరానికి అయిన గాయాలకు తల్లడిల్లిపోకుండా.. మానసిక ఒత్తిడికి కుంగిపోకుండా... తనను తాను ఒక మనిషిగా మలుచుకున్న తీరు స్ఫూర్తి రగిలిస్తుంది. 1990లో 'ఆషికీ'తో తొలిసారి వెండితెరపై మెరిసిన అనూ... 'బాలీవుడ్ కథానాయిక అంటే ఇలానే ఉండాలి' అనే కొలమానాలకు భిన్నం. ఆమె అప్పీయరెన్స్ వెండితెరకు కొత్తదనాన్ని తెచ్చింది. ఢిల్లీలో పుట్టి పెరిగిన ఆమె... బడి రోజుల్లోనే నటన ప్రారంభించింది. తొమ్మిదో తరగతికి వచ్చేసరికి థియేటర్ గ్రూప్ ఒకటి నెలకొల్పి, ఒక నాటకానికి తనే దర్శకత్వం వహించి నటించింది. క్రమంగా స్క్రిప్ట్ కూడా రాసింది. బోర్డ్ పరీక్షల కోసం కొన్నాళ్లు నటనకు బ్రేక్ ఇచ్చిన అనూ.. 'ఢిల్లీ యూనివర్సిటీ'లో సోషియాలజీ చదివింది. అందులో గోల్డ్ మెడల్ కూడా అందుకుంది. సినీ నటి కావాలని ఏ రోజూ ఆమె అనుకోలేదు. మొదట మోడలింగ్, వీజేయింగ్ చేసింది. అవకాశం వస్తే... 1988లో దూరదర్శన్ సీరియల్ 'ఇసీ బహానే'తో మొదటిసారి తెరపై కనిపించింది. అది చూసి ఆమెకు బాలీవుడ్ నుంచి పిలుపు వచ్చింది. అలా 'ఆషికీ' చిత్రంతో అరంగేట్రంలోనే చిరస్మరణీయ విజయాన్ని అందుకున్న అనూ... రాత్రికి రాత్రి స్టార్ హీరోయిన్ అయిపోయింది.

జీవితం తలకిందులు...

చేతి నిండా ప్రాజెక్టులతో బిజీగా ఉన్న అనూ... తన గమ్యాన్ని మార్చుకుని యోగా వైపు అడుగులు వేసింది. వెలుగుజిలుగులకు దూరంగా జీవించడం ప్రారంభించింది. అదే సమయంలో ఆమె జీవితం ఒక్కసారిగా తలకిందులైంది. 1999లో జరిగిన కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమె... ఇరవై తొమ్మిది రోజులు కోమాలోనే ఉంది. అప్పుడామెకు ముప్పై ఏళ్లు. కోలుకున్నాక తన గతమేదీ ఆమెకు గుర్తుకురాలేదు. సగం శరీరం చచ్చుబడిపోయింది. ఎన్నో సర్జరీలు, భరించలేని నొప్పులు... నిద్రలేని రాత్రులు... ఆ గాయాలు మానడానికి కొన్నేళ్లు పట్టింది.

పునర్జన్మ...

2001లో సన్యాసినిగా మారిన అనూ... ఆరేళ్లపాటు అదే జీవితాన్ని గడిపింది. ఆ క్రమంలోనే యోగా, స్వీయ ప్రేమ, స్వీయ అవగాహన వల్ల జరిగే అద్భుతాలను తెలుసుకుంది. సానుకూల దృక్పథంతో ముందడుగు వేసింది. అవే తనకు పునర్జన్మ ప్రసాదించాయి అంటుంది అనూ. మృత్యువుతో, మానసిక సమస్యలతో పాతికేళ్లు పోరాడిన ఆమె ఇవాళ మనముందు ఒక స్ఫూర్తి శిఖరంలా నిలబడిందంటే.. నిజంగా ఇది ఒక అద్భుతం. ఇన్నేళ్ల తరువాత, 55 ఏళ్ల వయసులో మళ్లీ నటించి మురిపించేందుకు సిద్ధమైన అనూ.. ఆలోచన, ఆచరణ ఎప్పుడూ భిన్నంగా, కొత్తగా ఉంటుంది.

జీవన గమనం... అక్షర రూపం...

"నాకు మూడేళ్లప్పుడు... ఇంట్లో ఉన్న అమ్మ బ్యాగ్ తగిలించుకుని బయటకు వెళ్లాను. ఒక్కదాన్నే రోడ్డు మీద నడుస్తున్నా. ఆ బ్యాగ్ నాకంటే పెద్దగా ఉండేది. రోడ్డు దాటడానికి నేను పడుతున్న ఇబ్బంది గమనించిన ఒకాయన వచ్చి.. 'ఎక్కడికి వెళుతున్నావు' అని అడిగారు. 'షాపింగ్‌కు వెళుతున్నా' అన్నాను తడుముకోకుండా. మానవత్వం ఉన్న ఆయన నన్ను జాగ్రత్తగా తీసుకువచ్చి ఇంట్లో దిగబెట్టారు. అప్పటికే మా అమ్మ గుండె ఆగినంత పని అయింది" అంటూ చిన్ననాటి సంఘటన గుర్తు చేసుకున్న అనూ అడుగులు ఎప్పుడూ అనూహ్యంగా, నిర్భయంగా ముందుకు పడతాయి. సగటు అమ్మాయి ఆలోచనలకు భిన్నంగా... కొత్తదనాన్ని వెతుక్కొంటూ వెళతాయి. అనుకోకుండా బాలీవుడ్‌లో రంగప్రవేశం చేసింది. దేశవిదేశాల్లో మోడలింగ్ అనుభవం సినీ అవకాశాన్ని తెచ్చింది. విజయం రుచి చూసినా... ఏ రోజూ తనను తాను పరిశ్రమ వ్యక్తిగా భావించలేదు. ముంబయిలోని అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగానే జీవించింది. నటిగా ఎదురైన ఇబ్బందులు, సమస్యలను తనే పరిష్కరించుకునే ప్రయత్నం చేసింది.



చేతి నిండా ప్రాజెక్టులతో బిజీగా ఉన్న అనూ... తన గమ్యాన్ని మార్చుకుని యోగా వైపు అడుగులు వేసింది. వెలుగుజిలుగులకు దూరంగా జీవించడం ప్రారంభించింది. అదే సమయంలో ఆమె జీవితం ఒక్కసారిగా తలకిందులైంది.

'సంతోషంగా లేని సమయం'...

అనూ అగర్వాల్ తన 'అన్‌యూజువల్: మెమైర్ ఆఫ్ ఎ గర్ల్ హూ కేమ్ బ్యాక్ ఫ్రమ్ డెడ్' పుస్తకంలో తన సినీ జీవితాన్ని 'సంతోషంగా లేని సమయం'గా పేర్కొంది. 'ఒక్కసారిగా వచ్చి మీదపడిన స్టార్‌డమ్, ప్రాజెక్టులు, అనాదిగా కొనసాగుతున్న మూస పద్ధతులు, బాలీవుడ్‌లోని చీకటి కోణం, లోపించిన సృజనాత్మకత... ఆర్ట్ ఆఫ్ ఫిలిమ్ మేకింగ్ నుంచి వచ్చిన నేను వీటన్నిటిలో ఇమడలేకపోయాను. నన్ను నేను తెలుసుకోవాలనే ఆలోచనతో పరిశ్రమ నుంచి బయటకు వచ్చాను. నటిగానే కాకుండా జీవితంలో నా పాత్ర ఏంటి? దాన్ని వెతుక్కొంటూ యోగా వైపు అడుగులు వేశాను. అదే నాకు జీవన విధానాన్ని నేర్పింది. ఎంతో ఉపశమనం ఇచ్చింది' అంటూ చెప్పుకొచ్చింది అనూ. ఆడంబరాలు, పెద్ద పెద్ద కోరికలు లేకుండా విలువలతో జీవించడమే అసలైన జీవనమార్గం అంటున్న అనూ అగర్వాల్.. నేడు దేశవిదేశాల్లో శారీరక, మానసిక ఆరోగ్యంపై ఎన్నో ప్రసంగాలు ఇస్తూ, ప్రేరణ కలిగిస్తోంది.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/e6nPEMJలో చదవండి.



సింధు శుభారంభం

మాడ్రిడ్: పీవీ సింధు స్పెయిన్ మాస్టర్స్ చాలెంజ్ టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి రౌండ్లో సింధు 21-16, 21-12తో వెన్ యూ జాంగ్ (కెనడా)ను వరుసగేముల్లో చిత్తుచేసింది. గతేడాది రన్నరప్ సింధు రెండో రౌండ్లో హువాంగ్ యూ సన్ (చైనీస్ తైపీ)తో తలపడనుంది. ఇతర సింగిల్స్ పోరులో అస్మిత చాలిహా 13-21, 11-21తో ఇంటనాన్ రచనోక్ (థాయ్‌లాండ్) చేతిలో, సతీశ్ కుమార్ 15-21, 19-21తో హె జాంగ్ (మలేసియా) చేతిలో పరాజయం పాలయ్యారు. మిగతా భారత షట్లర్లలో మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్ రెడ్డి/సిక్కి రెడ్డి జోడీ 16-21, 22-20, 21-14తో చెన్ జి/యాంగ్ చింగ్ (చైనీస్ తైపీ) జంటపై గెలిచి రెండోరౌండ్ చేరింది. మరో భారత జంట సతీశ్/ఆద్య ఆరంభ రౌండ్లోనే ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

గిల్‌కు రూ. 12 లక్షల జరిమానా

చెన్నై: గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు భారీ జరిమానా విధించారు. మంగళవారం చెన్నై సూపర్‌కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ బౌలర్లు నిర్ణీత సమయానికి బౌలింగ్ కోటాను పూర్తి చేయలేకపోయారు. దీంతో ఐపీఎల్ నిబంధనల ప్రకారం స్లో ఓవర్ రేట్ కారణంగా ఆ జట్టు కెప్టెన్ గిల్‌కు ఏకంగా రూ. 12 లక్షలు జరిమానా పడింది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై 63 పరుగుల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. కాగా, ఈ సీజన్‌లో జరిమానా ఎదుర్కొన్న తొలి కెప్టెన్‌గా గిల్ నిలిచాడు.

ఇండో-పాక్ సిరీస్‌కు మేం సిద్ధం

మరోసారి క్రికెట్ ఆస్ట్రేలియా ఆసక్తి

న్యూఢిల్లీ: భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌కు ఆతిథ్యమిచ్చేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) మరోసారి ఆసక్తిని ప్రదర్శించింది. ఈ మేరకు ఇరుదేశాల క్రికెట్ బోర్డులు అనుమతిస్తే తమ దేశంలో ఇండో-పాక్ టెస్టు సిరీస్‌ను నిర్వహిస్తామని సీఏ ఆపరేషన్స్ మేనేజర్ పీటర్ రోచ్ బుధవారం వెల్లడించాడు. ఈ ఏడాది నవంబరు 22 నుంచి భారత్‌తో బోర్డర్-గవాస్కర్ సిరీస్ ట్రోఫీకి ఆతిథ్య ఆస్ట్రేలియా ఆతిథ్యమివ్వనుంది. అయితే, అదేనెల ఆరంభంలో ఆసీస్ స్వదేశంలో పాకిస్థాన్‌తో మూడు వన్డేలు, టీ20లు ఆడనుంది. ఇరుదేశాలు ఒకేనెలలో తమ దేశంలో పర్యటించనున్న నేపథ్యంలో పీటర్ రోచ్ ఇండో-పాక్ సిరీస్‌పై వ్యాఖ్యలు చేశారు. 'భారత్, పాక్ పోరు అంటే విశ్వవ్యాప్తంగా క్రికెట్ అభిమానులకు వినోదాన్ని పంచుతుంది. ఇలాంటి ఆసక్తికర మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని మేం ఎప్పుడూ వదులుకోం. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో ఇరుజట్ల మధ్య పోరు జరిగితే అది ఎప్పటికీ మరపురానిదిగా మిగిలిపోతుందనడంలో సందేహం లేదు' అని పీటర్ అన్నారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల కారణంగా 2012-13 నుంచి భారత్, పాక్ జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగడం లేదు. కేవలం వరల్డ్‌కప్, చాంపియన్స్ ట్రోఫీలాంటి ఐసీసీ ఈవెంట్లలో మాత్రమే ఇరుజట్లు తలపడుతున్నాయి. 2022 టీ20 వరల్డ్‌కప్ సందర్భంగా ఎంసీజీలో జరిగిన భారత్, పాక్ మ్యాచ్‌కు దాదాపు లక్ష మంది అభిమానులు తరలివచ్చారు. దీంతో ఇరుజట్ల మధ్య ద్వైపాక్షిక మ్యాచ్‌లు నిర్వహించేందుకు ఆసక్తిగా ఉన్నామని ఆసీస్ గతంలోనూ ప్రకటించిన సంగతి తెలిసిందే.

సెమీస్‌లో బోపన్న జోడీ

మియామి గార్డెన్స్ (యూఎస్ఏ): గతనెలలో ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గి జోరు మీదున్న రోహన్ బోపన్న మియామీ ఓపెన్‌లోనూ టైటిల్‌కు రెండడుగుల దూరంలో నిలిచాడు. మాథ్యూ ఎబ్డెన్‌తో కలిసి బోపన్న పురుషుల డబుల్స్‌లో సెమీఫైనల్ చేరాడు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో టాప్‌సీడ్ బోపన్న/ఎబ్డెన్ జోడీ 3-6, 7-6(4), 10-7తో వెర్‌బీక్ (నెదర్లాండ్స్)/పాట్రిక్ స్మిత్ (ఆస్ట్రేలియా) జంటపై గెలిచింది.

ఆరేళ్ల బంధానికి ముగింపు

» **కోచ్‌తో జొకోవిచ్ కటీఫ్**

లండన్: ప్రపంచ టెన్నిస్ నెంబర్‌వన్ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ సుదీర్ఘకాలంగా తనకు కోచ్‌గా వ్యవహరిస్తున్న గొరాన్ ఇవానిసెవిచ్‌తో తెగదెంపులు చేసుకున్నాడు. ఇవానిసెవిచ్‌తో ఆరేళ్ల బంధానికి ముగింపు పలికినట్టు జొకోవిచ్ తన సోషల్ మీడియాలో వెల్లడించాడు. వింబుల్డన్ మాజీ విజేత, క్రొయేషియాకు చెందిన ఇవానిసెవిచ్ 2018లో జొకోకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాడు.

ఉప్పల్‌లో రన్ తుఫాన్

సన్‌రైజర్స్ 277/3

ఐపీఎల్‌లో అత్యధిక స్కోరుతో రికార్డు

క్లాసెన్, అభిషేక్, హెడ్ సంచలన ఇన్నింగ్స్
తిలక్, డేవిడ్ శ్రమ వృథా ఛేదనలో ముంబై 246/5
31 పరుగులతో హార్దిక్ సేన ఓటమి



క్లాసెన్ (34 బంతుల్లో 80 నాటౌట్)

హైదరాబాద్ ఆతిథ్య మిచ్చిన ఈ సీజన్ ఐపీఎల్ తొలి మ్యాచ్ ఫ్యాన్స్‌కు మస్తు కిక్కిచ్చింది..సొంత గ్రౌండ్‌లో రైజర్స్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు..ముంబై బౌలర్లకు చుక్కలు చూపారు..మరోవైపు ముంబై బ్యాటర్లు కూడా అయితే సిక్సర్ లేదంటే ఫోర్ అనేలా బంతిని బాదడంతో పరుగుల వరద పారింది..దాంతో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక స్కోరు చేసిన జట్టుగా హైదరాబాద్ కొత్త చరిత్ర లిఖించింది.. ఛేదనలో ముంబై 'భారీ'గానే మొదలుపెట్టినా కీలక తరుణాల్లో వికెట్లు తీసిన హైదరాబాద్ గెలుపు బోణీ కొట్టింది..

హైదరాబాద్ : చల్లని సాయంత్రం..ఆహ్లాదకర వాతావరణం..వేలాదిమంది అభిమానులతో కిక్కిరిసిన ఉప్పల్ స్టేడియం..దాంతో హైదరాబాద్ బ్యాటర్లలో ఉత్సాహం నిండింది. పైగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తమ మొదటి మ్యాచ్‌లో గెలుపు వాకిట బోల్తా పడడం వారిలో కసి పెంచింది. వచ్చిన బ్యాటర్లు వచ్చినట్టు ముంబై బౌలర్లను ఊచకోత కోశారు. దాంతో బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రైజర్స్ 31 పరుగులతో విజయం అందుకుంది. తొలుత హైదరాబాద్ 20 ఓవర్లలో 277/3 స్కోరు చేసింది. క్లాసెన్ (34 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్స్‌లతో 80 నాటౌట్), అభిషేక్ శర్మ (23 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లతో 63), ట్రావిస్ హెడ్ (24 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 62) తుఫాన్ ఇన్నింగ్స్ ఆడారు. ఛేదనలో 20 ఓవర్లలో 246/5కే పరిమితమైన ముంబై ఓడింది. తిలక్ వర్మ (34 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సర్లతో 64), టిమ్ డేవిడ్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 42 నాటౌట్)రాణించారు. అభిషేక్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

తలో చేయి వేసినా..: రికార్డు ఛేదనను ముంబై ధాటిగానే షురూ చేసింది. ఉనాద్కట్ వేసిన రెండో ఓవర్లో కిషన్ 4, రోహిత్ 6,6 కొట్టగా, భువనేశ్వర్ బౌలింగ్‌లో ఇషాన్ 4,6,6,6తో కదం తొక్కాడు. కానీ నాలుగో ఓవర్లో ఇషాన్ (34)ను షాబాజ్ అవుట్ చేయగా. కొద్దిసేపటికే రోహిత్ (26)ను కమిన్స్ పెవిలియన్ దారిపట్టించాడు. పవర్ ప్లేలో 66/2తో ముంబై రేసులోనే నిలిచింది. యువ ఆటగాళ్లు నమన్ ధిర్, తిలక్ భారీ షాట్లతో ఎదురుదాడికి దిగి హైదరాబాద్‌కు వణుకు పుట్టించారు. షాబాజ్ బౌలింగ్‌లో తిలక్ మూడు సిక్సర్లతో విజృంభించాడు. ఆపై అతడు హాఫ్ సెంచరీకి కూడా చేరాడు. ఓవర్‌కు 14 రన్‌రేట్‌తో దూకుడు మీదున్న ఈ జోడీలో..నమన్ (30)ను క్యాచవుట్ చేసిన ఉనాద్కట్ రైజర్స్‌కు కీలక బ్రేక్ ఇచ్చాడు. 15వ ఓవర్లో తిలక్ ఇన్నింగ్స్‌కు తెరదించి ముంబై జోరుకు కెప్టెన్ కమిన్స్ కళ్లెం వేశాడు. ఆపై ఉనాద్కట్, కమిన్స్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ముంబైకి ఓటమి తప్పలేదు.

హైదరాబాద్ బ్యాటర్ల చెడుగుడు: నువ్వు ఫోర్ కొడితే..నేను సిక్సర్ దంచుతా..అనేలా సాగింది హైదరాబాద్ బ్యాటర్ల జోరు. ఒకరిని మించి మరొకరు రెచ్చిపోవడంతో ముంబై బౌలర్లు చేష్టలుడిగిపోయారు. 50, 100, 150, 200, 250..అలా చూస్తుండగానే రైజర్స్ స్కోరు కళ్లెంలేని గుర్రంలా పరుగెత్తింది. టాస్ కోల్పోయి బ్యాటింగ్ చేపట్టిన హైదరాబాద్‌కు ట్రావిస్ హెడ్ మెరుపు ఆరంభం ఇచ్చాడు. మొదటి మ్యాచ్‌లో తుది జట్టులో చోటు దక్కని కసితో ఉన్న హెడ్ తన సంచలన ఇన్నింగ్స్‌ను ఫోర్‌తో తెరదీశాడు. రెండో ఓవర్లోనే టిమ్ డేవిడ్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయాడు. దానిని సద్వినియోగం చేసుకున్న అతడు ఎంపాక వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్లో 22 పరుగులు రాబట్టాడు. ఐదో ఓవర్లో మయాంక్ (11)ను హార్దిక్ అవుట్ చేయడంతో 45 పరుగుల మొదటి వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. మరోవైపు హెడ్..హార్దిక్ ఓవర్లోనే హ్యాట్రిక్ బౌండ్రీలతో దుమ్ము రేపాడు. వచ్చీ రావడంతో అభిషేక్ శర్మ కూడా సిక్సర్ బాదాడు. .కొట్జీ వేసిన ఈ ఆరో ఓవర్లో హెడ్ మరింత చెలరేగి 4,4తో 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్ చేరాడు. ఈ నేపథ్యంలో తక్కువ బంతుల్లో అర్ధ శతకం చేసిన సన్‌రైజర్స్ బ్యాటర్‌గా వార్నర్ రికార్డును ట్రావిస్ బద్దలు గొట్టాడు. పవర్ ప్లే ముగిసే సరికి హైదరాబాద్ 81/1తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. రైజర్స్ స్కోరు ఏడో ఓవర్లోనే సెంచరీని దాటింది. అయితే ఎనిమిదో ఓవర్లో హెడ్ సంచలన ఇన్నింగ్స్‌కు కొట్జీ ముగింపు పలకడంతో ముంబై కాస్త ఊరట చెందింది. కానీ అభిషేక్ శర్మతోపాటు మార్‌క్రమ్ కూడా విరుచుకుపడడంతో ముంబై మరోసారి బేజారెత్తింది. ఎంపాక బౌలింగ్‌లో 6,6తో కేవలం 16 బంతుల్లోనే అభిషేక్ అర్ధ శతకం పూరించాడు. ఫలితంగా కొద్ది బంతుల క్రితమే హెడ్ నెలకొల్పిన రికార్డును అభిషేక్ తిరగరాశాడు. కొద్దిసేపటికే అభిషేక్ ఇన్నింగ్స్‌కు పియూష్ తెరదించాడు. ఆపై మార్‌క్రమ్‌కు పించ్ హిట్టర్ క్లాసెన్ తోడవడంతో అగ్నికి ఆజ్యం పోసినట్టయింది. దీంతో 15వ ఓవర్లోనే హైదరాబాద్ స్కోరు డబుల్ సెంచరీ దాటింది. క్లాసెన్ 23 బంతుల్లో హాఫ్‌సెంచరీ చేశాడు. బుమ్రా వేసిన 19వ ఓవర్లో ములానీ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో క్లాసెన్ విజృంభించడంతో హైదరాబాద్ ఐపీఎల్‌లో రికార్డు స్కోరు నెలకొల్పింది.


హెడ్ (62)


తిలక్ వర్మ (64)



అభిషేక్ (63)

1 అతి తక్కువ బంతుల్లో (16) హాఫ్ సెంచరీ చేసిన హైదరాబాద్ బ్యాటర్ అభిషేక్

నేటి మ్యాచ్
రాజస్థాన్ x ఢిల్లీ
రాత్రి 7.30 గం. నుంచి

ఐపీఎల్ చరిత్రలో అత్యధిక స్కోర్లు

స్కోరు	జట్టు	ఎప్పుడు	ఎవరిపై
277/3	హైదరాబాద్	2024	ముంబై
263/5	బెంగళూరు	2013	పుణె
256/5	లఖ్‌నవూ	2023	పంజాబ్
248/3	బెంగళూరు	2016	గుజరాత్
246/5	చెన్నై	2010	రాజస్థాన్
245/6	కోల్‌కతా	2018	పంజాబ్

523

రెండు జట్లు చేసిన రన్స్. ఐపీఎల్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి అత్యధిక స్కోరు ఇదే.

38

రెండు జట్లు కొట్టిన సిక్సర్లు. టీ20లో అత్యధిక సిక్సర్లు నమోదైన మ్యాచ్ కూడా ఇదే.

ఇదేం కెప్టెన్సీ..?



బౌలింగ్‌కు వచ్చిన ప్రతి బౌలర్‌నూ రైజర్స్ బ్యాటర్లు ఊచకోత కోస్తున్నా..13వ ఓవర్లోకానీ బుమ్రాకు రెండో ఓవర్ హార్దిక్ ఇవ్వకపోవడం గమనార్హం. ఓ పక్క ఇతర బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకుంటున్నా.. తమ ప్రధాన బౌలర్‌ను అప్పటిదాకా బౌలింగ్‌కు దించకపోవడం విమర్శలకు తావిచ్చింది.

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: మయాంక్ (సి) డేవిడ్ (బి) హార్దిక్ 11, హెడ్ (సి) నమన్ (బి) కొట్జీ 62, అభిషేక్ (సి) నమన్ (బి) పీయూష్ 63, మార్‌క్రమ్ (నాటౌట్) 42, క్లాసెన్ (నాటౌట్) 80, **ఎక్స్‌ట్రాలు: 19; మొత్తం: 20 ఓవర్లలో 277/3; వికెట్ల పతనం:** 1-45, 2-113, 3-161; **బౌలింగ్:** క్వెనా మఫాక 4-0-66-0, హార్దిక్ 4-0-46-1, బుమ్రా 4-0-36-0, కొట్జీ 4-0-57-1, పీయూష్ చావ్లా 2-0-34-1, ములాని 2-0-33-0.

ముంబై: రోహిత్ (సి) అభిషేక్ (బి) కమిన్స్ 26, ఇషాన్ (సి) మార్‌క్రమ్ (బి) షాబాజ్ 34, నమన్ (సి) కమిన్స్ (బి) ఉనాద్కట్ 30, తిలక్ (సి) మయాంక్ (బి) కమిన్స్ 64, హార్దిక్ (సి) క్లాసెన్ (బి) ఉనాద్కట్ 24, టిమ్ డేవిడ్ (నాటౌట్) 42, షెపర్డ్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 246/5; వికెట్ల పతనం:** 1-56, 2-66, 3-150, 4-182, 5-224; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-53-0, ఉనాద్కట్ 4-0-47-2, షాబాజ్ 3-0-39-1, కమిన్స్ 4-0-35-2, ఉమ్రాన్ 1-0-15-0, మయాంక్ మార్కండే 4-0-52-0.

బిజినెస్

సనోఫి వ్యాక్సిన్ల పైడాక్టర్ రెడ్డీస్‌కు మార్కెటింగ్ హక్కులు

హైదరాబాద్: సనోఫి హెల్త్‌కేర్ ఇండియా తయారుచేసే వ్యాక్సిన్ల పంపిణీ కోసం ఆ కంపెనీతో ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకున్నట్టు డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ ప్రకటించింది. ఈ ఒప్పందం ప్రకారం చిన్నారులు, పెద్దల కోసం సనోఫి తయారుచేసే హెక్సాగ్జిమ్, పెంటాగ్జిమ్, టెట్రాగ్జిమ్, మెనాక్ట్రా, ఫ్లుక్వాడ్రి, అడాసెల్, అవగ్జిమ్ 80యు బ్రాండ్లపై తమకు ప్రత్యేక హక్కులుంటాయని డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ఈ బ్రాండ్ల ఉమ్మడి అమ్మకాల విలువ రూ.426 కోట్లు ఉంటుందని పేర్కొంది. ఈ పోర్ట్‌ఫోలియో జోడింపుతో వ్యాక్సిన్ల విభాగంలో తాము రెండో స్థానానికి చేరగలమని కంపెనీ సీఈఓ బ్రాండెడ్ మార్కెట్స్ ఎంవీ రమణ తెలిపారు.

జీసీఎల్ భూమి విక్రయానికి ఒప్పందం

» విలువ రూ.3402 కోట్లు

హైదరాబాద్: హిందూజా గ్రూప్ కంపెనీ జీఓసీఎల్ కార్పొరేషన్ లిమిటెడ్ హైదరాబాద్‌లోకి కూకట్‌పల్లిలో 264.50 ఎకరాల భూమి వ్యూహాత్మక మానిటైజేషన్‌కు సంబంధించి స్పేర్‌స్పేస్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ ద్వారా జీఓసీఎల్‌కు రూ.3402 కోట్లు లభిస్తాయి. ఇందులో భాగంగానే 32 ఎకరాల భూమిని హిందూజా హెల్త్‌కేర్ లిమిటెడ్‌తో (హెచ్‌హెచ్‌ఎల్) కలిసి ఉమ్మడిగా అభివృద్ధి చేయనున్నారు. 18 నెలల కాలంలో ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ ఉమ్మడి అభివృద్ధి ఒప్పందం పరిధిలోకి వచ్చే ఈ 32 ఎకరాల్లో 12.50 ఎకరాలను తక్షణం విక్రయిస్తారు. జీఓసీఎల్‌కు తొలి విడతగా లభించే రూ.520 కోట్లలో రూ.160 కోట్లు పైన పేర్కొన్న 12.50 ఎకరాల విక్రయం ద్వారా సమకూరుతుంది. మిగతా సొమ్ము దశలవారీగా అందుతుంది.

కొత్త ఏడాదిలో ఎంపీసీ సమావేశాలు

ముంబై: ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సారథ్యంలోని ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశాల షెడ్యూల్‌ను ఆర్‌బీఐ విడుదల చేసింది. తొలి సమావేశం ఏప్రిల్ 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరుగుతుంది. 5వ తేదీన తొలి ద్వైమాసిక పరపతి సమీక్షను ఆర్‌బీఐ ప్రకటిస్తుంది.

కొత్త ఏడాదిలో సమావేశాల షెడ్యూల్...

సమావేశాలు	తేదీలు
తొలి సమావేశం	ఏప్రిల్ 3-5
రెండో సమావేశం	జూన్ 5-7
మూడో సమావేశం	ఆగస్టు 6-8
నాలుగో సమావేశం	అక్టోబరు 7-9
ఐదో సమావేశం	డిసెంబరు 4-6
ఆరో సమావేశం	2025 ఫిబ్రవరి 5-7

పదేళ్లలో రూ.5.3 లక్షల కోట్లు హాంఫట్

బ్యాంకులను దోచేస్తున్న కేటుగాళ్లు
మోసాల్లో 8వ స్థానంలో తెలంగాణ



ముంబై: ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా బ్యాంకు మోసగాళ్లు చెలరేగిపోతున్నారు. గత పదేళ్లలో (2013-2023) దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో 4,62,733 మోసాలు చోటు చేసుకున్నాయి. ఈ మోసాలతో బ్యాంకులు, ఖాతాదారులు రూ.5.3 లక్షల కోట్లు నష్టపోయారు. సమాచార హక్కు చట్టం కింద అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా ఆర్‌బీఐ ఈ వివరాలు వెల్లడించింది. అడ్వాన్స్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులు, డిజిటల్ లేదా ఇంటర్నెట్ బ్యాంకింగ్‌లో ఈ మోసాలు ఎక్కువగా జరుగుతున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది.

అగ్రస్థానంలో మహారాష్ట్ర: బ్యాంకింగ్ మోసాల్లో ఎక్కువ భాగం మహారాష్ట్రలో నమోదవుతున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది. 2013-2023 మధ్య కాలంలో ఈ రాష్ట్రంలో 1.59 లక్షల బ్యాంకింగ్ మోసాలు చోటు చేసుకున్నాయి. బ్యాంకులు రూ.2.24 లక్షల కోట్లు నష్ట పోయాయి. ఎన్‌సీఆర్ ఢిల్లీ (56,560 కేసులు), హరియాణా (57,767), తమిళనాడు (38,792), ఉత్తర ప్రదేశ్ (30,135) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కర్ణాటక, గుజరాత్, తెలంగాణా వరుసగా ఆరు, ఏడు, ఎనిమిదో స్థానాల్లో ఉన్నట్టు ఆర్‌బీఐ తెలిపింది. ఈ మూడు రాష్ట్రాల్లో గత పదేళ్లలో సగటున 8,000 నుంచి 12,000 బ్యాంకింగ్ మోసాలు నమోదయ్యాయి.

ఇలా మోసం చేస్తారు

బ్యాంకు సిబ్బందిలా పోజులు కొడుతూ మీ కేవైసీ అప్‌డేట్ చేసుకోండి, లేకపోతే మీ ఖాతా స్తంభించి పోతుందని ఫోన్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు లేదా ఇ-మెయిల్స్ పంపిస్తారు. ఇది నమ్మి వారు పంపిన లింక్ ఓపెన్ చేసి కేవైసీ వివరాలు అప్‌డేట్ చేస్తే, ఖాతాదారుల ఖాతాల్లో ఉన్న మొత్తాన్ని క్షణాల్లో ఊడ్చేస్తారు. ఇలాంటి ఫోన్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు, ఇ-మెయిల్స్ నమ్మొద్దని ఆర్‌బీఐ, బ్యాంకులు ఎంత మొత్తుకుంటున్నా ఇంకా అమాయకులైన కొంత మంది ఖాతాదారులు వీరి వలలో పడి ఉన్నదంతా పోగొట్టుకుంటున్నారు.

కల్యాణి వివాదంలో కొత్త ట్విస్ట్

» **గ్రూప్ ఆస్తుల్లో వాటా కోసం కోర్టుకెక్కిన చెల్లెలు సంతానం**

ముంబై: దేశంలోని ప్రముఖ వ్యాపార సామ్రాజ్యాల్లో ఒకటైన కల్యాణి గ్రూప్ యాజమాన్య కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి తగాదా కొత్త మలుపు తీసుకుంది. కళ్యాణి గ్రూప్ చైర్మన్ బాబా కల్యాణి మేనల్లుడు సమీర్ హిరేమఠ్, మేనకోడలు పల్లవి అనిశ్ స్వాది.. గ్రూప్ ఆస్తుల్లో వాటా కోరుతూ పుణె జిల్లా, సెషన్ కోర్టును ఆశ్రయించారు. బాబా కల్యాణి చెల్లెలు సుగంధ హిరేమఠ్ సంతానమైన సమీర్, పల్లవి ఈనెల 20న న్యాయస్థానంలో దావా దాఖలు చేశారు. కల్యాణి గ్రూప్ హిందూ అవిభాజ్య కుటుంబానికి (హెచ్‌యూఎఫ్) చెందినదని, అందులో తమకూ వాటా ఉందన్నది వారి వాదన. తమ కుటుంబం 1994లో ఏర్పాటు చేసుకున్న సెటిల్‌మెంట్ ఒప్పందాన్ని అమలు చేయాలంటూ తన అన్న బాబా కల్యాణికి వ్యతిరేకంగా సుగంధ హిరేమఠ్ ఏడాది క్రితమే బొంబాయి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ సెటిల్‌మెంట్ ఒప్పందం ప్రకారంగా కల్యాణి గ్రూప్‌లో భాగమైన ఫార్మా, బయోటెక్ కంపెనీ హికల్‌లో మెజారిటీ వాటా తన కుటుంబానికి బదిలీ చేయాలని సుగంధ డిమాండ్ చేశారు. తమ కుటుంబ స్థిర, చరాస్తుల మొత్తం విలువెంతో తమకే అవగాహన లేదని సమీర్, పల్లవి తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే భారత్ ఫోర్జ్ సహా గ్రూప్‌లోని 8 లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.63,000 కోట్ల స్థాయిలో ఉండవచ్చని అంచనా. వాటితోపాటు పలు స్థిర, చరాస్తులు కూడా ఉన్నాయి. తమ ముత్తాత అన్నప్ప కల్యాణి, కుటుంబ ఉమ్మడి ఆస్తులు, నిధులనే వ్యాపార విస్తరణ కోసం ఉపయోగించారని కూడా వీరిద్దరు తమ దావాలో పేర్కొన్నారు. 1954లో అన్నప్ప కల్యాణి మరణానంతరం ఆయన కుమారుడు నీలకంఠ్ కల్యాణి (బాబా కల్యాణి, సుగంధ తండ్రి) కుటుంబ ఆస్తులకు కర్తగా వ్యవహరించారు. నీలకంఠ్ ఆరోగ్యం క్షీణించడంతో బాబా కల్యాణి 2011లో ఈ బాధ్యతలు తీసుకున్నారు. బాబా కల్యాణి అనుచిత వైఖరే తమ ఉమ్మడి కుటుంబంలో అభిప్రాయభేదాలు, కోర్టు వివాదాలకు కారణమని వారన్నారు.

మార్కెట్లో పుల్ బ్యాక్ ర్యాలీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ బుధవారం పుల్‌బ్యాక్ ర్యాలీతో లాభాల బాట పట్టింది. సెన్సెక్స్ 526.01 పాయింట్ల లాభంతో 72,996.31 వద్ద ముగియగా నిఫ్టీ 118.95 పాయింట్ల లాభంతో 22,123.65 వద్ద క్లోజయింది. బ్యాంకింగ్, ఆటో, ఎనర్జీ, ఆయిల్ కంపెనీల షేర్లు ఈ పుల్‌బ్యాక్ ర్యాలీకి దోహదం చేశాయి. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 18 షేర్లు లాభాల్లో ముగిశాయి. లాభాల స్వీకరణ అమ్మకాలతో ఎఫ్ఎంసీజీ, ఐటీ కంపెనీల షేర్లు నష్టపోయాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ భారత జీడీపీ బాగుంటుందన్న అంచనాలు, ఎఫ్‌పీఐల కొనుగోళ్లు బుధవారం పుల్‌బ్యాక్ ర్యాలీకి ప్రధానంగా దోహదం చేశాయి. వచ్చే వారం జరిగే ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ ఫలితాల కోసం మార్కెట్ ఆసక్తితో ఎదురు చూస్తోంది.

నేటి నుంచి టీ+0 సెటిల్‌మెంట్

» **ముందుగా 25 కంపెనీల షేర్లలో...**

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో గురువారం నుంచి మరో విప్లవాత్మక మార్పు చోటు చేసుకోనుంది. 25 కంపెనీల షేర్లలో టీ+0 సెటిల్‌మెంట్ ప్రారంభం కానుంది. అంటే ఈ కంపెనీల షేర్లలో జరిగే అమ్మకం, కొనుగోళ్ళ, నగదు చెల్లింపు అదే రోజు పూర్తవుతాయి. అయితే ఈ కంపెనీల షేర్లలో టీ+0 సెటిల్‌మెంట్ ఐచ్ఛికమని (ఆప్షనల్) సెబీ స్పష్టం చేసింది. ఈ ప్రయోగం సఫలమైతే మరిన్ని కంపెనీల షేర్లను టీ+0 సెటిల్‌మెంట్‌లోకి తీసుకు రావాలని సెబీ భావిస్తోంది.

ఐచ్ఛికంగా టీ+0 సెటిల్‌మెంట్ అనుమతించే షేర్లివే

అంబుజా సిమెంట్, అశోక్ లేలాండ్, బజాజ్ ఆటో, బ్యాంక్ ఆఫ్ బరోడా, బీపీసీఎల్, బిర్లా సాఫ్ట్, సిప్లా, కోఫోర్జ్, దివీస్ ల్యాబ్స్, హిండాల్కో ఇండస్ట్రీస్, ఇండియన్ హోటల్స్, జేఎస్‌డబ్ల్యు స్టీల్, ఎల్‌ఐసీ హౌసింగ్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, ఎంఆర్ఎఫ్, నెస్లే ఇండియా, ఎన్ఎండీసీ, ఓఎన్‌జీసీ, పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ, సంవర్ధన్ మదర్సన్, ఎస్‌బీఐ, టాటా కమ్యూనికేషన్స్, ట్రెంట్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వేదాంత.

ఇళ్ల ధరలు భగ్గు

7 నగరాల్లో 10-32% పెంపు

హైదరాబాద్‌లో 38% పెరిగిన అమ్మకాలు



న్యూఢిల్లీ: దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో జనవరి-మార్చి త్రైమాసికంలో ఇళ్ల ధరలు భగ్గుమన్నాయి. గత ఏడాదితో పోల్చితే వివిధ నగరాల్లో ఇళ్ల ధరలు 10 నుంచి 32 శాతం మేరకు పెరిగాయి. అయినా ఇళ్ల డిమాండు బాగా పెరిగింది. కోటిన్నర, ఆ పైబడిన ధరలో ఇళ్లకు డిమాండు అధికంగా ఉంది. రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ కంపెనీ అనరాక్ ఈ వివరాలు ప్రకటించింది. ఆ వివరాల ప్రకారం హైదరాబాద్‌లో ఇళ్ల అమ్మకాలు 38 శాతం పెరిగి 19,660గా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో 14,280 యూనిట్లు అమ్ముడుపోయాయి. ముంబై మెట్రోపాలిటన్ ప్రాం తం (ఎంఎంఆర్), పుణె, బెంగళూరు, హైదరాబా ద్, ఢిల్లీ ఎన్‌సీఆర్, చెన్నై, కోల్కతా నగరాల్లో ప్రాపర్టీ విక్రయాలు, ధరలను అనరాక్ ట్రాక్ చేస్తుంది. ఈ ఏడు నగరాల్లో కలిపి అమ్మకాలు సగటున 14 శాతం పెరిగి 1,13,775 యూనిట్ల నుంచి 1,30,170 యూనిట్లుగా నమోదయ్యాయి. జనవరి-మార్చి త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలు దశాబ్ది గరిష్ఠ స్థాయి లో జరిగాయని అనరాక్ చైర్మన్ అనుజ్ పురి చెప్పారు.

ఎస్‌బీఐ డెబిట్ కార్డు చార్జీల పెంపు

» **ఏప్రిల్ 1 నుంచి అమలు**

న్యూఢిల్లీ: భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) డెబిట్ కార్డు వార్షిక నిర్వహణ చార్జీలను పెంచింది. బ్యాంక్ వెబ్‌సైట్ ప్రకారం.. పెరిగిన చార్జీలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్నాయి. క్లాసిక్, సిల్వర్, గ్లోబల్, కాంటాక్ట్‌లెస్ డెబిట్ కార్డుల వార్షిక నిర్వహణ రుసుము రూ.125 నుంచి రూ.200కి పెరగనుంది. యువ, గోల్డ్, కాంబో డెబిట్ కార్డు, మై కార్డ్‌పై చార్జీని రూ.175 నుంచి రూ.250కి పెంచింది. ప్లాటినమ్ డెబిట్ కార్డ్ చార్జీ రూ.250 నుంచి రూ.325కు.. ప్రైడ్ ప్లాటినమ్ బిజినెస్ డెబిట్ కార్డు రుసుము రూ.350 నుంచి రూ.425కు చేరుకోనుంది. ఈ వార్షిక చార్జీలన్నింటిపై 18 శాతం జీఎస్‌టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాదు, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుల విభాగంలోనూ కొన్ని మార్పులు తీసుకొచ్చింది. కొన్ని విభాగాల క్రెడిట్ కార్డుల ద్వారా అద్దె చెల్లింపులకు వచ్చేనెల 1 నుంచి రివార్డు పాయింట్లు లభించబోవని బ్యాంక్ స్పష్టం చేసింది.

డాయిష్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో సైయెంట్ భాగస్వామ్యం

హైదరాబాద్: ఏరోస్పేస్ రంగానికి ఇన్నోవేటివ్ సొల్యూషన్లు అందించే హైదరాబాద్‌కు చెందిన సైయెంట్ జర్మనీకి కంపెనీ డాయిష్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద 40 సీట్ల సామర్థ్యం గల డీ 328ఈసీఓ రీజినల్ టర్బోప్రాప్ విమానం వెనుక భాగం డిజైనింగ్‌లో రెండు కంపెనీలు సహకరించుకుంటాయని సైయెంట్ తెలిపింది. డార్నియర్ 328 విమానానికి అప్‌గ్రేడెడ్ వెర్షన్ కావడం వల్ల అందుకు అనుగుణంగా విమానం ప్రధాన బాడీని డిజైన్ చేయాల్సి ఉంటుందని పేర్కొంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,930 ▲	61,350 ▲	80,200 ▼
ముంబై	66,830 ▲	61,220 ▲	74,000 ▼



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27వ తేదీ		విజయవాడ	400
హైదరాబాద్	375	విశాఖపట్నం	415
28వ తేదీ		వరంగల్	377
చిత్తూరు	458	దజను గుడ్లు రూ.72	
గోదావరి	400		



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	గోదావరి	119
వరంగల్	120	విజయవాడ	119
కరీంనగర్	120	గుంటూరు	120
మహబూబ్‌నగర్	120	ఒంగోలు	120
కర్నూలు	121	చిత్తూరు	133
విశాఖపట్నం	117		

రన్‌వేపై రెండు విమానాలు ఢీ

కోల్‌కతా విమానాశ్రయంలో ఘటన



విరిగిపడ్డ విమానం రెక్క

కోల్‌కతా, మార్చి 27: రన్‌వేపైకి వచ్చేందుకు సిగ్నల్ కోసం ఎదురు చూస్తున్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం రెక్కను ఇండిగో ఎయిర్‌క్రాఫ్ట్ ఢీకొంది. ఈ ఘటన కోల్‌కతా విమానాశ్రయంలో బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. దర్భంగాకు బయలుదేరిన ఇండిగో (6ఈ 6152) పైలట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఇరు విమానాల రెక్కలు ఢీకొన్నట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) గుర్తించింది. ఈ ఘటనలో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం రెక్క నుంచి ఓ భాగం రన్‌వేపై పడిపోయింది. ఇండిగోకు చెందిన ఇద్దరు పైలట్లను విధుల నుంచి తాత్కాలికంగా తప్పించినట్లు డీజీసీఏ ప్రకటించింది. ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించింది. ప్రమాదం సమయంలో ఇండిగో విమానంలో 125 మంది ఉన్నట్లు డీజీసీఏ తెలిపింది.

సుప్రియ, దిలీప్ ఘోష్‌కు ఈసీ నోటీసులు

న్యూఢిల్లీ, మార్చి 27: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యర్థి పార్టీల నాయకులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేతలపై కేంద్ర ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. నటి కంగనా రనౌత్‌ను కించపరిచేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనతే, పశ్చిమ బెంగాల్ సీఎం మమతపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత దిలీప్ ఘోష్‌కు బుధవారం ఈసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో శుక్రవారం సాయంత్రం 5 గంటల్లోపు వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. వివరణ ఇవ్వని పక్షంలో తప్పుగా చేసినట్లుగా పరిగణించి ఎన్నికల నియామవళి ప్రకారం చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పింది. అయితే, కంగన గురించి తాను పోస్ట్ చేయలేదని సుప్రియ ఇప్పటికే ప్రకటించగా, దిలీప్ ఘోష్ తన వ్యాఖ్యలపై క్షమాపణ కోరారు.

ఆప్ ఏకైక లోక్‌సభ ఎంపీ సుశీల్ బీజేపీలోకి

న్యూఢిల్లీ, మార్చి 27: లోక్‌సభలో ఆప్‌కు ఉన్న ఏకైక ఎంపీ సుశీల్‌కుమార్ రింకూ బీజేపీలో చేరారు. పంజాబ్‌లోని జలంధర్ పశ్చిమ ఎంపీ అయిన ఆయన జలంధర్ పశ్చిమ ఎమ్మెల్యే శీతల్ అంగురాల్‌తో కలిసి బుధవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కాషాయ కండువా కప్పుకున్నారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఆయన బీజేపీ నుంచి పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. పంజాబ్ అభివృద్ధి కోసం, ముఖ్యంగా జలంధర్ అభివృద్ధి కోసమే తాను బీజేపీలో చేరినట్లు సుశీల్ చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులను ఆప్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆయన ఆరోపించారు.

కేరళ సీఎం కుమార్తెపై మనీ లాండరింగ్ కేసు


న్యూఢిల్లీ, మార్చి 27: కేరళ సీఎం పినరయి విజయన్ కూతురు వీణా విజయన్, ఆమె ఐటీ కంపెనీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీ లాండరింగ్ కేసు (పీఎంఎల్ఏ) నమోదు చేసింది. ఎటువంటి సేవలు అందించనప్పటికీ కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటిన్ లిమిటెడ్ కంపెనీ (సీఎంఆర్ఎల్) వీణా విజయన్‌కు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్‌కు అక్రమ చెల్లింపులు జరిపిందని సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసు (ఎస్ఎఫ్ఐఓ) చేసిన ఫిర్యాదు మేరకు ఈడీ ఈ కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలోనే విచారణకు సంబంధించి వీణా విజయన్‌తో పాటు మరి కొందరికి త్వరలోనే సమన్లు జారీ చేసే అవకాశముందని తెలుస్తోంది.

నేడు రేపు వడగాల్పులు

అమరావతి, మార్చి27 (ఆంధ్రజ్యోతి): వేసవి కారణంగా రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు ప్రభావం చూపుతాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రత 40డిగ్రీలు దాటుందని తెలిపింది. గురువారం కడప, నంద్యాల, మన్యం, అల్లూరి, కాకినాడ జిల్లాల్లోని 22 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం 31 మండలాల్లో వడగాల్పులు ఉంటాయని సంస్థ ఎండీ కూర్మనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎన్ఐఏ కొత్త బాస్ సదానంద్ వసంత్ దాతే

» 26/11 దాడుల్లో వీరోచిత పోరాటం



న్యూఢిల్లీ, మార్చి 27: కేంద్ర దర్యాప్తు సంస్థ నేషనల్ ఇన్వెస్టిగేటివ్ ఏజెన్సీ(ఎన్ఐఏ) డైరెక్టర్ జనరల్‌గా బుధవారం సదానంద్ వసంత్ దాతే నియమితులయ్యారు. ఆయన మహారాష్ట్ర క్యాడర్‌కి చెందిన 1990 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) చీఫ్‌గా ఉన్నారు. భారత్‌ను తీవ్రంగా కుదిపేసిన 26/11 దాడుల్లో ముష్కరులతో వీరోచితంగా పోరాడిన అధికారుల్లో దాతే ఒకరు. నాడు ముంబై సెంట్రల్ రీజియన్ అదనపు కమిషనర్‌గా ఉన్న దాతేకు.. నగరంలో టెర్రరిస్టులు ప్రవేశించారని సమాచారం అందింది. వెంటనే ఆయన తన బృందంతో రంగంలో దిగారు. ఛత్రపతి శివాజీ టెర్మినల్‌కు సమీపంలో ఉన్న కామా ఆస్పత్రిని ముష్కరులు అజ్మల్, అతని సహచరుడు అబు ఇస్మాయిల్ తమ అదుపులోకి తీసుకున్నారని తెలిసి దాతే బృందం వారిని ఎలాగైనా పట్టుకోవాలని నిశ్చయించుకొంది. ఆ క్రమంలో... శత్రువు గ్రేనేడ్లతో దాడి చేస్తున్నా సరే దాతే ధైర్యంగా కాల్పులు జరిపారు. గ్రేనేడ్ల ధాటికి శరీరమంతా గాయాలయ్యి, నెత్తురోడుతున్నా తాను మాత్రం బెదరలేదు. ఓపక్క ఇతర అధికారులకు సమాచారాన్ని చేరవేస్తూ... మరోపక్క ముష్కరులను కాల్పుల ద్వారా నిలువరిస్తూ గంటకు పైగా పోరాడి చివరకు తీవ్ర రక్తస్రావం కారణంగా స్పృహ కోల్పోయారు. అనంతరం అజ్మల్ కసబ్ సజీవంగా పోలీసులకు చిక్కిన సంగతి తెలిసిందే. దాతే అసమాన తెగువకు గానూ రాష్ట్రపతి పోలీసు సేవా పతకం దక్కింది.

దేశంలో నిరుద్యోగ తాండవం!

నిరుద్యోగుల్లో 83% యువతే.. ఐఎల్‌వో నివేదిక వెల్లడి

» నిరుద్యోగుల్లో విద్యావంతులైన యువత 2000లో 54.2%

» 2022 నాటికి 65.7%కి చేరిక

» 'నిరుద్యోగ బాంబు'పై దేశం: ఖర్గే



న్యూఢిల్లీ, మార్చి 27: భారత్‌లో నిరుద్యోగం తాండవిస్తోందని అంతర్జాతీయ కార్మిక సంస(ఐఎల్‌వో), మానవాభివృద్ధి సంస్థ(ఐహెచ్‌డీ) సంయుక్త అధ్యయనంలో వెల్లడైంది. 'భారత నిరుద్యోగ నివేదిక-2024'లో పలు కీలక విషయాలను వెల్లడించింది. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి.అనంత నాగేశ్వరన్ మంగళవారం విడుదల చేశారు. ఈ నివేదిక ముఖ్యంగా చదువుకున్న యువత ఉద్యోగాలు లేక ఈసురోమంటున్నారని తెలిపింది. 2022 నాటికి దేశంలోని మొత్తం నిరుద్యోగుల్లో 83%మంది యువతేనని ఆ అధ్యయనం పేర్కొంది. అంతేకాక మొత్తం నిరుద్యోగుల్లో చదువుకున్న యువత 2000నాటికి 54.2% ఉండగా 2022నాటికి 65.7శాతానికి పెరిగింది. ఈ పరిస్థితి భారత్‌వంటి అభివృద్ధి చెందుతున్న దేశానికి తీవ్ర ఇబ్బందేనని నివేదిక స్పష్టంచేసింది. ప్రస్తుతం నిరుద్యోగులైన యువ విద్యావంతుల్లో మహిళలు 76.7% ఉంటే పురుషులు 62.2% మంది ఉన్నారు.

అన్నింటిల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోలేదు

నివేదిక విడుదల సందర్భంగా నిరుద్యోగ సమస్యపై సీఈఏ అనంత నాగేశ్వరన్ మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ నియామకాలు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. "ప్రతి సామాజిక, ఆర్థిక సమస్యల విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలనే ఆలోచన సరికాదు. ప్రపంచంలో వాణిజ్య రంగం విస్తరిస్తోంది. కాబట్టి వారూ నిరుద్యోగాన్ని తగ్గించేందుకు ముందుకు రావాలి. నియామకాలు పెంచుకోవాలి" అన్నారు.

మోదీ దాచాలన్నా దాగదు: కాంగ్రెస్

'భారత నిరుద్యోగ నివేదిక-2024'లో పేర్కొన్న విషయాలపై కాంగ్రెస్ సహా అన్ని విపక్షాలు ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు గుప్పించాయి. "దేశంలో నిరుద్యోగం తాండవిస్తోందని మేం ఎప్పటి నుంచో చెబుతున్నాం. అయినా మోదీ ఈ విషయాన్ని దాచేందుకు, దారిమళ్లించేందుకు ప్రయత్నించారు. సమస్యే లేదన్నట్టు నటించారు. కానీ దాగలేదు. పార్లమెంటు ఎన్నికల్లో దీనినే మేం ప్రధాన అంశంగా యువతలోకి తీసుకువెళ్తాం" అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. నిరుద్యోగ సమస్యను ప్రధాని వక్రీకరించడంతోపాటు అసలు సమస్యే లేదన్నట్టుగా పరధ్యానంలో కాలం వెళ్లదీశారని తెలిపారు. మోదీ ఉదాసీన వైఖరి కారణంగా ఈ దేశం రగులుతున్న నిరుద్యోగం అనే 'బాంబు'పై కూర్చుందని పేర్కొన్నారు. "గత పదేళ్లలో 20కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న ప్రధాని అలా చేయకపోగా 12కోట్ల మంది ఉద్యోగాలను తీసేసి రోడ్డున పడేశారు. కాబట్టి ఓటు వేసే ముందే ప్రజలు ఒక్కసారి ఆలోచన చేయాలి"అని ఖర్గే పిలుపునిచ్చారు. నిరుద్యోగాన్ని తగ్గించడంలో ప్రభుత్వాలే అన్నీ చేయలేవంటూ అనంత నాగేశ్వరన్.. మోదీ ప్రభుత్వాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 2012తో పోల్చుకుంటే మోదీ హయాంలో నిరుద్యోగం 3రెట్లు పెరిగిందన్నారు. అందుకే తాను ప్రస్తుత ఎన్నికల్లో 'యువ న్యాయ్' అనే అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించినట్టు తెలిపారు. కాగా "గత పదేళ్లలో దేశ లేబర్ మార్కెట్‌లో కొనసాగిన 'అన్యాయ కాల్'ను ఈ నివేదిక బహిర్గతం చేసింది"అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. నిరుద్యోగ సమస్యను మోదీ సర్కారు దాచి పెట్టిందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా విమర్శించారు.

ఇవీ నివేదిక వివరాలు

- చదువుకున్న నిరుద్యోగులు 2000లో 54.2% ఉండగా 2022నాటికి 65.7శాతానికి చేరారు.
- విద్యావంతులైన నిరుద్యోగుల్లో ప్రస్తుతం మహిళలు 76.7% ఉండగా పురుషులు 62.2% ఉన్నారు.
- 2000-19 మధ్య యువతకు ఉద్యోగావకాశాలు పెరిగాయి. అలాగే, అర్హత తగిన ఉపాధి పొందని వారి సంఖ్య కూడా పెరిగింది.
- కరోనా కాలంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు భారీగా తగ్గి నిరుద్యోగుల సంఖ్య పెరిగింది.
- 2000లో ఉద్యోగాలు పొందిన యువతలో సగం మంది స్వయం ఉపాధిని పొందిన వారే. వీరిలో 13% మంది రెగ్యులర్, 37% మంది తాత్కాలిక ఉద్యోగాలు దక్కించుకున్నారు.
- వచ్చే పదేళ్ల కాలంలో భారత్‌లో 70-80 లక్షల యువ శక్తి అందుబాటులోకి రానుంది.

కనీస వేతనం రోజుకు రూ.400

» కాంగ్రెస్ మరో ఎన్నికల హామీ

అధికారంలోకి రాగానే జాతీయ స్థాయిలో కనీస వేతనంపై కీలక నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. కనీస వేతనాన్ని రోజుకు రూ.400 చేస్తామని తాజాగా మరో హామీ ఇచ్చింది. ఇదే వేతనాన్ని ఉపాధి హామీ కూలీలకు కూడా వర్తింపజేయనున్నట్టు తెలిపింది. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. గత పదేళ్ల మోదీ హయాంలో 1శాతం కన్నా తక్కువే వేతనాలు సవరించారని తెలిపారు. కానీ, 2009-14 మధ్య యూపీఏ ప్రభుత్వం వ్యవసాయ ఆధారిత రంగంలోని వారికి 8.6% చొప్పున, వ్యవసాయేతర రంగంలోని వారికి 6.9% చొప్పున వేతనాలు పెంచినట్టు వివరించారు. వ్యవసాయరంగంపై ఆధారపడిన వారి సంఖ్య 2016లో 41% ఉండగా ఇప్పుడు అది 47శాతానికి పెరిగిందని, వీరికి తమ నిర్ణయంతో మేలు జరుగుతుందని ఖర్గే పేర్కొన్నారు.

ఓవైపు తీవ్ర క్షుద్బాధ.. మరోవైపు ఆహార వృథా

» 2022లో ప్రపంచవ్యాప్తంగా ఆహార వృథా 105 కోట్ల మెట్రిక్ టన్నులు

» ఆకలి బాధితులు 78.3 కోట్ల మంది

నైరోబీ (కెన్యా), మార్చి 27: ప్రపంచవ్యాప్తంగా ఓవైపు కోట్లాది మంది తిండిలేక క్షుద్బాధను అనుభవిస్తుంటే.. మరోవైపు టన్నుల కొద్ది ఆహారం వృథా అవుతోందని తాజా నివేదిక స్పష్టం చేసింది. 2022 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయిన ఆహారంలో దాదాపు 19% వృథా అయినట్టు ఐక్యరాజ్యసమితి (యూఎన్) తాజా నివేదిక పేర్కొంది. ఇది దాదాపుగా 105 కోట్ల మెట్రిక్ టన్నులకు సమానమని తెలిపింది. ఈ మేరకు బుధవారం ప్రచురితమైన యూఎన్ పర్యావరణ కార్యక్రమానికి చెందిన ఆహార వృథా సూచీ నివేదిక స్పష్టం చేసింది. 2030 నాటికి ఆహార వృథాను సగానికి తగ్గించడానికి దేశాలు చేస్తున్న కృషికి సంబంధించిన పురోగతిని ఇది ట్రాక్ చేస్తోంది. 2021లో వెలువడిన నివేదిక ప్రకారం.. 2019లో ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయిన ఆహారంలో 17% వృథా అయినట్టు అంచనా వేశారు. ఇది 93.1 కోట్ల టన్నులకు సమానం. కాగా ప్రతి వ్యక్తి ఏడాదికి దాదాపు 79 కిలోల ఆహారాన్ని వృథా చేస్తున్నట్టుగా పరిశోధకులు గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా ఇది రోజుకు కనీసం వంద కోట్ల భోజనాల వృథాకు సమానమని పేర్కొన్నారు. ఈ వృథాలో ఎక్కువగా అంటే 60% గృహాల నుంచే ఉంటోంది. ఆహార సర్వీసులు లేదా రెస్టారెంట్ల నుంచి వృథా దాదాపు 28% ఉండగా.. రిటైలర్ల వృథా దాదాపు 12% ఉంది. ప్రపంచవ్యాప్తంగా 78.3 కోట్ల మంది తీవ్రమైన క్షుద్బాధను ఎదుర్కొంటున్న నేపథ్యంతో ఆహార వృథా పెరిగిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం అవుతోంది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఏలూరు	41.0	23.0
కర్నూలు	40.9	25.3
అనంతపురం	40.0	24.0
హైదరాబాద్	37.6	24.2
విజయవాడ	37.1	23.4
ఒంగోలు	35.1	24.8

రొమ్ము క్యాన్సర్ గుట్టు రట్టు

లండన్, మార్చి 27: ఈస్ట్రోజెన్ రిసెప్టార్ పాజిటివ్ (ఈఆర్+) క్యాన్సర్.. ఏటా ప్రపంచవ్యాప్తంగా నమోదయ్యే రొమ్ము క్యాన్సర్లలో 80% ఈ రకానివే. దీని బారిన పడిన మహిళల్లో.. ఈస్ట్రోజెన్ కారణంగా క్యాన్సర్ కణాలు వేగంగా పెరిగిపోతుంటాయి. కాబట్టి దాన్ని నియంత్రించేందుకు 'ఈస్ట్రోజెన్ బ్లాకర్స్' ఇవ్వడం ద్వారా హార్మోన్ థెరపీ చేస్తుంటారు. సర్జరీ, ఈస్ట్రోజెన్ బ్లాకర్స్ చికిత్స వల్ల తగ్గిన క్యాన్సర్.. మళ్లీ కొన్నాళ్ల తర్వాత కొందరిలో తిరగబెడుతుంటుంది. అలా ఎందుకు జరుగుతోందో తెలుసుకునేందుకు లండన్‌లోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ రిసెర్చ్' పరిశోధకులు పరిశోధన చేశారు. హార్మోన్ థెరపీ సమయంలో క్యాన్సర్ కణాల్లో కొన్ని హైబర్నేషన్ (దీర్ఘనిద్ర)లోకి జారుకుంటున్నట్టు.. చికిత్స ఆపేసిన కొన్నాళ్లకు మళ్లీ ఆ కణాలు క్రియాశీలం కావడంతో క్యాన్సర్ తిరగబెడుతున్నట్టు వారి పరిశోధనలో తేలింది. క్యాన్సర్ కణాలను చంపడానికి చేసే ఈ చికిత్సే కొన్ని కణాలను దీర్ఘనిద్రలోకి పంపుతోందని వారు గుర్తించారు. ఈ ప్రక్రియలో 'జీ9ఏ' అనే ఎంజైమ్ కీలకపాత్ర పోషిస్తోందని.. దాన్ని నియంత్రిస్తే క్యాన్సర్ కణాలు దీర్ఘనిద్రలోకి వెళ్లకుండా ఆపొచ్చని, అప్పటికే స్లీపింగ్ మోడ్‌లోకి వెళ్లిన కణాలు కూడా హార్మోన్ చికిత్స కారణంగా చనిపోతాయని వారు వెల్లడించారు. ఇందుకు సమర్థ చికిత్స విధానాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంది.

డబ్బుల్లేక పోటీ చేయట్లేదు

» కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ, మార్చి 27: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ పడటానికి అవసరమైన డబ్బులు లేకపోవటం వల్లనే తాను ఎన్నికల బరిలో నిల్చోలేదని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఏపీ నుంచి గానీ, తమిళనాడు నుంచి గానీ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయమని తనకు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అవకాశం ఇచ్చారని.. కానీ, తాను సున్నితంగా తిరస్కరించారన్నారు. బుధవారం ఢిల్లీలో జరిగిన 'టైమ్స్‌నౌ సదస్సు-2024'లో నిర్మల మాట్లాడుతూ ఈ వివరాలను తెలియజేశారు. 'వారం పది రోజులు ఆలోచించాక నడ్డాతో మాట్లాడాను. పోటీ పడటానికి తగినన్ని డబ్బులు లేవు. అంతేగాక, ఏపీనా? తమిళనాడా? అనేది కూడా తేల్చుకోలేకపోయా. దీంతో పాటు ఎన్నికల్లో పోటీ పడితే.. ఏ కులం? ఏ మతం? అనేవి కూడా లెక్కలేస్తారు. ఇదంతా చూసే నేను పోటీ పడలేనని చెప్పా. పార్టీ అధిష్ఠానం నా వాదనకు అంగీకరించింది. ఇందుకు వారికి కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు. దేశ ఆర్థికమంత్రి వద్ద డబ్బులు లేకపోవటం ఏమిటని సదస్సుకు హాజరైన వారు సరదాగా ప్రశ్నించగా.. తన వేతనం, తాను దాచుకున్న డబ్బులు మాత్రమే తనవి కానీ, భారత ప్రభుత్వ సొమ్ము (కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా) తనది కాదని నిర్మల జవాబిచ్చారు. తాను లోక్‌సభ ఎన్నికల్లో పోటీ పడకపోయినా, తమ పార్టీకి చెందిన పలువురు అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నానని గుర్తు చేశారు. నిర్మలా సీతారామన్ ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు.

అఘాడీలో మహా చిచ్చు!

» ఉద్ధవ్ సేన తీరుపై కాంగ్రెస్, పవార్ గుర్రు

» 17 ఎంపీ స్థానాలకు ఏకపక్షంగా అభ్యర్థుల ప్రకటనపై ఆగ్రహం



ముంబై, మార్చి 27: మహారాష్ట్రలోని మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)లో లుకలుకలు తీవ్రమయ్యాయి. ముంబైలోని ఐదు లోక్‌సభ స్థానాలు సహా 17 ఎంపీ సీట్లకు శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) ఏకపక్షంగా అభ్యర్థులను ప్రకటించడంపై కాంగ్రెస్, ఎన్‌సీపీ (శరద్ పవార్) తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయి. వీటిలో ముంబై సౌత్ సెంట్రల్, వాయవ్య ముంబై, సాంగ్లీ, భివండీ స్థానాలపై కాంగ్రెస్ గట్టిగా పట్టుబడుతుండగా.. భివండీ సీటు కోసం పవార్ ఎన్‌సీపీ కూడా డిమాండ్ చేస్తోంది. రాష్ట్రంలో 48 లోక్‌సభ స్థానాలుండగా వీటిలో 22 స్థానాల్లో పోటీచేస్తానని ఉద్ధవ్ సేన ఇదివరకే ప్రకటించింది. కాంగ్రెస్ 16, పవార్ ఎన్‌సీపీ 10, స్వాభిమానీ షేత్కారీ సంఘటన్‌కు ఒకటి ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించారు. పోటీచేసే స్థానాలపై ఓపక్క చర్చలు జరుగుతుండగానే ఉద్ధవ్ సేన 17మంది అభ్యర్థులతో మంగళవారం తొలి జాబితా ప్రకటించింది. దీనిపై ముంబై కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సంజయ్ నిరుపమ్ మండిపడ్డారు. ముంబైలోని ఐదు స్థానాల్లో పోటీచేయడం ద్వారా కాంగ్రెస్‌ను కాళ్లబేరానికి తీసుకురావాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోందని.. పొత్తు ధర్మాన్ని ఉల్లంఘించిందని ఆరోపించారు. కాంగ్రెస్‌ను కాపాడుకోవాలంటే తక్షణమే దానితో తెగతెంపులు చేసుకోవాలని బుధవారం అధిష్ఠానాన్ని డిమాండ్‌చేశారు. వాయవ్య ముంబై నుంచి పోటీచేయాలని ఆయన భావిస్తున్నారు. ఇక్కడ ఉద్ధవ్ సేన అమోల్ కీర్తికర్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. ఈ సీటు వ్యవహారంలో వారం వేచిచూస్తానని.. తర్వాత తన నిర్ణయం తీసుకుంటానని నిరుపమ్ అన్నారు. ఆయన బీజేపీ కూటమిలో చేరతారని ప్రచారం జరుగుతోంది. అయితే వాయవ్య ముంబైని వదులుకోవడానికి కాంగ్రెస్ సుముఖంగానే ఉంది. కానీ సాంగ్లీ, ముంబై సౌత్ సెంట్రల్ సీట్లను ఇచ్చేందుకు ససేమిరా అంటోంది. సాంగ్లీలో మాజీ సీఎం వసంతదాదా పాటిల్ మనవడు విశాల్ పాటిల్‌ను, సౌత్ సెంట్రల్‌లో ముంబై పీసీసీ అధ్యక్షురాలు వర్షా గైక్వాడ్‌ను బరిలోకి దించాలని ఆ పార్టీ భావిస్తుండగానే.. ఉద్ధవ్ సేన తన అభ్యర్థులను ప్రకటించడాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు సహించలేకపోతున్నారు. ఈ రెండు సీట్లలో పాలక మహాయుతి కూటమి (బీజేపీ-షిండే శివసేన-అజిత్ పవార్ ఎన్‌సీపీ)తో తలపడే సత్తా ఉద్ధవ్ సేనకులేదని.. అవసరమైతే ఈ రెండుచోట్ల స్నేహపూర్వక పోటీలకు దిగాలని భావిస్తున్నారు. కాగా అఘాడీలో చిచ్చుకు కాంగ్రెసే కారణమని రాజకీయవర్గాలంటున్నాయి. కొల్హాపూర్ స్థానంలో కొల్హాపూర్ రాజవంశానికి చెందిన షాహు మహరాజ్ ఛత్రపతిని అఘాడీ తన ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించింది. షాహును తన ఎన్నికల గుర్తుపై పోటీచేయించాలని ఉద్ధవ్‌సేన భావించింది. అయితే కాంగ్రెస్ తన హస్తం గుర్తుపై పోటీచేసేందుకు ఆయన్ను ఒప్పించింది. తమతో స్నేహం నెరపుతూనే దొంగ దెబ్బతీయడానికి కాంగ్రెస్ తెరచాటు ప్రయత్నాలు చేయడంపై ఉద్ధవ్‌సేన గుర్రుగా ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్, పవార్ ఎన్‌సీపీకి కలిపి 34% ఓట్లుండగా.. ఉద్ధవ్‌సేన కలిస్తే 40%పైనే ఓట్లు వచ్చే అవకాశముంది. వాస్తవానికి ఈ 3పార్టీలు ఒకదాని బలం పై మరొకటి ఆధారపడి ఉన్నాయి. ముంబైలో సీట్లు గెలవాలంటే ఉద్ధవ్‌సేనకు కాంగ్రెస్ మద్దతు, మరాఠ్వాడా ప్రాంతంలో పాలక కూటమిని దెబ్బతీయాలంటే కాంగ్రెస్‌కు ఉద్ధవ్‌సేన, పవార్ ఎన్‌సీపీల సహకారం కావాలి.

ఎంవీఏతో పొత్తు లేదు

మహా అఘాడీకి బాబాసాహెబ్ అంబేడ్కర్ మనవడు, వంచిత్ బహుజన్ అఘాడీ (వీబీఏ)అధినేత ప్రకాశ్ అంబేడ్కర్ గట్టి షాకిచ్చారు. దానితో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదన్నారు. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించేందుకు వీబీఏను వాడుకోవాలని ఎంవీఏ చూస్తోందని విమర్శించారు. మొదటి, రెండు దశల్లో పోలింగ్ జరిగే 13 స్థానాల్లో 8 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. అకోలా నుంచి ఆయనే బరిలోకి దిగుతున్నారు. వీటిలో ఇప్పటికే కాంగ్రెస్, ఉద్ధవ్ సేన తమ తమ అభ్యర్థులను ప్రకటించడం గమనార్హం. ఆయన నిర్ణయం దురదృష్టకరమని మహారాష్ట్ర సీఎల్పీ నేత బాలాసాహెబ్ తోరట్ వ్యాఖ్యానించారు.

కేజ్రీవాల్‌కు నిరాశే

» మధ్యంతర బెయిల్‌కు ఢిల్లీ హైకోర్టు నిరాకరణ

» విచారణ ఏప్రిల్ 3కి వాయిదా

» నేటితో ముగియనున్న ఈడీ కస్టడీ



పటియాలా హౌస్ కోర్టు ఆవరణలో ఆప్ లీగల్ సెల్ సభ్యుల ఆందోళన

న్యూఢిల్లీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టయిన ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసేందుకు న్యాయస్థానం నిరాకరించింది. తన అరెస్టును, ఈడీ కస్టడీకి పంపుతూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ స్వరణకాంత శర్మ విచారణ జరిపారు. తొలుత ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదిస్తూ, తమకు మంగళవారమే కేజ్రీవాల్ పిటిషన్ కాపీ అందిందని, దాన్ని పరిశీలించి బదులిచ్చేందుకు మూడువారాల సమయం కావాలని కోరారు. దీనిపై కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ అభ్యంతరం వ్యక్తం చేశారు. విచారణలో జాప్యం చేయటానికే పిటిషన్‌పై బదులిచ్చేందుకు ఈడీ మరింత సమయం కోరుతోందని ఆరోపించారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడానికి ఈడీకి సరైన ప్రాతిపదికే లేదని, మూడు వారాల గడువు ఇస్తే ఈలోపు మళ్లీ ఏదో ఒక స్క్రిప్టు సిద్ధం చేస్తారని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఒక ముఖ్యమంత్రిని ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నిస్తూ.. కేజ్రీవాల్‌కు ఉన్న సహజ, ప్రాథమిక, మానవ హక్కులను ఈడీ ఉల్లంఘించింది. అందుకే.. దీన్నీ తప్పుడు కేసుగా పరిగణించి కేజ్రీవాల్‌ను విడుదల చేయాలి. గురువారంతో కేజ్రీవాల్ రిమాండ్ గడువు ముగుస్తుంది. ఈలోపే హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వాలి' అని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. న్యాయమూర్తి స్పందిస్తూ... 'మధ్యంతర బెయిల్ కోరుతూ దరఖాస్తు చేసే స్వేచ్ఛ బాధితుడికి ఉంటుంది. అదే సమయంలో దానిపై సమాధానం చెప్పడానికి ఈడీకి అవకాశం ఇవ్వడం తప్పనిసరి. ఈడీ కౌంటర్ దాఖలు చేయాల్సిన అవసరం లేదని పిటిషన్ తరఫున న్యాయవాది చేసిన వాదనను తిరస్కరిస్తున్నాం' అని స్పష్టం చేశారు. కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ సాయంత్రం తీర్పును వెల్లడించారు. ఏప్రిల్ 2లోగా కౌంటర్ వేయాలని ఈడీని ఆదేశించారు. తదుపరి విచారణను ఏప్రిల్ 3కి వాయిదా వేశారు. కాగా.. కేజ్రీవాల్ ఈడీ కస్టడీ గురువారంతో ముగియనుంది. శుక్రవారం మధ్యాహ్నం ఆయనను ఈడీ రౌస్ అవెన్యూ కోర్టు ఎదుట హాజరు పరచనుంది. మరో 5-7 రోజుల కస్టడీని ఈడీ కోరే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇంకోవైపు.. కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టులో వాదనలు జరుగుతున్న సమయంలో ఆయన సతీమణి సునీత సంచలన ప్రకటన చేశారు. ఢిల్లీ మద్యం కేసుకు సంబంధించి గురువారం కోర్టులో కేజ్రీవాల్ అన్ని నిజాలు బయటపెడతారని, డబ్బు ఎక్కడుందో చెబుతారని, ఈ మేరకు కోర్టుకు ఆధారాలు కూడా సమర్పిస్తారని చెప్పారు. ఈ మేరకు ఒక వీడియోను సునీత విడుదల చేశారు.

అమెరికా వ్యాఖ్యలపై భారత్ సమన్లు

కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా కూడా స్పందించింది. 'నిష్పాక్షిక, పారదర్శక, నిర్ణీత కాలవ్యవధితో కూడిన న్యాయవిచారణ జరుగుతుందని భావిస్తున్నాం' అని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మంగళవారం తెలిపారు. దీనిపై ఢిల్లీలోని అమెరికా దౌత్యవేత్తకు కేంద్రప్రభుత్వం సమన్లు జారీ చేసింది. 'భారత్‌లో జరుగుతున్న కొన్ని న్యాయవిచారణలపై అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాం. ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని, వాటి అంతర్గత వ్యవహారాలను గౌరవించడం దౌత్య సంబంధాల్లో ఎంతో కీలకం. ప్రజాస్వామ్యదేశాల మధ్య దీనికి మరింత ప్రాధాన్యత ఉంటుంది. దీనిని పాటించకపోతే ఆయా దేశాల మధ్య సత్సంబంధాలు దెబ్బతినే ప్రమాదముంది. భారత్‌లోని న్యాయవ్యవస్థ పూర్తి స్వతంత్ర ప్రక్రియతో, పారదర్శకతతో కూడినది. దీనిపై మీ జోక్యం సరికాదు' అని విదేశాంగశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

జమ్మూకశ్మీర్‌లో ఏఎఫ్ఎస్‌పీఏ ఎత్తివేత!

» పరిశీలిస్తామన్న కేంద్ర మంత్రి అమిత్‌షా

» సెప్టెంబరుకన్నా ముందే అసెంబ్లీ ఎన్నికలు

న్యూఢిల్లీ, మార్చి 27: కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్‌లో సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని (ఏఎఫ్ఎస్‌పీఏ) ఉపసంహరించుకునే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించనున్నట్టు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ఈ ప్రాంతం నుంచి సైన్యాన్ని వెనక్కి తీసుకుని శాంతిభద్రతలకు సంబంధించిన బాధ్యతలను జమ్మూకశ్మీర్ పోలీసులకే అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టుగా మంగళవారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. ఏఎఫ్ఎస్‌పీఏను ఉపసంహరించుకోవాలని జమ్మూకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లోని పలు సంస్థలు, వ్యక్తులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో ఏఎఫ్ఎస్‌పీఏను ఉపసంహరించుకునే అంశాన్ని పరిశీలించనున్నట్టు షా పేర్కొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇంతకు ముందు జమ్మూకశ్మీర్ పోలీసులపై నమ్మకం ఉండేది కాదని, కానీ ఇప్పుడు వాళ్లు ఆపరేషన్లకు నాయకత్వం వహిస్తున్నారని షా చెప్పారు. కల్లోలిత ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహించే సైన్యం అవసరం అనుకుంటే సోదాలు, అరెస్టులు చేయడానికే కాకుండా కాల్పులు జరపడానికి కూడా ఏఎఫ్ఎస్‌పీఏ విస్తృత అధికారాలను కల్పిస్తోంది. జమ్మూకశ్మీర్‌లో ఏఎఫ్ఎస్‌పీఏ అమల్లో ఉన్నప్పటికీ ఈశాన్యరాష్ట్రాల్లోని 70 శాతం ప్రాంతాల్లో దీన్ని తొలగించినట్టు ఇంతకు ముందు షా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. జమ్మూకశ్మీర్‌లో సెప్టెంబరు కన్నా ముందే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని అమిత్‌షా పేర్కొన్నారు. సెప్టెంబరుకన్నా ముందే జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఇంతకు ముందే సుప్రీంకోర్టు ఆదేశించింది. జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడం ప్రధాని నరేంద్ర మోదీ హామీ అన్న షా దాన్ని నెరవేర్చనున్నట్టు చెప్పారు.

30 వేల కోట్లతో కంచె!

» మయన్మార్ సరిహద్దులో నిర్మాణం

మయన్మార్ సరిహద్దులో 1,610 కిలోమీటర్ల మేర కంచె ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.30 వేల కోట్లు వెచ్చించనుంది. ఈశాన్య ప్రాంతంలో స్మగ్లింగ్, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు జాతీయ భద్రతా కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఇరుదేశాల మధ్య వీసా రహిత రాకపోకల విధానానికి ముగింపు పలికేందుకు మయన్మార్ సరిహద్దులో కంచె నిర్మిస్తామని ప్రభుత్వం ఈ ఏడాది మొదట్లో ప్రకటించింది. కంచెకు సమాంతరంగా 1,700 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించేందుకు కూడా సీనియర్ అధికారుల కమిటీ అంగీకారం తెలిపిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.



రహదారిపై గజరాజుల గుంపు

గరుగుబిల్లి, మార్చి 27: పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం గిజబ ప్రధాన రహదారిపైకి గజరాజులు గుంపుగా వచ్చాయి. కొద్ది రోజుల కిందట కొమరాడ, కురుపాం, జియ్యమ్మ వలసల్లో సంచరించిన ఏనుగుల గుంపు బుధవారం రహదారిపైకి రావడంతో ప్రయాణికులు భయాందోళన చెందారు. ఏనుగులు వెళ్లేంత వరకు నిరీక్షించారు. ట్రాకర్స్ వచ్చి ఏనుగులను దిగువ ప్రాంతాలకు మళ్లించారు. దీంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.



కాకినాడ బీచ్‌లో టైగర్ ట్రయంఫ్-24 విన్యాసాలు

సర్పవరం జంక్షన్, మార్చి 27: ఇండియా-అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రయంఫ్-24 విన్యాసాలు బుధవారం కాకినాడ సాగరతీరంలో ప్రారంభమయ్యాయి. సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో ఇరుదేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎక్స్ టైగర్ ట్రయంఫ్-2024లో సైనిక విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. భారత్, యూఎస్ దళాల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించేందుకు ఈ విన్యాసాలు దోహదపడతాయని అధికారులు తెలిపారు.



'దిశ' వాహనాలకు కోడ్ వర్తించదా?

పెద్దాపురం, మార్చి 27: వైసీపీ రంగులు అద్దిన 163 దిశ పెట్రోలింగ్ వాహనాలను రాష్ట్రవ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్లకు కేటాయించారు. బుధవారం కాకినాడ జిల్లా పెద్దాపురంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద దిశ పెట్రోలింగ్ వాహనం ఇలా వైసీపీ రంగులతో కనిపించింది. పార్టీ రంగులతో తిరుగుతున్న ఈ వాహనాలకు ఎన్నికల కోడ్ వర్తించదా? అని స్థానికులు చర్చించుకుంటున్నారు.



ప్రకాశం జిల్లా ఈదుమూడిలో డ్రగ్స్ కేసు ప్రధాన నిందితుడు కూనం హరికృష్ణ తండ్రి పూర్ణచంద్రరావు ఇంటి నుంచి బయటకు వస్తున్న మంత్రి నాగార్జున

'డ్రగ్స్' కూనం ఇంటికి మంత్రి మేరుగ!

ఈ కలయికలో మర్మమేమిటో...

నాగులుప్పలపాడు మార్చి 27: డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కూనం కుటుంబ సభ్యుల ఇంటికి మంత్రి మేరుగ నాగార్జున వెళ్లడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొద్దిరోజుల క్రితం విశాఖ పోర్టు నుంచి పెద్దఎత్తున మాదక ద్రవ్యాలతో వస్తున్న సంధ్య ఆక్వా కంపెనీకి చెందిన కంటైనర్‌ను సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్న సంగతి విదితమే. ఆ కంపెనీ అధినేత ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామానికి చెందిన కూనం వీరభద్రరావు. ఆయన సోదరుడు కూనం పూర్ణచంద్రరావు వైసీపీలో కీలక నాయకుడిగా కొనసాగుతుండగా, ఆయన తనయుడు హరికృష్ణపై డ్రగ్స్ దిగుమతి వ్యవహారంలో సీబీఐ అధికారులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ తరుణంలో మంత్రి నాగార్జున బుధవారం ఈదుమూడికి వెళ్లి డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కూనం హరికృష్ణ తండ్రి పూర్ణచంద్రరావును పరామర్శించడం చర్చనీయాంశంగా మారింది. ఆ సమయంలో మంత్రి వెంట ఒకరిద్దరు నాయకులు మాత్రమే ఉన్నారు. పూర్ణచంద్రరావు ఇంట్లోకి మీడియాతో సహా ఎవరినీ అనుమతించలేదు. మంత్రి నాగార్జున తీరును సొంత పార్టీ నాయకులే విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా పూర్ణచంద్రరావు ఇంటిపై వైసీపీ జెండా ఎగరడం గమనార్హం.

బిల్లుల కోసం బరితెగింపు

(మొదటి పేజీ తరువాయి)

79 కోట్ల బిల్లులు చెల్లించేందుకు సీఎఫ్ఎమ్ఎస్ నుంచి చకచకా టోకెన్ నంబర్లు కూడా జారీ అయ్యాయి. ఇక బిల్లులు చెల్లించడమే మిగిలింది. వైసీపీ నేతల వికృత దౌర్జన్యాలకు పరాకాష్ఠ ఇది. ఈ వ్యవహారంలో ముఖ్యనేత వద్ద పనిచేసే ఓ అధికారి పాత్ర కూడా ఉంది. పని చేసి పెట్టాలని ఆర్అండ్‌బీ ఉన్నతాధికారిపై ఒత్తిడి చేయగా ఆయన చేతులెత్తేశారు. దీంతో తమ మనుషులను ఆర్అండ్‌బీ ఆఫీసుకు పంపించి దౌర్జన్యంగా బిల్లులను అప్‌లోడ్ చేయించి టోకెన్లు జారీ చేయించారు. రోడ్డు పనులు చేసిన కాంట్రాక్టర్లకు హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం సీనియారిటీని దృష్టిలో పెట్టుకొని బిల్లులు చెల్లించాల్సి ఉంది. అలా వెళ్తే బిల్లులు రావనుకొని ఓ మంత్రి అనుచరులు ఈ నెల 19వ తేదీ రాత్రి దొడ్డిదారిని ఎంచుకున్నారు.

1100 కోట్ల బకాయిలు

ఆర్అండ్‌బీలో సెంట్రల్ రోడ్ ఫండ్ (సీఆర్ఎఫ్)తో పాటు వివిధ పద్దులపై చేపట్టిన వర్క్‌లకు సంబంధించి కాంట్రాక్టర్లకు 1,100 కోట్ల రూపాయలు ప్రభుత్వం బకాయి పెట్టింది. ఇందులో సీఆర్ఎఫ్ బిల్లులే 700 కోట్లు ఉన్నాయి. గత నాలుగున్నరేళ్లుగా బిల్లులు పొందేందుకు కాంట్రాక్టర్లు అలుపెరగని పోరాటం చేస్తున్నారు. ఈ క్రమంలో బిల్లులు రాక ఇప్పటికే 50 మంది వివిధ కారణాలతో మరణించారు. సీఆర్ఎఫ్ బిల్లుల చెల్లింపుపై కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. 100కు పైగా కేసులు ఒక్క హైకోర్టులోనే ఉన్నాయి. కేంద్రం సీఆర్ఎఫ్ నిధులు ఇవ్వకపోవడం వల్లే బిల్లులు పెండింగ్ ఉన్నాయని సర్కారు కోర్టుకు నివేదించింది. సీనియారిటీ ప్రకారం ఎవరు ముందు వస్తే వారికే (ఫస్ట్ ఇన్ ఫస్ట్ ఔట్-ఎఫ్ఐఎఫ్ఓ) విధానంలో బిల్లులు చెల్లిస్తామని కోర్టుకు నివేదించింది. ఇలా సీనియారిటీ ప్రకారం 179 కోట్ల రూపాయల బిల్లులను చెల్లించేందుకు ఆర్అండ్‌బీలోని సీఆర్ఎఫ్ విభాగం బిల్లులను సీఎఫ్ఎమ్ఎస్ (కాంప్రహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టం)లో అప్‌లోడ్ చేసింది. ఆ నిధుల విడుదలకు సీఎఫ్ఎమ్ఎస్ నుంచి టోకెన్‌లు జారీ కావాలి. వాటి ఆధారంగానే బిల్లులు చెల్లిస్తారు. ఇప్పుడు అమల్లో ఉన్న విధానం ఇది. ఈ నెల 16 నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఈ సమయంలో రాజకీయ పార్టీల్లో ఉన్న కాంట్రాక్టర్లు, నేతలకు బిల్లుల చెల్లింపు విషయంలో అధికారులు, సిబ్బంది అత్యుత్సాహం చూపడానికి వీల్లేదు. నిబంధనల మేరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది.

జగన్ మేనమామకూ..

ముఖ్యమంత్రి జగన్ మేనమామ, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి చేసిన కాంట్రాక్టులకు కూడా బిల్లులు చెల్లించేందుకు సిద్ధం చేశారు. ఆయన చేసిన వర్క్‌లకు కొంత మేర రూ.12 కోట్ల బిల్లులు చెల్లించేందుకు సీఎఫ్ఎమ్ఎస్‌లో అప్‌లోడ్ చేశారు. ఇందుకు టోకెన్లు జారీ కావాల్సి ఉంది.

సిబ్బందిపై దౌర్జన్యం

రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నియోజకవర్గాలు లేదా వారు సిఫారసు చేసిన ప్రాంతాల్లో కొందరు కాంట్రాక్టర్లు సీఆర్ఎఫ్ వర్క్‌లు చేపట్టారు. వారికి సీనియారిటీ ప్రకారమే బిల్లులు ఇవ్వాలి. ప్రస్తుతమున్న సీనియారిటీ ప్రకారం వారి బిల్లులు సీఎఫ్ఎమ్ఎస్‌లో అప్‌లోడ్ చేయడానికే కనీసం ఐదారు నెలల సమయం పడుతుంది. ఇక చెల్లింపులు ఎప్పుడు ఉంటాయో అంచనా వేయడం కష్టమే. దీంతో ఈ ఇద్దరి నేతల ప్రాంతాల్లో వర్క్‌లు చేసిన కాంట్రాక్టర్ల బిల్లులను అందరి కన్నా ముందు అప్‌లోడ్ చేయాలని ఆర్అండ్ బీ చీఫ్ ఇంజనీర్‌పై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. అప్పటికే కోడ్ రావడంతో ఇలా చేయడం సరికాదని, పైగా తమకు సమస్యలొస్తాయని అధికారులు స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో ముఖ్యనేత వద్ద పనిచేస్తున్న ఓ ముఖ్య అధికారి, ఆర్థిక శాఖకు చెందిన మరో అధికారి బిల్లులు అప్‌లోడ్ చేయాలని మౌఖికంగా ఆదేశించినట్లు తెలిసింది. ఏదైనా జరిగితే తాము చూసుకుంటామని, ముందు బిల్లులు సీఎఫ్ఎమ్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. అయినా సిబ్బంది భయపడ్డారు. దీంతో ఓ మంత్రికి సంబంధించిన మనుషులు ఈ నెల 19వ తేదీ రాత్రి ఆర్అండ్‌బీ ఆఫీసుకు వచ్చి సీఆర్ఎఫ్ విభాగంలో చొరబడ్డారు. ఫోన్‌లో వచ్చిన మౌఖిక ఆదేశాలతో ఇద్దరు కాంట్రాక్టర్లకు 79 కోట్ల విలువైన బిల్లులను సీఎఫ్ఎమ్ఎస్‌లో అప్‌లోడ్ చేసినట్లు సమాచారం. ఆ సమయంలో ఉద్యోగుల పట్ల దౌర్జన్యంగా వ్యవహరించినట్లు తెలిసింది. ఆర్అండ్‌బీ అధికారులు ఈ ఘటనకు సంబంధించి ఆ శాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేయాల్సి ఉంది. అయితే ఇందులో పెద్దలు ఉండటంతో మౌనంగా ఉన్నట్లు తెలిసింది.

మచ్చుకు కొన్ని టోకెన్లు
2023 - 2691967
2023 - 2691375
2023 - 2690998
2023 - 2693107
2023 - 2693377
2023 - 2691138

అప్‌లోడ్ కాగానే టోకెన్‌లు

మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నియోజకవర్గం డోన్‌లో వర్క్‌లు చేసిన కాంట్రాక్టర్, మంత్రి బొత్స సత్యనారాయణ ప్రాంతమైన చీపురుపల్లిలో సీఆర్ఎఫ్ వర్క్‌లు చేసిన కాంట్రాక్టర్ బిల్లులు 19వ తేదీ రాత్రి సీఎఫ్ఎమ్ఎస్‌లో అప్‌లోడ్ అయ్యాయి. ఆ వెంటనే వారికి మాత్రమే 79 కోట్ల రూపాయల మేర బిల్లులు చెల్లించేందుకు సీఎఫ్ఎమ్ఎస్ నుంచి టోకెన్లు జారీ అయ్యాయి. అందులో ఆరు టోకెన్లు ఒకే కాంట్రాక్టర్‌కు ఇచ్చారు. వాటి విలువ 55.30 కోట్లు. ఆ కాంట్రాక్టర్ నంద్యాలలో రెండు వర్క్‌లు, కడపలో నాలుగు వర్క్‌లు చేశారు. చీపురుపల్లి ప్రాంతంలో పనులు చేసిన కాంట్రాక్టర్‌కు రూ.24 కోట్ల టోకెన్‌లు జారీ అయినట్లు తెలిసింది.

బిల్డింగ్ అసోసియేషన్ ఫిర్యాదు

ఆర్అండ్‌బీ ఆఫీసులో వైసీపీ కీలక నేత అనుచరులు దౌర్జన్యం చేసిన విషయం మిగతా ఆర్అండ్‌బీ కాంట్రాక్టర్ల దృష్టికి వెళ్లడంతో వెంటనే ప్రధాన కార్యాలయం పరిసరాలకు వచ్చి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇద్దరు కాంట్రాక్టర్లకు సీనియారిటీకి విరుద్ధంగా సీఎఫ్ఎమ్ఎస్ ద్వారా బిల్లులు చెల్లించే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించారు. తమకు సీనియారిటీ ప్రకారం ఫస్ట్ ఇన్ ఫస్ట్ ఔట్-ఎఫ్ఐఎఫ్ఓ విధానంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే అంశంపై బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ విభాగం.. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కేంద్ర ఎన్నికల కమిషన్, రాష్ట్ర ముఖ్యఎన్నికల అధికారికి లేఖలు రాసింది.

ప్రవీణ్ ప్రకాశ్ 'ప్రచారం'!

23న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలకు ఆదేశం

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని, వారితో ఆన్‌లైన్ విధానంలో స్వయంగా తానే మాట్లాడతానని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఇచ్చిన ఆదేశాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. తరచూ 'ఫ్రమ్ ది డెస్క్ ఆఫ్ ది ప్రిన్సిపల్ సెక్రటరీ' పేరుతో ఆయన వీడియోలు విడుదల చేస్తుంటారు. ఈ సారి ఏప్రిల్ 2న వీడియోకు బదులుగా నేరుగా టీచర్లతో ఇంటరాక్ట్ అవుతానని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షల సమయంలో దీనివల్ల సమయం వృథా తప్ప ఎలాంటి ఉపయోగం లేదని టీచర్లు భావిస్తుంటే, చివరి పరీక్షల అనంతరం ఏప్రిల్ 23న విద్యార్థుల తల్లిదండ్రులతో కూడా మాట్లాడతానని ప్రవీణ్ ప్రకాశ్ ప్రకటించారు. ఆ రోజు వారితో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల రిపోర్ట్ కార్డులు పంపిణీ చేయాలన్నారు. కాగా, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న ఈ సమయంలో తల్లిదండ్రులందరినీ ఒక చోట సమావేశపరచడం నిబంధనలకు విరుద్ధం అవుతుందని టీచర్లు అంటున్నారు. ఇదంతా అధికార పార్టీకి ప్రచారంగా మారుతుందన్న వాదన వినిపిస్తోంది.

టీఎస్ ఎప్‌సెట్‌కు ఏపీలో పరీక్షాకేంద్రాల పెంపు

హైదరాబాద్ సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎప్‌సెట్‌కు ఆంధ్రప్రదేశ్‌లో పరీక్షాకేంద్రాలను పెంచినట్లు అధికారులు తెలిపారు. టీఎస్ ఎప్‌సెట్‌కు ఈ ఏడాది ఏపీలో పరీక్షాకేంద్రాలను భారీగా తగ్గించడంపై 'ఎప్‌సెట్‌కు ఏపీలో తగ్గిన పరీక్షాకేంద్రాలు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి టీఎస్ ఎప్‌సెట్ ఉన్నతాధికారులు స్పందించారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎప్‌సెట్‌కు ఏపీలో తగినన్ని పరీక్షా కేంద్రాలను సిద్ధం చేయాలని, ఏపీ అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సెట్ నిర్వహణ బాధ్యత చేపట్టిన జేఎన్‌టీయూ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఏపీ నుంచి వస్తున్న డిమాండ్ మేరకు అవసరమైతే మరో 10 వేలమంది అభ్యర్థులకు సరిపడేలా మరికొన్ని పరీక్షాకేంద్రాలను సిద్ధం చేయాలని అధికారులు సూచించారు.

వైసీపీ పాలనలో దగా పడ్డ గిరిజనులు: ధారునాయక్

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గిరిజనుల కోసం చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన 16 సంక్షేమ పథకాలను జగన్ కక్ష పూరితంగా రద్దు చేయడమే కాక, కేంద్ర నిధుల్ని కూడా దారి మళ్లించాడని టీడీపీ ఎస్టీసెల్ అధ్యక్షుడు ఎం.ధారునాయక్ ధ్వజమెత్తారు. టీడీపీ ప్రభుత్వంలో గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేస్తే.. జగన్ సర్కార్ దాడులను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. అనేకమంది గిరిజనులను వైసీపీ నేతలు పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు.

రెడ్లకు 48 సీట్లు.. సామాజిక న్యాయమా?: దీపక్‌రెడ్డి

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు తగ్గించి, వారికి 16,800 స్థానిక సంస్థల పోస్టులు పోయేలా చేసి, 48 మంది రెడ్లకు అసెంబ్లీ సీట్లు ఇవ్వడమే సామాజిక న్యాయమా? అంటూ టీడీపీ నేత దీపక్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఐదేళ్లలో జగన్ అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.8 లక్షల కోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టారన్నారు.

ఇది వరకు చీర ఉండీదా.. జాకెట్ ఉండీదా..?

» గిరిజన మహిళతో వైసీపీ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు



గిరిజన మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి, మార్చి 27: 'ఇది వరకు ఓ చీర ఉండీదా, జాకెట్ ఉండీదా?' అంటూ గిరిజన మహిళను కించపరిచేలా వైసీపీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడిన మాటలు పెను దుమారం రేపాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా 25న విజయనగరం జిల్లా కాశిందొరవలస పంచాయతీ డొంగురువలస గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గిరిజన మహిళ సమస్యలపై ఎమ్మెల్యేని ప్రశ్నించింది. "మేమంతా ఎక్కడ ఉన్నోళ్లం అక్కడే ఉన్నాం. కొండోళ్లం కొండోళ్లాగే ఉండిపోనాము. మా సమస్యలు పట్టించుకోలేదు. ఏసిన రోడ్డు ముక్కముక్కలుగా ఊడిపోతాంది. మా ఊరి పెద్దలు పట్టించుకోనేదు. ఎవులూ పట్టించుకోలేదు" అని వాపోయింది. ఎమ్మెల్యే ఆ మహిళ భుజంపై చేయివేసి వారిస్తూ.. "ఎక్కడోళ్లు అక్కడ కాకపోతే పొరుగూరులో ఉన్నారేంటి..? ఇదివరకు జాకెట్ ఉండీదా..? ఓ చీర ఉండీదా..?" అన్నారు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో ఎమ్మెల్యే తీరును కొందరు విమర్శిస్తున్నారు.

బొబ్బిలి వైసీపీ ఎమ్మెల్యే పురుషహంకారి: సంధ్యారాణి

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నేతలకు మహిళలను అవమానించడం కొత్తేమీ కాదు. మహిళలపై దాడులు కూడా వారికి అలవాటే. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చినఅప్పలనాయుడు గిరిజన మహిళ పట్ల చేసిన వ్యాఖ్యలు ఆయన పురుషహంకారానికి నిదర్శనం' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి విమర్శించారు. వైసీపీ అధికారంలోకి రాకముందు గిరిజనులకు చీరలు, రవికలు లేవనీ, జగన్ సీఎం అయిన తర్వాతే వచ్చాయంటూ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై ఆమె మండిపడ్డారు. చినఅప్పలనాయుడుకు 70 ఏళ్లు వచ్చినా బుద్ధి మాత్రం మారలేదన్నారు.

వ్యాపారిపై మోయలేని భారం



జగన్ సర్కారు ఇటీవల ధాన్యంపై 1% సెస్ విధించింది. మిల్లర్లు, డీలర్లు, టోక్ వ్యాపారులపై సెస్ భారాన్ని మోపింది. ఈ నిర్ణయం బియ్యం ధరలను పెంచినట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రభుత్వ విధానం ఇలాగే కొనసాగితే, రానున్న రోజుల్లో మరింతగా ధరలు పెరగవచ్చునని అంటున్నారు. అప్పుడిక అన్నం తినడం కూడా కష్టమవుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, బొండాలు, ముతక, లావు రకాల ధాన్యం ధరల్లో మాత్రం మార్పు లేదు.

పొయ్యి ఎక్కని సన్నాలు

» తినకుండానే ఆకలిని చంపేస్తున్న ధరలు
» తుఫాన్ దెబ్బకు నాణ్యమైన బియ్యానికి రెక్కలు
» కిలో రూ.60-65... మరో 10 పెరిగే అవకాశం!
» రాష్ట్రంలో తరిగిపోతున్న పాత బియ్యం నిల్వలు
» కేంద్రం ఎగుమతులు నిషేధించినా దిగిరాని ధర
» జగన్ సర్కారు 'సెస్' పోటుతో వ్యాపారులు కుదేల్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని చాలా నగరాల్లో నాణ్యమైన బియ్యం కిలో రూ.60-65 చొప్పున అమ్ముతున్నారు. ఆ ధరలకే సామాన్యుడు అమ్మో.. అంటున్నాడు. కానీ, బియ్యం రేటు మరో రూ.5-10పెరిగే సూచనలున్నాయి. దీంతో అన్నం తినకుండానే ఆకలి చచ్చిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. 2023ఖరీఫ్‌లో వరి సాగు తగ్గింది. పండిన పంట కూడా మిచౌంగ్ తుఫాన్‌కు దెబ్బతింది. 2022 నాటి(పాత) బియ్యం నిల్వలు పూర్తిగా తరిగిపోయాయి. రాష్ట్రంలో నాణ్యమైన బియ్యానికి (సన్న రకాలు) డిమాండ్ పెరగడానికి ఇవన్నీ కారణాలుగా చెబుతున్నారు. దీంతో ఉత్పత్తి- సరఫరాలో పెరిగిన అంతరం బియ్యం ధరలను భగ్గుమనిపిస్తోంది. గత ఏడాది దేశంలో వరి సాగు, ఉత్పత్తి తగ్గిన నేపథ్యంలో కేంద్రప్రభుత్వం గత ఆగస్టు, సెప్టెంబరులో ఇతర దేశాలకు బియ్యం ఎగుమతిపై నిషేధం విధించింది. అయినా సూపర్‌ఫైన్ రకం బియ్యం కిలోకు రూ.10పైన పెరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మన రాష్ట్రంలో ప్రస్తుతం సూపర్‌ఫైన్ రకం బియ్యం 25కిలోల బ్యాగ్ రూ.1,625 ఉండగా, సన్న రకాలు రూ.1,500, సాధారణ రకాలు రూ.1,250కు తగ్గడంలేదు. మిల్లర్ రేటు ప్రకారం నిరుడు సెప్టెంబరులో క్వింటా ధాన్యం రూ.2,050 పలికితే, ఇప్పుడు రూ.2,200 ఇస్తున్నారు. కానీ క్వింటా బియ్యం గత ఏడాది మార్చి నుంచి అక్టోబరు వరకు రూ.3,500వరకు ఉండగా, నవంబరు నుంచి రూ.4,500కు పెరిగింది. దీనికి జీఎస్టీ, రవాణ ఖర్చులు, రిటైలర్ల లాభాలు కలుపుకొంటే క్వింటా రూ.6వేలు అవుతోంది. కరువు వల్ల సాగు తగ్గడం, పండిన ధాన్యం పాడైపోవడంతో బియ్యం ఉత్పత్తి పడిపోయింది. ఒడిశా, బిహార్, డెహ్రాడూన్, మహరాష్ట్ర నుంచి వచ్చే శ్రీరామ్ (హెచ్ఎంటీ) సాంబమసూరి, నెల్లూరు, కర్నూలు సన్నాలు, ఆర్ఎన్ఆర్ 15048 రకాల సన్నరకాల బియ్యం ధరలు పేదవర్గాలకు అందనివిధంగా 25కిలోలు రూ.1,600పైన పలుకుతున్నాయి. ఏపీలో చాలావరకు ధాన్యం దెబ్బతిని, బియ్యం ఉత్పత్తి-సరఫరాలో అంతరం ఏర్పడినందునే బియ్యం ధరలు పెరిగాయని వ్యాపారుల చెబుతున్నారు. కరువు, తుఫాన్ ప్రభావం దక్షిణాది రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా బియ్యం ఉత్పత్తి, మార్కెట్‌పై పడింది. రాష్ట్రంలో ఖరీఫ్ వరి సాగు 11.25లక్షల ఎకరాల్లో తగ్గింది. కృష్ణా, తుంగభద్ర జలాశయాల కింద సాగునీటి సమస్యతో సన్నరకాల సాగు తగ్గింది. గోదావరి డెల్టాకు అధిక శాతం సాగునీటి లభ్యతవల్ల అక్కడ అన్ని రకాల ధాన్యం పండించారు. కానీ తుఫాన్ కబళించి, రైతుల్ని దెబ్బతీసింది. ఈ ఏడాది ఏపీతోపాటు తమిళనాడు, కర్ణాటకలో కూడా సన్నరకాల వరి పండించే ప్రాంతాల్లో ఖరీఫ్ ప్రారంభంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో సన్నరకాల సాగు గణనీయంగా తగ్గింది. ఇదే అదునుగా సన్నరకాల బియ్యాన్ని బ్లాక్ చేసి, మార్కెట్‌లో డిమాండ్ సృష్టించి, అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న వారూ లేకపోలేదు. ఖరీఫ్ ధాన్యం మిచౌంగ్ తుఫాన్‌కు తడిసి, గింజ దెబ్బతినడంతో నాణ్యత తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. కానీ తేమ శాతం ఎక్కువ ఉందని రైతు దగ్గర తక్కువ ధరకు కొని, మిల్లుల్లో బియ్యంగా మార్చి, మార్కెట్‌లో మాత్రం అధిక ధరలకే విక్రయించడం గమనార్హం.

విద్యుత్‌శాఖ బలవంతపు వసూళ్లు ఆపాలి

» సీపీఎం రాష్ట్ర నేత బాబూరావు డిమాండ్

అమరావతి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అదనపు డిపాజిట్ల పేరుతో బలవంతపు వసూళ్లు ఆపాలని, విద్యుత్ కనెక్షన్లు కట్ చేయడం నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. ఆయన నేతృత్వంలో బుధవారం విజయవాడలోని విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ.. సీఎం జగన్ సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై రూ.వేల కోట్ల భారం మోపారని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాలు కుమ్మక్కై ప్రజలపై మోపుతున్న కరెంటు చార్జీల భారం తడిసి మోపడయ్యిందంటూ ధ్వజమెత్తారు.

లోక్‌సభకు హాజరులో టీడీపీ ఎంపీలే ముందు

» 274 రోజులకు సగటున 229 రోజులు హాజరు
» 185 రోజులతో 12వ స్థానంలో వైసీపీ ఎంపీలు

న్యూఢిల్లీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పదిహేడవ లోక్‌సభ సమావేశాల్లో అన్ని పార్టీల ఎంపీల కంటే టీడీపీ సభ్యులే సభకు అత్యధికసార్లు హాజరయ్యారు. లోక్‌సభ సమావేశాలు 274 రోజుల పాటు నిర్వహించగా.. టీడీపీ ఎంపీలు సగటున 229 రోజులు సభకు హాజరయ్యారు. ఆ తర్వాత స్థానంలో సీపీఎం సభ్యులు సగటున 226 రోజులు హాజరయ్యారు. సగటున 185 రోజుల పాటు హాజరైన వైసీపీ సభ్యులు 12 వస్థానంలోనూ, 181 రోజులతో బీఆర్ఎస్ ఎంపీలు 13 వస్థానంలోనూ నిలిచారు. 17వ లోక్‌సభ సమావేశాలు 2019 జూన్ నుంచి 2024 ఫిబ్రవరి వరకు జరిగాయి. మహారాష్ట్ర ఎంపీల్లో ఒక్కొక్కరూ సగటున 370 ప్రశ్నలు అడగగా.. ఏపీ ఎంపీలు 275, రాజస్థాన్ సభ్యులు 273 ప్రశ్నలు అడిగారు.

'వివేకం' సినిమా విడుదలను ఆపండి

» ఎన్నికల సంఘానికి వైసీపీ ఎమ్మెల్సీ అప్పిరెడ్డి ఫిర్యాదు

అమరావతి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): 'వివేకం' సినిమా ట్రైలర్ స్ట్రీమింగ్‌ను, ఆ సినిమా విడుదలను నిలుపుదల చేయాలంటూ వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)కి ఫిర్యాదు చేశారు. వివేకం సినిమా వైసీపీపై ప్రజల్లో చెడు ముద్ర వేసే అవకాశం ఉందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. మాజీ ఎంపీ వివేకానందరెడ్డి హత్యలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సతీమణి భారతిరెడ్డి, అవినాశ్‌రెడ్డి ప్రమేయం ఉన్నట్టుగా ట్రైలర్ చూపిస్తోందని ఆ ఫిర్యాదులో తెలిపారు. వైసీపీ ఫిర్యాదు నేపథ్యంలో సినిమా విడుదలను నిలుపుదల చేసే అంశంపై నిర్ణయం కోసం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం కేంద్ర ఎన్నికల సంఘా (ఈసీ)నికి లేఖ రాసింది.

14న ఫర్టిలైజర్స్ డీలర్స్ సంఘం ఎన్నికలు

అమరావతి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 2024-17 కాలవ్యవధికి నూతన కార్యవర్గ ఎన్నికలు ఏప్రిల్ 14న నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు వీవీ నాగిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయదలిచిన అభ్యర్థులు బుధవారం నుంచి విజయవాడలోని అసోసియేషన్ కార్యాలయం నుంచి నామినేషన్ పత్రాలను పొందవచ్చని తెలిపారు. ఎన్నికలు ఏప్రిల్ 14న గుంటూరులోని అసోసియేషన్ కళ్యాణ మండపంలో నిర్వహిస్తామని, అదే రోజు సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు.

సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి

» సీఈవో మీనాకు ఏపీ పెన్షనర్స్ పార్టీ ఫిర్యాదు

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులో ఉండగా అధికార పార్టీకి అనుకూలంగా, ఉద్యోగులను ప్రభావితం చేసేలా వ్యాఖ్యలు చేసిన ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాకు ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ ఫిర్యాదు చేసింది. బుధవారం అమరావతి సచివాలయంలో మీనాకు ఫిర్యాదు చేసిన అనంతరం ఆ పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయన్ మీడియాతో మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమం చూడాల్సిన సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి రాజకీయపరమైన వ్యాఖ్యలు చేస్తున్నారనే విషయాన్ని సీఈవో దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వైసీపీకి ఓట్లు వేయాలని ఉద్యోగులను, వలంటీర్లను ప్రలోభపెట్టే ప్రయత్నం చేస్తున్నారే తప్ప ఉద్యోగుల సంక్షేమం పట్టడంలేదని మండిపడ్డారు. చంద్రశేఖర్‌రెడ్డిని వెంటనే పదవి నుంచి తప్పించాలని సీఈవోను కోరామని తెలిపారు. సీఎస్, గవర్నర్ కలగజేసుకుని ప్రభుత్వ సలహాదారుగా ఆయన్ను తప్పించాలని సుబ్బరాయన్ డిమాండ్ చేశారు.

మంచినీరు ఇచ్చాకే గ్రామానికి రండి!

» ఏలూరు జిల్లాలో మేకా అప్పారావు..
» నెల్లూరు జిల్లాలో మేకపాటి విక్రమ్‌రెడ్డికి సెగ

ముసునూరు, మార్చి 27: ఎన్నికల ప్రచారంలో వైసీపీ ఎమ్మెల్యేలకు చేదు అనుభవం ఎదురైంది. నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు ఏలూరు జిల్లా ముసునూరు మండలం రమణక్కపేటలో బుధవారం ప్రచారం నిర్వహించారు. మంచినీళ్లు ఇచ్చాకే అరుంధతినగర్ కాలనీలోకి రావాలంటూ కాలనీ వాసులు ఆయనను అడ్డుకున్నారు. రెండేళ్ల నుంచి కాలనీకి మంచినీరురాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పలుమార్లు సర్పంచ్‌కు చెప్పినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఏడాది క్రితం మీరు రమణక్కపేట వచ్చినప్పుడు సమస్యను మీ దృష్టికి తెచ్చాం. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారే తప్ప నెరవేర్చలేదు. ఎస్సీలంటే అంతా చులకనా! ఎన్నికలు వచ్చేసరికి ఇప్పుడు గుర్తుకువచ్చామా? మంచినీటితోపాటు రహదారులు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించే వరకు మీరు కాలనీలోకి రావద్దు' అంటూ మండిపడ్డారు. రెండురోజుల్లో మంచినీరు సమృద్ధిగా ఇచ్చేలా చర్యలు తీసుకుంటానని, మిగిలిన సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో ప్రచారం ముందుకు సాగింది. నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికీ సమస్యల సెగ తగిలింది. దువ్వూరులో ప్రచారం చేస్తున్న ఆయన్ను సమస్యలపై కాలనీవాసులు నిలదీశారు. సోమశిల రిజర్వాయర్ కాలువ కింద సాగు చేసిన వరి పంటలు నీరు లేక ఎండిపోతున్నాయని తెలిపారు. చెన్నకేశవస్వామి ఆలయం వీధిలో రోడ్డు నిర్మాణంపై హామీ ఇప్పటికీ నెరవేరలేదన్నారు. ఎస్టీకాలనీలో రోడ్డు, డ్రైనేజీ లేదంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలయ్యాక అన్నీ పరిష్కరిస్తామంటూ ఎమ్మెల్యే ముందుకుసాగారు.





నెల్లూరు జిల్లా దువ్వూరులో వైసీపీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని నిలదీస్తున్న గ్రామస్థులు

పొత్తు ధర్మాన్ని పాటిద్దాం..

కూటమిని గెలిపిద్దాం

» జనసేన నాయకులకు పవన్ కల్యాణ్ పిలుపు



జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసిన ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి

అమరావతి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ఏర్పాటైందని, పొత్తు ధర్మాన్ని పాటించి.. మిత్రపక్ష కూటమిని గెలిపిద్దామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ నాయకులు, శ్రేణులకు బుధవారం పిలుపునిచ్చారు. ఎక్కడా పొరపాట్లకు, లోటుపాట్లకు తావివ్వకుండా క్షేత్రస్థాయి నుంచి మూడు పార్టీలూ కలిసి ముందుకెళ్లాలని సూచించారు. జనసేన నాయకులు, శ్రేణులు పొత్తు ధర్మాన్ని గౌరవిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఎవరైనా పొత్తు ధర్మానికి భిన్నంగా, వ్యక్తిగత ప్రయోజనాల కోసం, స్వార్థంతో వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకొనేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. వీర మహిళల రాజకీయ ఎదుగుదలకు జనసేన ప్రాధాన్యమిస్తుందని పవన్ స్పష్టం చేశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వివిధ కమిటీల్లో ఉన్న వీర మహిళలకు ఆయన నియామకపత్రాలు అందజేశారు. పవన్ మాట్లాడుతూ.. వీర మహిళలు పార్టీకి మొదటి నుంచీ వెన్నుదన్నుగా నిలిచారన్నారు. పార్టీ కోసం నిలబడిన వారిని మర్చిపోబోమని భరోసా ఇచ్చారు. కాగా, ఒంగోలు ఎంపీ, టీడీపీ నేత మాగుం ట శ్రీనివాసుల రెడ్డి జనసేనాని పవన్ కల్యాణ్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశా రు. ఆయనతో పాటు కుమారుడు మాగుంట రాఘవ్ ఉన్నారు. అలాగే తిరుపతి నుంచి బీజేపీ అభ్యర్థిగా బరి లోకి దిగుతున్న వరప్రసాద్ కూడా పవన్‌ను కలిసి కాసేపు మాట్లాడారు.

బీజేపీ అసెంబ్లీ అభ్యర్థులు వీరే

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గం	అభ్యర్థి
ధర్మవరం	సత్యకుమార్(బీసీ)
ఆదోని	డాక్టర్ పార్థసారథి(బీసీ)
బద్వేల్	బొజ్జ రోషన్న(ఎస్సీ)
జమ్మలమడుగు	ఆదినారాయణ రెడ్డి(ఓసీ)
విజయవాడ పశ్చిమ	సుజనా చౌదరి(ఓసీ)
కైకలూరు	కామినేని శ్రీనివాస్(ఓసీ)
అనపర్తి	శివకృష్ణ రాజు(ఓసీ)
విశాఖ ఉత్తరం	విష్ణుకుమార్ రాజు(ఓసీ)
అరకు	పంగి రాజారావు(ఎస్టీ)
ఎచ్చెర్ల	ఎన్. ఈశ్వర రావు(ఓసీ)

పోటీ చేయనున్నారు. పాడేరు స్థానం బీజేపీకి కేటాయించినట్లు వార్తలు వచ్చినా అనూహ్యంగా అరకు నుంచి పంగి రాజారావును బీజేపీ ప్రకటించింది. అలాగే, కడప జిల్లా బద్వేలు నుంచి టీడీపీ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న రోషన్ పేరును అదే స్థానానికి బీజేపీ ప్రకటించింది. అనపర్తి సీటుకి శివకృష్ణరాజును ఎంపిక చేసింది. అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అరకు నుంచి దొన్ను దొర పేర్లను టీడీపీ ఇప్పటికే ప్రకటించినా ఆ రెండు స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల్ని ప్రకటించడం మిత్రపక్షాల్లో చర్చనీయాంశమైంది. తొలుత ధర్మవరంలో వరదాపురం సూరి (బీజేపీ), ఎచ్చెర్లలో కలిశెట్టి అప్పలనాయుడు(టీడీపీ) పేర్లు బలంగా వినిపించినా ఆ ఇద్దరికీ నిరాశ ఎదురైంది. సీమ నుంచి ఇద్దరు బీసీలు(యాదవ్, వాల్మీకి), ఒక ఎస్సీ, ఒక రెడ్డి, కోస్తాలో 3 స్థానాలకు ఓసీలను బరిలో దించింది.





నొక్కింది ఎంత.. బొక్కింది ఎంత!

(మొదటి పేజీ తరువాయి)

మొదటిసారిగా తాడేపల్లి ప్యాలెస్ దాటి జనాల్లోకి వచ్చాడని ఎద్దేవా చేశారు. ప్రచారానికి వస్తున్న ఆయనకు ఖాళీ రోడ్లతో, ఖాళీ ఇళ్లతో స్వాగతం పలకాలని పిలుపిచ్చారు. 'జగన్‌కు స్వాగతం పలికినా, మద్దతు తెలిపినా మీకు మీరు అన్యాయం చేసుకున్నట్లే. ఓటుకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు పంచేందుకు జగన్ సిద్ధమయ్యాడు. ఆ అవినీతి డబ్బు మాకొద్దంటూ ఛీ కొట్టండి' అని కోరారు. ఇడుపులపాయలో తండ్రి వైఎస్ సమాధి వద్ద పూజలు చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించాడని, అయితే ఆ తండ్రికి లక్ష్మణుడిలా వెన్నంటి ఉన్న తమ్ముడు వివేకానందరెడ్డిని గొడ్డలి వేటుతో హతమార్చిన కేసులో నిందితుడైన అవినాశ్‌రెడ్డికి ఎంపీ సీటు కేటాయించాడని విమర్శించారు. ఎవరిమీదైనా ఆరోపణలు వస్తే విచారణలో అవి తొలగిపోయాక టికెట్ ఇవ్వాలని, అయితే జగన్ సొంత బాబాయి హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి లోక్‌సభ టికెట్ కేటాయించడాన్ని ప్రజలే అర్థం చేసుకోవాలన్నారు. బాబాయిని చంపినవారెవరో చెప్పి ఓట్లు అడగాలని జగన్‌ను డిమాండ్ చేశారు. మీ బాబాయిల గతి కూడా ఏమవుతుందో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు.

జగన్ బొక్కింది ఎంత?

జగన్ వట్టి బటన్లే నొక్కుతున్నాడు. బటన్ నొక్కింది ఎంత.. ఆయన బొక్కింది ఎంతో చెప్పాలి. ఒకప్పటి రూ.200 కరెంటు బిల్లు ఇప్పుడు రూ.800 అయింది. ప్రజల రక్తాన్ని తాగే జలగ కావాలా.. మంచి ప్రభుత్వం కావాలా అనేది ప్రజలే ఆలోచించుకోవాలి. రాష్ట్రం దశ దిశా మార్చేందుకు ఈ ఎన్నికలను ఉపయోగించుకోవాలి. ఇది ఎంతో కీలక సమయం. ఐదేళ్ల నరకాసుర పాలనకు చెక్‌పెట్టే సమయం. ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయనిర్ణేతలు. అందుకే మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు కేవలం 47 రోజులే మిగిలి ఉన్నాయి. మే 13న ఓటింగ్‌కు వెళ్లినప్పుడు మనస్సాక్షితో ఆలోచించి మా కూటమికి మద్దతుగా ఓటు వేయాలి. మంత్రి పాపాల పెద్దిరెడ్డి ఇసుక, మైనింగ్, గ్రానైట్ తింటూ రాష్ట్రాన్ని దోచుకుంటున్నాడు. కడప జిల్లా ఒంటిమిట్టలో పాల సుబ్బారావు అనే చేనేత కార్మికుడి భూమిని వైసీపీ నాయకులు రికార్డులు మార్చి కబ్జా చేశారు. దాంతో దిక్కుతోచక, బతుకు మీద ఆశ నశించి చేనేత కార్మికుడి కుటుంబం ఆత్మహత్య చేసుకుంది. ఇలాంటి అరాచక సంఘటనలు గత ఐదేళ్లలో ఎన్నో జరిగాయి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెప్పినట్లు వైసీపీ విముక్త ఏపీగా మారుద్దాం.

ఆంక్షలు లేకుండా సంక్షేమం

అధికారంలోకి రాగానే ఎలాంటి ఆంక్షలు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తాం. కుటుంబంలో ఎంతమంది మహిళలు ఉన్నా ప్రతి ఒక్కరికీ నెలకు రూ.1,500 చొప్పున అందిస్తాం. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాలో వేస్తాం. మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తాం. వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ.4 వేల చొప్పున మొదటి తేదీనే నేరుగా ఇంటికే పంపిస్తా. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తాం. నిరుద్యోగ యువత కోసం మెగా డీఎస్సీ పెట్టి 60 రోజుల్లో పూర్తి చేస్తాం. ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తాం. నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేల భృతి ఇస్తాం. ఆడబిడ్డలకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. చేనేత, మరమగ్గాల కార్మికుల కోసం 500 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ అందిస్తాం. అన్న క్యాంటీన్లు తిరిగి ఏర్పాటు చేస్తాం. నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తాం. జే బ్రాండ్స్ మద్యం లేకుండా చేస్తాం. వంద రోజుల్లో గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుస్తాం. ఉద్యోగులకు అండగా ఉంటాం. వేధింపులు లేకుండా చూస్తాం. జీతాలు, పెన్షన్లు 1నే అందిస్తాం. రాబోయే 47 రోజులు ప్రభుత్వ ఉద్యోగులు చట్టప్రకారం పనిచేయాలి. గత ఐదేళ్లుగా జగన్ వారిని బానిసలుగా చూశాడు. జీతాలు అడిగితే కేసులు పెట్టారు. దాచుకున్న పీఎఫ్ డబ్బులు కూడా తీసుకోలేని స్థితిలో ఉద్యోగులు ఉండిపోయారు. వారికి న్యాయం చేస్తా.

యువత రోడ్లపైకి రావాలి..

గడచిన ఐదేళ్లలో జాబ్ కేలెండర్ వచ్చిందా? మెగా డీఎస్సీ పెట్టారా? యువతకు భవిష్యత్‌పై ఆశ ఉందా? పరిశ్రమలు కొత్తవి రావడం లేదు. ఉన్నవి కూడా రాష్ట్రం విడిచి వెళ్లిపోతున్నాయి. ఇప్పటికైనా యువత మేల్కోవాలి. భవిష్యత్ కావాలన్నా, ఉద్యోగాలు రావాలన్నా టీడీపీ కూటమికి ఓటేయాలి. తాను పేదల మనిషినని చెబుతున్న జగన్ పేదల కడుపు నింపే అన్నా క్యాంటీన్లు రద్దు చేశాడు. పేద విద్యార్థులకు విదేశీ విద్య అందించే పథకాన్ని, కార్పొరేట్ విద్య అందించే పథకాన్ని రద్దు చేసి పెత్తందారునని నిరూపించుకున్నాడు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా సక్రమంగా చెల్లించడం లేదు. కార్పొరేషన్లకు నిధులు ఆపేశారు. పథకాలన్నీ రద్దు చేశారు. గత ఐదేళ్లలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారు.

రాళ్లసీమగా..

సీమలో సాగునీటి ప్రాజెక్టులన్నీ భ్రష్టు పట్టాయి. రాజులు ఏలిన రతనాల సీమ రాళ్ల సీమగా మారిపోయింది. గత టీడీపీ హయాంలో రూ.68 వేల కోట్లను ఖర్చు చేసి ఇరిగేషన్ ప్రాజెక్టులను పరిగెత్తిచ్చాం. నీళ్లు వస్తే అభివృద్ధి జరుగుతుంది. ఐదేళ్లలో 62 ప్రాజెక్టులు చేపట్టి 24 ప్రాజెక్టులను పూర్తి చేశాం. 32 లక్షల ఎకరాలకు ఆయకట్టు స్థిరీకరించి 7 లక్షల ఎకరాలకు అదనంగా నీళ్లు ఇచ్చాం. సీమలోని సాగునీటి ప్రాజెక్టులకు రూ.12 వేల కోట్లు ఖర్చు చేశాం. ఒక్క హంద్రీ-నీవా పైనే రూ.4,200 కోట్లను ఖర్చు చేశాం. మేం 90 శాతం పనులు పూర్తి చేస్తే, ఈ దుర్మార్గులు 10 శాతం పూర్తి చేయలేక కరువును తీసుకొచ్చారు. టీడీపీ వచ్చాక ప్రతి ఎకరాకు నీళ్లిచ్చి రతనాల సీమగా మార్చాలని లక్ష్యం పెట్టుకున్నా. గోదావరి జలాలు కూడా సీమకు తెచ్చి వెలుగులు నింపుతాం. ఐదేళ్లలో సీమ సాగునీటి ప్రాజెక్టులపై జగన్ రూ.2,125 కోట్లే ఖర్చు చేశాడు. వసూళ్ల కోసం నియమించుకున్న సలహాదారులకు ఇచ్చిన జీతాలంత కూడా సీమ ప్రాజెక్టులకు ఖర్చు చేయలేదు. అలాగే గత ఐదేళ్లలో తన రోత పత్రికకు ప్రకటనల కోసం ఖర్చు చేసినంత మొత్తం కూడా ప్రాజెక్టులకు కేటాయించలేదు. మొన్నటి వరకు సిద్ధం అన్నాడు.. ఇప్పుడు మేమంతా సిద్ధం అంటూ వస్తున్నాడు. ఆయన్ను ఇంటికి పంపడానికి జనాలంతా సిద్ధంగా ఉన్నారు.

జగన్ అహంకారం మే 13న కరిగిపోతుంది!

అందరు సీఎంల ఆస్తితో పోలిస్తే జగన్‌కే ఎక్కువ ఆస్తులున్నాయి. అన్ని రంగాలను నాశనం చేశాడు. మే 13న (పోలింగ్ రోజు) ఆయన అహంకారం కరిగిపోతుంది. టీడీపీ ప్రజాగళం తుఫానుకు వైసీపీ చిత్తుగా ఓడిపోతుంది. తాడేపల్లి ప్యాలెస్ బద్దలు కొట్టే రోజు వస్తోంది. ఒక్క చాన్స్ అంటూ నమ్మించి అధికారంలోకి వచ్చి జగన్ ఐదేళ్లుగా అన్ని వర్గాలనూ హింసిస్తూ మాయమాటలతో నమ్మించి తడి గుడ్డతో గొంతు కోశాడు. నా రాజకీయ జీవితంలో ఎందరో సీఎంలను చూశాను. ఇటువంటి పనికిమాలిన ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదు. ఈ సీఎం రూ.10 ఇచ్చి రూ.వంద దోచేసే రకం. టీడీపీ రూ.15 ఇచ్చి దాన్ని రూ.వెయ్యిగా పెంచేరకం. టీడీపీకి సంపద సృష్టించడమే తెలుసు.



ముస్లింలకు అన్యాయం జరగదు

జగన్ రూ.12 లక్షల కోట్ల అప్పులు చేశాడు. ఇక అప్పులు పుట్టే పరిస్థితి కూడా లేదు. ఆదాయం తగ్గిపోయింది. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర సాయం అవసరం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు పెట్టుకున్నాయి. ఐదేళ్లుగా కేంద్రంలో అన్ని బిల్లులకు మద్దతు తెలిపిన జగన్.. ఇప్పుడు రాష్ట్ర ప్రయోజనాల కోసం మేం ముగ్గురం కలిస్తే నన్ను విమర్శిస్తున్నాడు. ముస్లింలకు ఇచ్చిన హామీలను ఆయన అమలు చేయలేదు. ఎన్డీయేలో ఉన్నప్పుడు గతంలో కూడా ఏ ముస్లింకూ అన్యాయం జరుగలేదు. ఇక ముందూ జరగదు.

ఇంటికి కిలో బంగారమిచ్చినా జగన్‌కు ఓటమి తప్పదు: లోకేశ్

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): 'జగన్ ఐదేళ్ల అరాచక పాలనతో జనం విసిగిపోయారు. ఆయనను శాశ్వతంగా తాడేపల్లి ప్యాలెస్‌లో బంధించాలని నిర్ణయానికి వచ్చారు' అని లోకేశ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలవడం సాధ్యం కాదని తేలిపోవడంతో తాయిలాలతో ఓటర్లను ఏ మార్చే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. 'టీడీపీ ఫిర్యాదు చేస్తే వైసీపీ తాయిలాల డంప్‌నైతే పట్టుకున్నారు. మరి ఇసుక, లిక్కర్‌లో జగన్ దోచుకుని, ఎన్నికల్లో పంచడానికి సిద్ధం చేసిన డబ్బుల డంప్‌ను ఎప్పుడు పట్టుకుంటారు? ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇంటికి కేజీ బంగారం ఇచ్చినా జగన్‌పై నెలకున్న ఆగ్రహ జ్వాలను ఆపడం సాధ్యం కాదు' అన్నారు.

జనమంటే జగన్‌కు భయమా?

- » ప్రచారానికి బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు ఎందుకు?
- » రూల్స్ ప్రకారం ఆర్టీసీ ఆ వాహనాలు ఇవ్వడానికి లేదు
- » భద్రతకు ముప్పు ఉన్నవారికే ఆ వెసులుబాటు
- » డబ్బులిచ్చి అద్దెకు కూడా తీసుకోరాదంటున్న ఈసీ
- » జనం అంటే భయంతో ఇన్నాళ్లు బయటకు రాని సీఎం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అనంతపురం జిల్లా నార్పలకు వచ్చి వెళుతుండగా, గత ఏడాది ధర్మవరం సమీపంలో జగన్ కాన్వాయ్‌కు నిమ్మలకుంట వద్ద గ్రామస్థులు అడ్డుపడ్డారు. అప్పటినుంచి జనంలోకి రావాలంటేనే జగన్ భయపడుతున్నారు. ఇప్పుడు ఎన్నికలు రావడంతో బుల్లెట్‌ప్రూఫ్ వాహనం సహా ప్రధాని తరహా భద్రతా కవచం ఏర్పాటు చేసుకున్నారు. అయితే, ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా తీవ్ర ప్రాణ ముప్పు ఉన్నవారు మాత్రమే ఆర్టీసీ వంటి ప్రభుత్వ సంస్థలు అందించే బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు వాడుకోవాలి. మిగతా నాయకులు డబ్బులిచ్చి కూడా అద్దెకు వాటిని తీసుకోవడానికి వీల్లేదని ఎన్నికల నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అయినా, గత ఐదేళ్లలో మావోయిస్టులు సహా ఎవరి విషయంలోనూ కఠిన చర్యలు తీసుకోని జగన్‌కు ముప్పేముంటుంది?

'నేను మీ బిడ్డను.. పేదల పక్షపాతిని..' అంటూ డైలాగులు చెప్పే జగన్‌కు ఆ జనమంటేనే భయమా.? గత ఎన్నికల ముందు ఓటర్లకు ముద్దులు పెట్టేంత దగ్గరికి వెళ్లిన వైసీపీ అధ్యక్షుడు, ఇప్పుడు జనానికి అందనంత ఎత్తున్న బస్సుపై అభివాదం చేసేందుకే ఎందుకు పరిమితమయ్యారు.? ప్రతిపక్షంలో ఉన్నప్పు డు పాదయాత్ర చేస్తూ ప్రజల చెంతకు జగన్ వెళ్లేవా రు. అలాంటిది ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక పరదాల చాటున, బారికేడ్ల మాటున ప్రజల్లోకి ఎందుకు వెళ్తున్నారు? ఓట్ల కోసం జనంలోకి బుల్లెట్ ప్రూఫ్ వాహనాల్లో ఎందుకు వెళుతున్నారు? ఐదేళ్ల క్రితం చుట్టూ పార్టీ నేతలు ఉండగా, ఇప్పుడెందుకు అంగరక్షకులు మాత్రమే కనిపిస్తున్నారు. ఇడుపులపాయ నుం చి బస్సు యాత్ర ప్రారంభించిన జగన్‌ను చూసినవారి నోట ఇప్పుడివే ప్రశ్నలు! ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారం కోసం ఇదే ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ ఏడాదికిపైగా జగన్ నడిచారు. మద్య నిషేధం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉద్యోగులకు పాత పెన్షన్, ప్రత్యేక హోదా, పోలవరం పూర్తి..ఇలా ఒకటి రెండు కాదు, నోటికి వచ్చినన్ని హామీలిచ్చేసి అధికారంలోకి వచ్చారు. కుర్చీ ఎక్కగానే జనాన్ని పూర్తిగా మరిచిపోయి తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని, అప్పుడప్పుడు బటన్లు నొక్కడమే తనదైన పాలనగా చూపించారు. ఎప్పుడైనా తప్పక వెళ్లాల్సి వస్తే ఎక్కడికక్కడ ట్రాఫిక్ ఆపేసి చెట్లు నరికించేసి, పరదాలు కట్టించి, బారికేడ్లు పెట్టించిన తర్వాతే బయటికి వచ్చారు. ఎన్నికలు వచ్చేసరికి అవన్నీ దాటేసి అత్యంత శక్తివంతమైన బుల్లెట్ ప్రూఫ్ బస్సుల్లో ప్రజల్లోకి బయలుదేరారు. పేదల పక్షపాతిగా పదే పదే ప్రకటించుకునే జగన్, అప్పటికి, ఇప్పటికి ఇంతలా మారిపోయారేంటి.? అని కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తుంటే, నిరుద్యోగులు, రైతులు, వైసీపీ బాధితులు నిలదీసే ప్రమాదం ఉన్నందునే ఏర్పాట్లు చేసుకున్నారనేది మరికొందరి అభిప్రాయం.

ఏమి కఠిన చర్యలు చేపట్టారని ముప్పు?

సీఎంగా జగన్ ప్రాణాలకు ముప్పు వాటిల్లే అంతటి కఠిన నిర్ణయాలు ఏవీ ఆయన తీసుకోలేదు. మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు ఆయన హయాంలో జరగనే లేదు. ఉగ్రవాద మూలాల్లాంటివి ఏపీలో ఎప్పుడూ కనిపించవు. పోనీ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తరహాలో రౌడీలు, గుండాలపై బుల్లెట్ ప్రయోగించారా.. అంటే మాస్కు అడిగిన దళిత వైద్యుడిని, సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వారి భరతం పట్టడమే జగన్ పాలనలో పోలీసుల పని. అలాంటప్పుడు ఆయనకు ముప్పెందుకు ఉంటుందంటూ అందరూ అంటున్నారు.

కోడ్ అమల్లోకి వచ్చాక ప్రతిదీ ఈసీ మార్గదర్శకాల మేరకే అమలవ్వాలి. బుల్లెట్ ప్రూఫ్ వాహనాల వినియోగం నుంచి సాయుధ రక్షణ విషయం వరకు ఈఏడాది జనవరి 2న కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రధానమంత్రి, ఇతర రాజకీయ ప్రముఖుల్లో తీవ్రవాదులు, మావోయిస్టుల నుంచి తీవ్ర ముప్పున్న వారికి మాత్రమే ఆ ఏర్పాట్లు వర్తిస్తాయని సీఈసీలో సీనియర్ ప్రిన్సిపల్ సెక్రటరీ నరేంద్ర ఎన్ బటోలియా ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల ప్రచారానికి డబ్బులిచ్చి కూడా బుల్లెట్‌ప్రూఫ్ వాహనం వినియోగించడానికి వీల్లేదని చాలా స్పష్టంగా పేర్కొన్నారు. ఇక, జగన్ ఎన్నికల ప్రచారానికి రెండు బుల్లెట్ ప్రూఫ్ బస్సులు, మరో రెండు అధునాతన సౌకర్యాలతో కూడిన కారవ్యాన్లు అడిగారు. ఆర్టీసీ వద్ద ఇప్పటికే రెండు ఉండగా మరో రెండు ఇటీవలే కొనుగోలు చేయాల్సి వచ్చింది. మొత్తం నాలుగూ తనకే కావాలని అడగడంతో ఆర్టీసీ ఎన్నికల కమిషన్ అనుమతి కోరారు. రెండింటికి ఈసీ అనుమతి ఇవ్వడంతో అంతవరకే పంపామని ఆర్టీసీ ఈడీ తెలిపారు.



బుల్లెట్ ప్రూఫ్ బస్సులో ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న ముఖ్యమంత్రి జగన్

కోడ్ వచ్చినా కోట్లలో నగదు జమ

- » నగదు రూపంలో 16 కోట్లు ఆర్టీసీకి వైసీపీ చెల్లింపు
- » 'మేమంతా సిద్ధం' బస్సులపై గోప్యత

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, సిద్ధం సభలకు జనాన్ని తరలించే ఆర్టీసీ బస్సులకు అద్దె నిమిత్తం అధికార వైసీపీ రూ.16 కోట్లను నగదు రూపంలో చెల్లించటం వివాదాస్పదంగా మారింది. కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీల ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా ఉండాలి. బ్యాంకు, ఆర్టీజీఎస్, నెఫ్ట్, చెక్, నెట్‌బ్యాంకింగ్.. ఇలా ఏదో ఒక ప్రాతిపదికన చెల్లింపులు జరపాలి. అందుకు భిన్నంగా నగదు రూపంలో అధికార పార్టీ రూ.కోట్లు చెల్లించింది. వైసీపీ అంత భారీగా కాకపోయినా.. టీడీపీ, బీజేపీ కూడా అద్దెకు ఆర్టీసీ నుంచి బస్సులు తీసుకున్నాయి. ఆ రెండు పార్టీలు ఆన్‌లైన్ విధానంలో కోడ్‌కు ముందే డబ్బు చెల్లించేశాయి. కానీ, వైసీపీ మాత్రం సిద్ధం సభల కోసం విడతలవారీగా 7 వేలకు పైగా ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకుంది. ఈ బస్సులకు ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వైసీపీ రూ.27 కోట్ల పైబడి చెల్లించాల్సి ఉంది. అయితే, కేవలం రూ.11 కోట్లే చెల్లించింది. దీంతో బకాయిల గురించి ఆర్టీసీ అధికారులు వైసీపీ పెద్దల దృష్టికి తీసుకెళ్లగా వాటి చెల్లింపునకు పార్టీ హామీ ఇచ్చింది. ఇంతలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అయినా కోడ్ నిబంధనలకు విరుద్ధంగా రూ.16 కోట్ల మేర నగదు రూపంలో ఆర్టీసీకి చెల్లించింది. ఈ నెల 21, 22, 23 తేదీల్లో ఈ చెల్లింపులు జరిగాయి. 2 రోజుల తర్వాత ఆర్టీసీ.. బ్యాంకులో ఆ నగదును జమ చేసినట్టుగా తెలుస్తోంది. కాగా, జగన్ బుధవారం ఇడుపులపాయ నుంచి తలపెట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు ఆర్టీసీ..బుల్లెట్ ప్రూఫ్, నాన్ బుల్లెట్ ప్రూఫ్, ప్యాంట్రీ వాహనాలను సమకూర్చింది. ఇవి ఇడుపులపాయకు ఒక రోజు ముందుగానే చేరుకున్నాయి. ఈ వాహనాలను అద్దె ప్రాతిపదికన ఇచ్చినట్టుగా ఆర్టీసీ చెబుతున్నా.. ఆ అద్దె ఎంత అన్నది ఆర్టీసీ గోప్యంగా ఉంచుతోంది.



బస్సు యాత్ర ప్రారంభం సందర్భంగా బుధవారం ఇడుపులపాయలో చెప్పులు విడిచి వాటిపై నిలబడి వేద పండితుల ఆశీర్వాదం తీసుకుంటున్న సీఎం జగన్

జగన్ ఇలాకాలో జనం రివర్స్

- 'మేమంతా సిద్ధం' అంటూ జగన్
- మేం సిద్ధంగా లేం' అని తేల్చేసిన జనం
- 1.50 లక్షలమందితో సభ అంటూ ఆర్భాటం
- ప్రొద్దుటూరుకు వచ్చింది 30 వేలలోపే....

కడప, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లూ జనానికి దూరంగా, పరదాల చాటున తిరిగిన సీఎం జగన్, ఎన్నికల వేళ 'మేమంతా సిద్ధం' అంటూ 21 రోజులు బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారు. అయితే, 'మేం సిద్ధంగా లేం' అని సొంత జిల్లా కడపలో తొలిరోజే జనం తేల్చిచెప్పారు. జగన్ బుధవారం గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో జగన్ కడప విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టరులో ఇడుపులపాయకు వచ్చారు. అక్కడ తండ్రి వైఎస్ ఘాట్ వద్ద ఆయన ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ విజయలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం 1.45కు ఇడుపులపాయ నుంచి బస్సులో జగన్ బయల్దేరారు. వీరన్నగట్టుపల్లె మీదుగా వేంపల్లె చేరుకున్నారు. అప్పటికే సొంత జిల్లా నుంచేకాకుండా, వైజాగ్ తదితర ప్రాంతాల నుంచి కూడా వైసీపీ కార్యకర్తలు వచ్చారు. వేంపల్లెలో కార్యకర్తలు సందడి చేశారు. అయితే బైపాస్ నుంచి వీఎన్‌పల్లె మీదుగా వచ్చేసరికి బస్సుయాత్రలో జనం ఖాళీ అయ్యారు. వీఎన్‌పల్లె మీదుగా ఎర్రగుంట్ల, పోట్లదుర్తి మీదుగా ప్రొద్దుటూరు చేరుకున్నారు. కాన్వాయ్‌లో వాహనాలు తప్ప జనం పెద్దగా కనబడలేదు. జగన్ వేంపల్లె, ఎర్రగుంట్లలో మాత్రం బస్సుపైకి ఎక్కి జనానికి అభివాదం చేశారు. ఇతర చోట్ల అంతా బస్సులోంచే ప్రజలకు అభివాదం చేశారు. 6.40కి జగన్ ప్రొద్దుటూరు సభా ప్రాంగణానికి వచ్చారు. అప్పటికే జనం జంప్. 6.45కు జగన్ ప్రసంగం ప్రారంభించి 7.52కు ముగించారు. జగన్ ప్రసంగం ప్రారంభించిన పది నిమిషాలకే జనాలు వెళ్లిపోవడంతో బారికేడ్లు ఖాళీ అయ్యాయి. చుట్టూ పరదాలు కట్టి జనం బయటికి పోకుండాపెట్టారు. అక్కడికీ జనాలు బయటికి వచ్చేశారు.

ఎందుకీ పరిస్థితి?

జగన్ 2019 వరకు సొంత అడ్డాలో కింగ్. ఆయన జిల్లాకు ఎప్పుడు వచ్చినా జనం, కార్యకర్తలు ఎగబడేవారు. ఆయన సీఎం అయిన తరువాత.. సొంత నియోజకవర్గ జనానికే ముఖం చాటేస్తూ వచ్చారు. వైఎస్ జయంతి, వర్ధంతి, క్రిస్మస్‌లకు తప్ప జిల్లాకు రావడం లేదు. బహిరంగసభలో మాత్రమే పాల్గొని బారికేడ్ల మధ్య జనాలకు దూరంగా ఉంటున్నారు. దీనికి 58 నెలలుగా జనాలు అలవాటుపడ్డారు. ఈ ప్రభావం జగన్ 'మేమంతా సిద్ధం.' బస్సు యాత్రలో స్పష్టంగా కనిపించింది. ప్రారంభం బాగానే ఉన్నా ముగింపులో మాత్రం జగన్‌కు ఊహించని విధంగా జనం షాకిచ్చారు.

ప్రొద్దుటూరు సభను తొలుత లక్ష మందితో నిర్వహిస్తామంటూ డంబాలు పలికి.. ఒకటిన్నర లక్ష జనం వచ్చారంటూ వైసీపీ నేతలు జబ్బలు చరుచుకున్నారు. తొలి సభను కడప ఎంపీ అవినాశ్‌రెడ్డితో పాటు ఉమ్మడి జిల్లా వైసీపీ నేతలంతా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. కడప జిల్లా నుంచి 90 ఆర్టీసీ బస్సులతో పాటు పొరుగున ఉన్న చిత్తూరు, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి భారీగా బస్సులను తీసుకువచ్చారు. తిరుపతి జిల్లా నుంచి తిరుమల వెళ్లే బస్సులను కూడా తీసుకువచ్చారు. ఇలా దాదాపు 400కు పైగా బస్సులను తీసుకువచ్చారు. సొంత జిల్లాలో జనం నుంచి అనుకున్నంత స్పందన లేకపోవడంతో పొరుగు జిల్లాల నుంచి కూడా జనాన్ని తరలించారు. ప్రొద్దుటూరులో జరిగిన జగన్ తొలిసభపై రాష్ట్రమంతా చాలా ఆసక్తి చూపింది. సొంత జిల్లా కావడంతో భారీగా జనాలు వస్తారని అనుకున్నారు. దీనికి తోడు ఇది వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన తొలి ఎన్నికల సభ. అయితే అంత సీన్ లేదని తేలిపోయింది. మధ్యాహ్నం 4గంటలకు మీటింగ్ అని చెప్పి కడప నుంచి బస్సులను 2గంటల నుంచి తీసుకురావడం మొదలుపెట్టారు. కొన్ని బస్సుల్లో పది మంది కూడా జనాలు లేరు.

అదే ఏడుపు

సొంత జిల్లాలో తొలి ఎన్నికల ప్రచార సభలో జగన్ మేనిఫెస్టో ప్రకటిస్తారని అందరూ ఆశించారు. అయితే ఎంత సేపూ ఒకటే ఏడుపు. మీ బిడ్డ మీ బిడ్డ అని చెప్పడం... కొన్ని పత్రికలు, మీడియాతో ఏడుపులు. 'మీ బిడ్డ మీకోసం 130 సార్లు బటన్ నొక్కా'డంటూ జగన్ చెప్పుకొచ్చారు. అయితే విద్యాదీవెన, ఇతర బటన్ నొక్కుడు నిధులు ఇంతవరకు పడలేదంటూ సభకు హాజరైన జనం గుసగుసలు పోయారు.

అక్కడే 'సిట్టింగ్'

జనాన్ని తరలించేందుకు క్వార్టర్ మందు, భోజనం, రూ.200 ఇచ్చి బస్సుల్లో తీసుకొచ్చారని అంటున్నారు. అలా వచ్చిన వారిలో కొందరు సభా స్థలం పక్కనే కూర్చుని మద్యం తాగుతూ కనిపించారు. డ్వాక్రా మహిళలకు కూడా డబ్బు ఇచ్చి మీటింగ్‌కు తరలించారని సమాచారం.

వివేకాను ఎవరు చంపారో ఆయనకూ, దేవుడికీ తెలుసు!

- » బురదజల్లేందుకు చెల్లెమ్మలను పంపిస్తున్నారు
- » ఇది కలియుగం కాక మరేమిటి!
- » ప్రొద్దుటూరు సభలో జగన్ ఆక్రోశం

కడప, మార్చి 27(ఆంధ్రజ్యోతి): "మా చిన్నాన్నను ఎవరు చంపారో, ఎవరు చంపించారో ఆయనకు, ఆ దేవుడికి, ఈ జిల్లా ప్రజలందరికీ తెలుసు" ప్రొద్దుటూరు సభలో కడప ఎంపీ అవినాశ్ రెడ్డిని పక్కనే పెట్టుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలివి! బుధవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించిన ఆయన ప్రొద్దుటూరులో నిర్వహించిన సభలో ప్రసంగించారు. వైఎస్ వివేకా హత్య గురించి ప్రస్తావించారు. ఐదేళ్లకింద వివేకా హత్య జరిగినప్పుడు 'నారాసుర రక్త చరిత్ర' అని సొంత పత్రికలో కథనాలు రాయించి... తాజాగా కూడా అనేక మందిపై అక్షరాలా బురదచల్లిన జగన్ ఇప్పుడు 'వివేకాను చంపిందెవరో ఆయనకు, దేవుడికీ తెలుసు' అని పేర్కొన్నారు. వివేకా హత్యపై న్యాయపోరాటం చేస్తున్న ఆయన కుమార్తె సునీతా రెడ్డి, ఆమెకు అండగా ఉన్న సొంత చెల్లి వైఎస్ షర్మిలపైనా జగన్ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. "నాపై బురదజల్లేందుకు ఇద్దరు చెల్లెమ్మలను ఎవరు పంపించారో, వారి వెనకాలో ఎవరు ఉన్నారో మీ అందరికీ కనిపిస్తూనే ఉంది. ఇంకా ఆశ్చర్యమేమిటి అంటే.. వివేకా చిన్నాన్నను అతి దారుణంగా చంపిన హంతకుడు, ఆ హంతకుడికి మద్దతు ఇస్తున్న వారిని కూడా మీరు రోజూ చూస్తున్నారు" అంటూ అప్రూవర్‌గా మారిన దస్తగిరి ప్రస్తావన కూడా తెచ్చారు. ఇంతటి దారుణం చేస్తూ తనను దెబ్బతీసే రాజకీయం చేస్తున్నారంటే... ఇది కలియుగం కాకపోతే ఇంక ఏమిటని జగన్ వాపోయారు. ఇంతకన్నా అన్యాయం ఎక్కడన్నా ఉంటుం దా అని ప్రశ్నించారు. ధర్మాన్ని, న్యాయాన్ని నమ్ముకున్నానని చెప్పారు.



గుంటూరు తూర్పు అభ్యర్థి నూరి ఫాతిమా వెనుక చెయ్యెత్తి జై కొడుతున్న మస్తాన్‌వలి



నూరి ఫాతిమా కరపత్రంతోపాటు పంపిణీ చేసిన సబ్బుల ప్యాకెట్

వైసీపీ ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగి

- డిప్యూటేషన్‌పై ఎమ్మెల్యే ముస్తఫాకు పీఏగా విధులు
- గుంటూరు తూర్పు అభ్యర్థి నూరి ఫాతిమాతో ఎన్నికల ప్రచారం

గుంటూరు(కార్పొరేషన్), గుంటూరు, మార్చి 27:ప్రభుత్వ ఉద్యోగి వైసీపీ అభ్యర్థి ప్రచారంలో పాల్గొనడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ హోదాలో పనిచేసిన షేక్ మస్తాన్‌వలి డిప్యూటేషన్‌పై గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా వద్ద పీఏగా విధులు నిర్వర్తిస్తున్నారు. ముస్తఫా కుమార్తె నూరి ఫాతిమాను ఈ సారి వైసీపీ అభ్యర్థిగా అదే నియోజకవర్గంలో బరిలోకి దింపారు. దీంతో మస్తాన్‌వలి ఆమె వెంట తిరుగుతూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, గుంటూరు తూర్పు అసెంబ్లీ అభ్యర్థి నూరి ఫాతిమా మంగళవారం కాకానిరోడ్డులోని మద్దిరాలకాలనీ, బసవ తారకరామా నగర్, రాజగోపాల్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించగా మస్తాన్‌వలి వారి వెంట ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

కరపత్రంతో సబ్బుల పంపిణీ

నూరిఫాతిమా తమ సొంత కంపెనీకి చెందిన హెర్బల్ సబ్బులను గత కొద్ది రోజులుగా ఎన్నికల ప్రచార కరపత్రంతో పాటు ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని విపక్షనేతలు డిమాండ్ చేశారు.

ఒంగోలులో తాయిలాల నిల్వలు

- 20 లక్షల విలువైన చీరలు, సంచులు స్వాధీనం



పొగాకు గోదాంలో నిల్వ ఉంచిన ఎన్నికల తాయిలాలు, చీరలు, సంచులపై ఉన్న సీఎం, బాలినేని ఫొటోలు

ఒంగోలు (క్రైం), మార్చి 27: ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు అధికార వైసీపీ నిల్వ ఉంచిన రూ.20 లక్షల విలువైన తాయిలాలను అధికారులు సీజ్ చేశారు. బుధవారం ఒంగోలు మండలం గుత్తికొండవారిపాలెంలో అనాథరైజ్డ్ పొగాకు గోదాంలో భారీగా నిల్వ ఉంచిన చీరలను ఎన్నికల అధికారులు గుర్తించారు. సీ విజిల్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా ఎన్నికల యంత్రాంగం స్పందించింది. చీరలు ఉంచిన పెట్టెలపైన, సంచుల పైన సీఎం జగన్మోహన్‌రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఫొటోలు ఉన్నాయి.

18 మంది క్షురకులపై 'కోడ్ ఉల్లంఘన' కేసు

- ద్వారకాతిరుమలలో సిద్ధం కరపత్రాలతో ప్రచారంపై చర్యలు

ద్వారకా తిరుమల, తాళ్లరేవు, మార్చి 27: ఆలయంలో పనిచేస్తూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన 18మంది క్షురకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. టీటీడీ ట్రస్టు బోర్డు సభ్యుడు, నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దవటం యానాదయ్య ఈనెల 22న ఏలూరు జిల్లాలోని ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ కేశఖండన శాలకు వచ్చి 'జగనన్నకు తోడుగా మేము సిద్ధం.. మా కమ్యూనిటీ సిద్ధం' అంటూ రూపొందించిన కరపత్రాలను క్షురకులకు పంపిణీ చేశారు. ఈ వ్యవహారం వివాదాస్పదమవడంతో ఏఈవో నటరాజారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షురకులపై కేసు నమోదైంది. కాగా, కాకినాడ జిల్లా తాళ్లరేవు సంతపేట సెంటరులో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వైసీపీ కార్యాలయాన్ని అధికారులు మూసివేయించారు.

వైసీపీ డంపులపై ఈసీ మౌనమెందుకు?

- సీ విజిల్‌లో ఫిర్యాదు చేసినా స్పందనలేదు: టీడీపీ

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైసీపీకి సంబంధించిన డంపులు బట్టబయలైనా ఎన్నికల కమిషన్ ఏ చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యం ఏమిటని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన చేశారు. 'రేణిగుంట ఎఫ్‌సీఐ గోదాము వద్ద వైసీపీ నేతలు నిల్వ చేసిన నగదు, మద్యం, ప్రచార సామగ్రికి సంబంధించిన డంపులు దొరికాయి. ఇలాంటివి ఒక్క రేణిగుంటలోనే నాలుగు ఉన్నాయని టీడీపీ నేతలు సాక్ష్యాలతో సహా నిరూపిస్తున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదు. దీని వెనుక తాడేపల్లి ప్యాలెస్ ఒత్తిళ్లు ఉన్నాయి. ఈ డంపులను నిర్వహిస్తున్న ఒంగోలు వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలి.' అని డిమాండ్ చేశారు.

జగన్‌కు భయపడుతున్న అధికారులు

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికారులు ఇంకా సీఎం జగన్‌ను చూసి భయపడుతున్నారని, ఫిర్యాదులపై స్పందించడానికి వెనకాడుతున్నారని టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య ధ్వజమెత్తారు.'రేణిగుంట విమానాశ్రయానికి దగ్గర్లో వైసీపీ నేతలు పెట్టిన డంపులపై మా పార్టీ నేతలు అక్కడి రిటర్నింగ్ అధికారికి, రాష్ట్ర, జాతీయ ఎన్నికల కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. అయినా వాటిని ఇంతవరకూ సీజ్ చేయలేదు. ఈ డంపులపై జిల్లావ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నా కలెక్టర్, ఎస్పీలు అక్కడకు రాలేదు. టీడీపీ కార్యకర్తలు వందల సంఖ్యలో వాటికి మంగళవారం నుంచి కాపలా కాస్తున్నారు. చెవిరెడ్డి భాస్కర రెడ్డి టీడీపీ నేతలకు ఫోన్లు చేసి అక్కడ నుంచి వెళ్లపోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ అధికారుల నిర్లిప్తత ఘోరంగా ఉంది' అని వర్ల మండిపడ్డారు. కాగా, కాళహస్తి డంపులపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర కుమార్ ఎన్నికల కమిషన్‌కు బుధవారం లేఖ రాశారు.

రోజూ నా కార్లేనా..! కంటైనర్లు చూడరా?: లోకేశ్

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఘనత వహించిన ఆంధ్రప్రదేశ్ పోలీసులు రోజూ నా కార్లు తనిఖీ చేయడం తప్ప సీఎం ఇంటికి వచ్చి వెళ్లే కంటైనర్లను చూడరా? అని టీడీపీ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి అభ్యర్థి లోకేశ్ ప్రశ్నించారు. బుధవారం ఆయన దీనిపై ఎక్స్‌లో స్పందించారు. 'రోజూ నా కార్లు తనిఖీ చేస్తున్నారు. ఒక్క ఎన్నికల నిబంధన ఉల్లంఘనైనా మీకు కనిపించిందా? మీ ఎదురుగా సీఎం నివాసంలోకి అన్ని నిబంధనలూ అతిక్రమించి వెళ్లి వచ్చిన కంటైనర్‌ను ఎందుకు తనిఖీ చేయలేదు? అందులో ఏం ఉంది? బ్రెజిల్ సరుకా? లిక్కర్లో మెక్కిన వేల కోట్లా? లండన్ పారిపోవడానికి ఏర్పాట్లా? ఏపీ సెక్రటేరియట్‌కు సంబంధించి ఇంత కాలం దాచిన దొంగ ఫైళ్లా? డీజీపీ సమాధానం చెబుతారా..?' అని లోకేశ్ ప్రశ్నించారు.

పత్రికల కొనుగోలుకు ప్రజాధనమా?

- ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి జీవోలు సరికాదు
- తక్షణమే ఉపసంహరించుకోండి
- ఏపీ ప్రభుత్వానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశం
- సొంత పత్రిక కొనేందుకు వలంటీర్లకు రూ.200 ఇవ్వాలని నిరుడు జగన్ సర్కారు జీవో
- కోర్టు ఆదేశాలతో ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వానికి ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పత్రికల కొనుగోలుకు ప్రజాధనాన్ని ఎలా వినియోగిస్తారంటూ న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణమే ఆ జీవోను నిలిపివేయాలని రాష్ట్రప్రభుత్వానికి సూచించింది. సీఎం జగన్ సొంత పత్రికను కొనుగోలు చేయడానికి వలంటీర్లకు నెలకు రూ.200 చొప్పున ఇచ్చేందుకు జీవో ఇచ్చారని ఉషోదయ పబ్లికేషన్స్ ఆంధ్ర హైకోర్టులో పిటిషన్ వేసింది. అయితే ప్రభుత్వానికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీనిపై ఉషోదయ పబ్లికేషన్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గతేడాది ఏప్రిల్ 17న కోర్టు విచారించి.. కేసును ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేసింది. నిరుడు జూలై నుంచి అక్కడ విచారణ జరుగుతోంది. ఈ పిటిషన్‌పై బుధవారం ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పరిపక్వ ప్రజాస్వామ్యంలో ఇలాంటి జీవోలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించింది. ప్రజాధనంతో దినపత్రికలు కొనుగోలు చేయాలని ఆదేశాలివ్వడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి జీవోలు ఇచ్చి సర్క్యులేషన్ పెంచుకోవాలన్న ప్రయోజనం కూడా నెరవేరలేదు కదా అని వ్యాఖ్యానించింది. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి ఉత్తర్వులు జారీచేయడం సరికాదని, వాటిని తక్షణమే ఉపసంహరించుకోవాలని సూచించింది. కాగా.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి వలంటీరుకు నెలకు రూ.200 ఇవ్వడం ద్వారా సాక్షి సర్క్యులేషన్ పెరిగిందని, అందుకే ఆడిట్ నివేదిక ఇవ్వకుండా ఆపాలని ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్(ఏబీసీ)ని ఆదేశించాలని కోరుతూ ఉషోదయ పబ్లికేషన్స్ ఈ నెల 13న మరో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ఆ మర్నాడు హైకోర్టు విచారణ జరిపింది. ఈ నెల 27వ




తేదీ వరకు ఆడిట్ నివేదిక విడుదల చేయొద్దని.. దానిని సీల్డ్ కవర్‌లో తమకు సమర్పించాలని ఆదేశించింది. దీనిపైనా బుధవారం జస్టిస్ మన్మోహన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. నేటికీ పిటిషనర్‌కు చెందిన దినపత్రికే సర్క్యులేషన్‌లో మొదటి స్థానంలో ఉందని ఏబీసీ తన నివేదికలో తెలిపింది. దీంతో ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని ఉషోదయ పబ్లికేషన్స్ తరఫు న్యాయవాదులకు ధర్మాసనం సూచించింది. వారు అంగీకరించడంతో.. ప్రస్తుత వివరాలు బహిరంగపరిచేందుకు ఏబీసీకి కోర్టు అనుమతి ఇచ్చింది.

కలిసి నడుద్దాం..

- టీడీపీ, జనసేన, బీజేపీ నిర్ణయం
- పురందేశ్వరి నివాసంలో మూడు పార్టీల నేతల భేటీ

అమరావతి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రెండు దశల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి సమావేశాలు నిర్వహించాలని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు నిర్ణయించాయి. మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు కింది స్థాయి వరకూ కలిసి పనిచేసేలా చూడటం కోసం ఎంచుకొన్న వ్యూహంలో భాగంగా ఈ సమావేశాల నిర్వహణకు ఈ పార్టీలు సంకల్పించాయి. దీని ప్రకారం ఏప్రిల్ 4న రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాల పరిధిలో ఉమ్మడి సమావేశాలు జరుగుతాయి. దాని తర్వాత ఏప్రిల్ 8న మొత్తం 175 అసెంబ్లీ స్థానాల పరిధిలో ఇదే మాదిరి సమావేశాలు నిర్వహిస్తారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి విజయవాడ నివాసంలో బుధవారం రాత్రి మూడు పార్టీల సమన్వయ సమావేశం జరిగింది. దీనికి బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అరుణ్ సింగ్, మరో ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ హాజరయ్యారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశం తర్వాత మూడు పార్టీల నేతలు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'వచ్చే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి రాష్ట్రంలో 160కి పైగా సీట్లు గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. రెండు చోట్లా ఒకే కూటమి ప్రభుత్వాలు ఉంటే డబుల్ ఇంజన్ శక్తితో రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడతాయి. అనుకొన్న లక్ష్య సాధనకు మూడు పార్టీలు కలిసికట్టుగా పనిచేయాలి. ప్రజా క్షేత్రంలో వైసీపీ అవినీతి, అక్రమ పాలనను అంతమొందించడం లక్ష్యంగా వెళ్తున్నాం. దీనిలో భాగంగా రెండు అంచెల్లో సమావేశాలకు నిర్ణయించాం' అని అచ్చెన్నాయుడు చెప్పారు. మూడు పార్టీలకు కలిపితే బలమైన నాయకత్వ శ్రేణి, కార్యకర్తల బలం ఉందని, వీరందరినీ ఒక తాటిపై నడిపించడానికి వివిధ స్థాయిలో సమన్వయ కమిటీలు వేయాలని అనుకొంటున్నామని నాదెండ్ల మనోహర్ చెప్పారు. మూడు పార్టీలు కలిసి ఉమ్మడి ప్రచార నినాదాలు, ఉమ్మడి కరపత్రాలు, ఉమ్మడి ఎన్నికల ప్రణాళిక రూపొందించుకొంటామని, ఒక సమిష్టి వ్యూహంతో ముందుకు వెళ్తామని ఆయన పేర్కొన్నారు. కేవలం పై స్థాయిలోనే కాకుండా కింది స్థాయిలో కూడా మూడు పార్టీల శ్రేణుల మధ్య సమన్వయం సాధిస్తేనే ఎన్నికల్లో అనుకొన్న ఫలితం సిద్ధిస్తుందన్న అభిప్రాయం ఈ సమావేశంలో వ్యక్తమైందని, దాని గురించే లోతుగా చర్చించామని పురందేశ్వరి చెప్పారు. 'ఈ రాష్ట్రంలో నిరంకుశ, అవినీతి, విధ్వంసక పాలన నడుస్తోంది. దానిని అంతం చేయాలి. దీని కోసం ఉమ్మడి ప్రణాళిక, ఉమ్మడి ప్రచార సాహిత్యం, ఉమ్మడి వ్యూహంతో వెళ్తాం. ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్లపాటు అభివృద్ధి నిలిచిపోయింది. అవినీతి పెరిగిపోయింది. దాని స్థానంలో ఒక మంచి ప్రభుత్వం అందించడానికి కలిసి వెళ్తున్నాం. దీనిని ఆశీర్వదించాలని ప్రజలను కోరుతున్నాం' అని పురందేశ్వరి అన్నారు. కాగా, సమావేశంలో మూడు పార్టీల గుర్తులను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకొనివెళ్లాలని నిర్ణయించినట్లు తెలిసింది. టికెట్ ఆశించి దక్కని నేతలతో మాట్లాడి వారిని సంతృప్తి పరిచేందుకు ఆయా పార్టీల ముఖ్య నేతలు బాధ్యతలు తీసుకోవాలని నిర్ణయించింది. మూడు ప్రాంతాల్లో కనీసం ఆరు సభలు నిర్వహించి ప్రధాని మోదీ, అమిత్ షా, నడ్డా తదితర జాతీయ నేతల్ని ఆహ్వానించాలని తీర్మానించారు. వైసీపీ కోడ్ ఉల్లంఘనల్ని ఈసీ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించింది.



బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి నివాసంలో బుధవారం జరిగిన కూటమి కోఆర్డినేషన్ సమావేశంలో అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ తదితరులు

ప్రజల్లో అపోహలు తొలగిస్తాం

- ఎన్డీఏ కూటమిపై నమ్మకం కలిగిస్తాం
- టీడీపీ, జనసేన నేతలతో బీజేపీ

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని వర్గాల ప్రజల్లో మాపై అపోహలు నెలకొన్న విషయం మా దృష్టికి వచ్చింది. వాటిని తొలగిస్తాం. ఎన్డీయే కూటమిపై ప్రజల్లో నమ్మకం కలిగిస్తాం' అని బీజేపీ నేతలు పేర్కొన్నట్లు సమాచారం. ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి విజయవాడ నివాసంలో బుధవారం రాత్రి టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ఉమ్మడి సమావేశం జరిగింది. దీనికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అరుణ్ సింగ్, మరో ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్‌సింగ్ హాజరయ్యారు. టీడీపీ నుంచి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన నుంచి పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ వచ్చారు. ఈ సమావేశంలో గత కొన్ని రోజులుగా చోటు చేసుకొన్న పరిణామాలపై వారు నిర్మొహమాటంగా మాట్లాడుకొన్నట్లు సమాచారం. బీజేపీ ఈ రాష్ట్రంలో ఇప్పటికీ వైసీపీకి దగ్గరగా ఉందన్న అభిప్రాయం ప్రజల్లో నెలకొందని, దీనివల్ల మూడు పార్టీలు కలిసినందువల్ల రావలసినంత రాజకీయ లాభం రాలేదని టీడీపీ, జనసేన నేతలు చెప్పారు. దీనికి కారణం ఏమిటని బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జులు ప్రశ్నించారు. వైసీపీ నుంచి బయటకు వచ్చిన సిటింగ్ ఎంపీ రఘురామ రాజుకు బీజేపీ టికెట్టు రాకపోవడం మొదలుకొని చిలకలూరిపేట సభలో ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగంలో రాష్ట్ర పరిస్థితులను, సమస్యలను సరిగ్గా ప్రస్తావించలేదని నెలకొన్న అసంతృప్తి వరకూ కొన్ని అంశాలను వారు వివరించారు. ఈ విషయాలను రాసుకొన్న బీజేపీ నేతలు వీటిని తమ కేంద్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. 'ఒకసారి మేం టీడీపీ, జనసేన పార్టీలతో కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకొన్న తర్వాత ఆ దిశగానే వెళ్తాం. మాకు రెండో ఆలోచన లేదు... రాదు. కొద్ది రోజుల్లో ఈ దిశగా ప్రజలకు మేం స్పష్టత ఇస్తాం. ఎలా ఇస్తామో మీరే చూస్తారు' అని అరుణ్ సింగ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, అధికార పార్టీ ఎత్తులు తదితర అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది.

స్థానిక చట్టాల మేరకే ప్రకటనలు

- జాతీయ రహదారుల పక్కన హోర్డింగ్స్ అన్ని పార్టీలకు సమానంగా పంపకం
- ఇంటింటి ప్రచారంపై త్వరలో నిర్ణయం
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మీనా

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో శాశ్వత ప్రాతిపదికన ఉన్న రాజకీయ పార్టీల కార్యాలయాల్లో స్థానిక చట్టాలు, అనుమతుల మేరకే హోర్డింగ్‌లను కొనసాగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరును సమీక్షించారు. మీనా మాట్లాడుతూ.. పార్టీల శాశ్వత కార్యాలయాల్లో హోర్డింగులను తొలగించడంతో పాటు పలు సమస్యలను వివిధ రాజకీయ పార్టీలు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఎప్పటి నుంచో శాశ్వత ప్రాతిపదికన ఉన్న పార్టీ కార్యాలయాల్లో అనుమతి ఉన్న హోర్డింగులను కొనసాగించాలన్నారు. తాత్కాలిక ప్రతిపదికన ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాల్లో 4-8 అడుగుల బ్యానర్, ఒక ఫ్లాగ్‌ను అనుమతించాలన్నారు. రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని, 48 గంటల ముందుగా 'సువిధ' పోర్టల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. కానీ కొన్ని అత్యవసర పరిస్థితుల్లో మాత్రం ఎన్కోర్ పోర్టల్లో నమోదు చేసి సకాలంలో అనుమతులు జారీ చేయాలని సూచించారు. ముందుగా అనుమతి పొందిన తర్వాతే ఇంటింటి ప్రచారానికీ వెళ్లాలనే నిబంధన అమలు సాధ్యంకాదని, ఈ నిబంధనను పునఃసమీక్షించాలని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరినట్టు తెలిపారు. ఈ నిబంధన అమలు విషయంలో పలు రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాన్ని పరిశీలించడంతోపాటు, కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. దీనిపై త్వరలోనే సరైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జాతీయ, ప్రధాన రహదారుల పక్కనున్న హోర్డింగులను అన్ని రాజకీయ పార్టీలకు సమాన ప్రతిపదికన కేటాయించాలని, నూతన హోర్డింగ్‌లకు అనుమతులు ఇవ్వద్దని పేర్కొన్నారు. ప్రైవేటు భవనాలపై వాల్ పెయింట్స్‌కు అనుమతిలేదని తెలిపారు. సీ-విజిల్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు.



జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్నికల ప్రధానాధికారి ఎంకే మీనా



రేణిగుంట గోదామును పరిశీలిస్తున్న అధికారులతో టీడీపీ నాయకులు

వాచీలు, చీరలు.. ప్రచార సామగ్రేనా!

- రేణిగుంట గోదాముల్లో తనిఖీ అధికారుల తీరుపై విమర్శలు
- ప్రచార సామగ్రి కిందే నమోదు చేసిన అధికారులు

తిరుపతి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలోని మూడు గోదాముల్లో సోమవారం భారీ పరిమాణంలో వైసీపీ ప్రచార సామగ్రితోపాటు చీరలు, గొడుగులు, బొట్టుబిళ్లలు, టవళ్లు, టీ షర్టులు బయటపడిన వ్యవహారంలో అధికార యంత్రాంగం తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. ఓ గోదాము నుంచీ మరో గోదాముకు వాటిని తరలిస్తుండగా కొందరు ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టగా టీడీపీ వర్గీయులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు అధికారులు తనిఖీలు చేశారు. వాటిలో వైసీపీ ప్రచార సామగ్రితో పాటు చీరలు, గొడుగులు, బొట్టుబిల్లలు, టవళ్ళు, టీ షర్టులు తదితరాలు బయటపడ్డాయి. మంగళవారం రాత్రి తహసీల్దారు నాగేశ్వరరావు, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, సీఐలు మల్లికార్జున, సుబ్బరాయుడు వచ్చి గోదామును పరిశీలించారు. భారీఎత్తున వైసీపీ ప్రచార సామగ్రి ఉండటంతో ప్రాథమికంగా నమోదు చేసి సిబ్బందిని కాపలా ఉంచి రాత్రి 10.30 గంటలకు వెనుదిరిగారు. బుధవారం శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్ గోదాముల వద్దకు చేరుకుని ఆందోళన నిర్వహించగా జీఎస్టీ అధికారులు వచ్చి గోదాముల్లోని సామగ్రిని నమోదు చేశారు. అయితే, ఎన్నికల అధికారులు కాకుండా జీఎస్టీ అధికారులు రావడం పట్ల టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్‌లతో కలసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఎట్టకేలకు జిల్లా రెవెన్యూ అధికారిగోదాములు తెరిపించి తనిఖీ చేశారు. వాటిలో భారీగా వైసీపీ ప్రచార సామగ్రితోపాటు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి డైరీలు, స్టిక్కర్లు గుర్తించారు. మూడు గోదాముల్లోనూ 500 నుంచి 700 టన్నుల వరకూ వైసీపీ ప్రచార సామగ్రి ఉందని, దాని విలువ సుమారు రూ.40 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేశారు. గోదాముల్లో మొత్తం ప్రచార సామగ్రే ఉందని, దాన్ని సీజ్ చేసి బిల్లులు పరిశీలిస్తున్నామని శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి మీడియాకు చెప్పారు. వాచీలు, చీరలు తదితరాలనూ ప్రచార సామగ్రి కిందే నమోదు చేయడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, ప్రచార సామగ్రిపై దుష్ప్రచారం చేయడం తగదని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- బీజాపూర్ జిల్లాలోని బాసగూడ అడవుల్లో ఘటన
- ఇద్దరు మహిళలు సహా ఆరుగురు మావోయిస్టుల మృతి

చింతూరు/సాలూరు రూరల్/చర్ల, మార్చి 27: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బాసగూడ అడవుల్లో బుధవారం ఉదయం మావోయిస్టులు, పోలీసులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో పీఎల్‌జీఏ బాసగూడ ఏరియా 10వ ప్లాటూన్ డిప్యూటీ కమాండర్ పూనెం నగేశ్ సహా ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో పూనెం నగేశ్ భార్య సోనీతోపాటు మరో మహిళా మావోయిస్టు ఉన్నారు. రెండు రోజుల క్రితం బీజాపూర్ జిల్లా బాసగూడ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను మావోయిస్టులు హత్య చేశారు. ఈ ఘటనకు పాల్పడ్డ మావోయిస్టుల కోసం బుధవారం ఉదయం బాసగూడ అడవుల్లో డీఆర్‌జీ 229, కోబ్రా 205, 210, సీఆర్‌పీఎఫ్ 168 బలగాలు గాలింపు ప్రారంభించాయి. ఈ క్రమంలో బలగాలు బాసగూడలోని దక్షిణ వైపు ఉన్న చీపురుభట్టి, తాలిపేరు నది పరిసర ప్రాంతాలకు చేరుకోగానే మావోయిస్టులు, పోలీసులకు మధ్య కాల్పులు జరిగాయి. సుమారు రెండు గంటలపాటు జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతులను పూనెం నగేశ్‌తోపాటు (ఐదులక్షల రివార్డు), పీఎల్‌జీఏ బాసగూడ ఏరియా 10వ ప్లాటూన్ సభ్యుడు పూనెం ఐతు (రెండు లక్షల రివార్డు), ప్లాటూన్ సభ్యురాలు, నగేశ్ భార్య వెట్టి సోనీ(రెండు లక్షల రివార్డు), యాక్షన్ టీం కమాండర్ వికాష్, జేగెరు కొండ ఏరియా కమిటీ సభ్యుడు కోవాసి గంగి, (ఐదు లక్షల రివార్డు), మిలీషియా సెక్షన్ కమాండర్ సుప్పో మోకాగా గుర్తించినట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజన్ తెలిపారు. వీరిలో పూనెం నగేశ్, కోవాసి గంగిపై రూ.5 లక్షల చొప్పున రివార్డు, పూనెం ఐతు, వెట్టి సోనీపై రూ.2 లక్షల చొప్పున.. ఆరుగురిపై కలిపి రూ.14 లక్షల రివార్డు ఉన్నట్లు పేర్కొన్నారు.

మృతుల సంఖ్య పెరిగే అవకాశం..

ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసులు అంటున్నారు. ఘటనా స్థలం నుంచి మావోయిస్టులకు సంబంధించిన మందుగుండు సామగ్రి, వాకీటాకీలు, రెండు టిఫిన్ బాంబులు, కార్డెక్స్ వైర్లు, యూనిఫాం, విప్లవ సాహిత్య పుస్తకాలు, జిలెటిన్ స్టిక్స్, తుపాకులు, కిట్‌బ్యాగులు, ఇతర వస్తువులను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఎన్‌కౌంటర్ జరిగిన తీరును పరిశీలిస్తే.. మావోయిస్టులే కవ్వింపు చర్యలకు పాల్పడి ఆ ఉచ్చులో వారే ఇరుక్కున్నారని కొందరు సీనియర్ పోలీస్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. పోలీసు బలగాలు అప్రమత్తంగా ఉండకపోయి ఉంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చేదని చెబుతున్నారు. కాగా, వరుస ఎన్‌కౌంటర్లు మావోయిస్టు పార్టీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ ఏడాది పలు ఘటనల్లో ఇప్పటివరకు 37 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల 30న బీజాపూర్ జిల్లా బంద్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మావోయిస్టు పార్టీ పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి మోహన్ పేరుతో మంగళవారం లేఖ విడుదలైంది.



స్వాధీనం చేసుకున్న సామగ్రి

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

diksuchi@andhrajyothy.com

విజయవాడ ● గురువారం 28 మార్చి 2024

హైదరాబాద్ ఐఐటీలో పీజీ, పీహెచ్‌డీ



హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీహెచ్)- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీలో ఎంఏ, ఎంటెక్, ఆన్‌లైన్ ఎంటెక్, ఎం డిజైన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఎం.డిజైన్ ప్రోగ్రామ్ రెగ్యులర్, ఆన్‌లైన్ విధానాల్లో ఉంది. ఎమ్మెస్సీ మెడికల్ ఫిజిక్స్ ప్రోగ్రామ్‌ను బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్-రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో నిర్వహిస్తున్నారు. కోర్సు వ్యవధి మూడేళ్లు. పీహెచ్‌డీ ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఫెలోషిప్ సౌకర్యం ఉంది. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన మేరకు గేట్/సీడ్ వ్యాలిడ్ స్కోర్ లేదా అకడమిక్ ప్రతిభ, జేఆర్ఎఫ్ అర్హత ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి రాత పరీక్ష/ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు. టీచింగ్ అసిస్టెంట్‌షిప్, రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్ త్రూ ప్రాజెక్ట్, సెల్ఫ్ స్పాన్సర్డ్, గవర్నమెంట్ స్పాన్సర్డ్, ఆన్‌లైన్ ప్రోగ్రామ్ ఫర్ వర్కింగ్ ప్రొఫెషనల్స్ తదితర కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

రెగ్యులర్ ఎంటెక్ స్పెషలైజేషన్‌లు: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయో మెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, క్లయిమేట్ ఛేంజ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్, టెక్నో ఆంత్రప్రెన్యూర్‌షిప్, క్వాంటమ్ అండ్ సాలిడ్ స్టేట్ డివైసెస్, ఎనర్జీ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఈ-వేస్ట్ రిసోర్స్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, సస్టయినబుల్ ఇంజనీరింగ్

ఆన్‌లైన్ ఇంటర్ డిసిప్లినరీ ఎంటెక్ స్పెషలైజేషన్‌లు: ఇంటిగ్రేటెడ్ కంప్యూటేషనల్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రిక్ వెహికిల్ టెక్నాలజీ.

ఇంటర్ డిసిప్లినరీ ఎంటెక్/ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: అడిటివ్ మాన్యుఫాక్చరింగ్, మెడికల్ డిజైన్ ఇన్నోవేషన్, స్మార్ట్ మొబిలిటీ, ఆప్తాల్మిక్ ఇంజనీరింగ్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ అండ్ మైక్రో సిస్టమ్స్ ప్యాకేజింగ్, మెడికల్ ఫిజిక్స్

ఆన్‌లైన్ ఎంటెక్ స్పెషలైజేషన్‌లు: కంప్యూటేషనల్ మెకానిక్స్, కమ్యూనికేషన్స్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ సిస్టమ్స్, మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ, ఇండస్ట్రియల్ మెటలర్జీ, డేటా సైన్స్, హెరిటేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీ

ఎంఏ స్పెషలైజేషన్‌లు: డెవలప్‌మెంట్ స్టడీస్, హెల్త్ జెండర్ అండ్ సొసైటీ

అర్హత వివరాలు: ఎంఏ ప్రోగ్రామ్‌నకు కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎండిజైన్ ప్రోగ్రామ్‌నకు ఇంటర్ తరవాత కనీసం 55 శాతం మార్కులతో ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/డిజైన్/ఇంటీరియర్ డిజైన్ విభాగాల్లో నాలుగేళ్ల డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. సీడ్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. ప్రొఫెషనల్ డిప్లొమా ఇన్ డిజైన్(ఎన్ఐడీ/సీఈపీటీ), బీఎఫ్ఏ అభ్యర్థులూ అర్హులే. పదోతరగతి ఉత్తీర్ణత తరవాత అయిదేళ్ల జీడీ ఆర్ట్ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు, పీజీ(ఆర్ట్స్/సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్) ఉత్తీర్ణత తోపాటు ప్రొఫెషనల్ అనుభవం ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంటెక్ ప్రోగ్రామ్‌నకు సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ/ఎంబీబీఎస్/బీడీఎస్/బీఫార్మసీ/బీవీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(మేథ్స్/అప్లయిడ్ మేథ్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/మెటీరియల్ సైన్స్)/ ఎంసీఏ అభ్యర్థులూ అర్హులే. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి 9 కన్నా ఎక్కువ సీజీపీఏ; నిట్, ఐఐటీ, ఐఐఐటీ సంస్థల నుంచి 8 కన్నా ఎక్కువ సీజీపీఏతో బీఈ/బీటెక్/ఎంసీఏ/ఎమ్మెస్సీ పూర్తిచేసిన అభ్యర్థులను గేట్ స్కోర్‌నుంచి మినహాయించారు. వీరు పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు నేరుగా అప్లయ్ చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ మెడికల్ ఫిజిక్స్‌కు ప్రథమశ్రేణి మార్కులతో బీఎస్సీ(ఫిజిక్స్) ఉత్తీర్ణత తోపాటు జామ్ 2024 స్కోర్/ఇన్‌స్పైయిర్ స్కాలర్‌షిప్ అర్హత ఉండాలి.

పీహెచ్‌డీ

స్పెషలైజేషన్ విభాగాలు: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయో మెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, క్లయిమేట్ ఛేంజ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఇంజనీరింగ్ సైన్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, హెరిటేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, లిబరల్ ఆర్ట్స్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, సస్టయినబులిటీ

అర్హత: ఎంచుకొన్న విభాగాన్ని అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్/ఎండీ/ఎండీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంసీఏ/ఎమ్మెస్సీ/సంబంధిత మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్/బీడీఎస్/బీఈ/బీటెక్ అభ్యర్థులూ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిజైన్ విభాగానికి ఎం డిజైన్/ఎంఆర్క్/ఎంఫిల్/ఎంఎఫ్ఏ/ఎంఏ/ ఎమ్మెస్సీ/నిడ్ నుంచి పీజీ డిప్లొమా ఇన్ డిజైన్ పూర్తిచేసి ఉండాలి. గేట్/సీడ్/సీఎస్ఐఆర్ నెట్ జేఆర్ఎఫ్/యూజీసీ నెట్ జేఆర్ఎఫ్/డీబీటీ జేఆర్ఎఫ్/ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్/డీఎస్‌టీ-ఇన్‌స్పైయిర్ పరీక్షల్లో అర్హత పొందినవారికి, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు/ల్యాబొరేటరీల్లో పనిచేసే వారికి ప్రాధాన్యం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** పీజీ ప్రోగ్రామ్‌లకు ఏప్రిల్ 8; పీహెచ్‌డీకి ఏప్రిల్ 11
- **వెబ్‌సైట్:** iith.ac.in

సీడీఎఫ్‌డీలో రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ)- 'రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్-2'లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సులో డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్, మోడరన్ బయాలజీ సంబంధిత అంశాలపై రీసెర్చ్ వర్క్ ఉంటుంది. ఇది పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. అభ్యర్థులు కోర్సు పూర్తయ్యే వరకు క్యాంపస్‌లోనే ఉండాలి. షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వీడియో కాన్ఫరెన్స్ ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. కోర్సులో చేరినవారికి రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ)లో పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పిస్తారు.



రీసెర్చ్ విభాగాలు

- సెల్ అండ్ మాలిక్యులర్ బయాలజీ
- కంప్యూటేషనల్ బయాలజీ
- డిసీజ్ బయాలజీ
- జెనెటిక్స్
- మాలిక్యులర్ మైక్రో బయాలజీ
- ఇమ్యూనాలజీ

అర్హత వివరాలు: సైన్స్, టెక్నాలజీ, అగ్రికల్చర్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సెమిస్టర్ పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/ ఐసీఎంఆర్/ఇన్‌స్పైయిర్/జెస్ట్/యూజీసీ-ఆర్‌జీఎన్ఎఫ్ నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు అర్హత పొంది ఉండాలి. జేఆర్ఎఫ్ అర్హత లేని అభ్యర్థులను ఇంటర్వ్యూకి అనుమతించరు. ఐసీఎంఆర్ నుంచి రెండేళ్ల ఫండెడ్ ప్రాజెక్ట్ స్కీమ్ కింద జేఆర్ఎఫ్ పొందినవారు, బీటెక్(బయోటెక్నాలజీ) పూర్తిచేసి డీబీటీ జేఆర్ఎఫ్ నెట్ అర్హత ఉన్నవారు, డీబీటీ-2 కేటగిరీ కింద జేఆర్ఎఫ్ నెట్ రాసినవారు, సీఎస్ఐఆర్-యూజీసీ (నెట్) ద్వారా ఎల్ఎస్ అర్హత పొందినవారు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 24
- **ఇంటర్వ్యూకి ఎంపిక చేసిన అభ్యర్థుల షార్ట్ లిస్ట్ విడుదల:** మే 10
- **ఇంటర్వ్యూలు:** మే చివరి వారంలో
- **వెబ్‌సైట్:** www.cdfd.org.in



పేదవాడి విందు

ఒక ఊరిలో మల్లయ్య అనే పేదవాడు ఉండేవాడు. తను కూలి పని చేసుకుని బతికేవాడు. వాస్తవానికి తనకు మూడెకరాల పొలం ఉంది. పెట్టుబడి పెట్టే స్తోమత లేక ఆ పొలాన్ని అలా వదిలేసి కూలి పనులు చేసేవాడు. ఒకసారి మంచి వానలు పడ్డాయి. అప్పు చేసి విత్తులు వేశాడు. పంట కోతకు వచ్చిన సమయంలో భారీ వర్షాలతో నష్టపోయాడు. దీంతో మళ్లీ మల్లయ్యకు కూలి పనే దక్కింది.

మల్లయ్యకు ఓ స్నేహితుడు ఉండేవాడు. అతని పేరు రంగయ్య. తన మిత్రుడు అని చూడకుండా వెటకారంగా మాట్లాడేవాడు. స్నేహితుడి పేదరికాన్ని గుర్తు చేసేవాడు. దీంతో రంగయ్య తన స్నేహితుడే కాదని మల్లయ్య తీర్మానించుకున్నాడు. రాజు అనే ఓ ధనవంతుడు ఆ ఊరిలో ఉండేవారు. ఒక రోజు మాటల్లో 'రాజుగారు ఇంట్లో విందు తిన్నాను. ఎంత అద్భుతమో' అన్నాడు మల్లయ్యతో రంగయ్య. మల్లయ్య అవేమీ పట్టించుకోలేదు. రంగయ్య ఇదే విషయాన్ని ఊరంతా చాటింపు వేసినట్లు చెప్పుకున్నాడు. ఒక రోజు మళ్లీ మల్లయ్యతో చెప్పిందే చెప్పాడు. 'అదెంత పని. ఏదో గొప్పగా చెబుతున్నావు' అన్నాడు మల్లయ్య. రంగయ్య కోప్పడ్డాడు. కోపంతో ఊగిపోతే.. 'నీ చేతనయితే రాజుగారితో కలసి భోజనం చేయి' అన్నాడు. 'అదెంత పని' అన్నాడు మల్లయ్య. 'ముందు చూపించవోయ్' అన్నాడు. వెంటనే మల్లయ్య ఇలా అన్నాడు.. 'ఒకవేళ రాజుగారితో కలసి భోజనం చేస్తే ఏమి చేస్తావు?' అన్నాడు. వెంటనే 'నీకు కాడెద్దులు తీయిస్తా' అన్నాడు రంగయ్య. అంతటితో ఊరుకోకుండా 'నువ్వు ఓడిపోతే నీ మూడెకరాల భూమి నాకు రాయించు' అన్నాడు. ఇద్దరూ సవాల్ విసురుకున్నారు.

ఒకరోజు మల్లయ్య రాజుగారి దగ్గరకు వెళ్లాడు. అసలే రాజుగారు మంచివారు, భోళాశంకరుడు. అయితే కఠినంగా ఉండేవాడు. పేదవాళ్లంటే అతనికి చిరాకు. మల్లయ్య కొత్తబట్టలతో అక్కడికి వెళ్లాడు. రాజుగారి దగ్గర ఉండే సహాయకుడు వచ్చి మల్లయ్యను లోపలికి తీసుకెళ్లాడు. 'అయ్యా.. మీతో రహస్యంగా మాట్లాడాలి' అన్నాడు మల్లయ్య 'ఇది భోజనం వేళ మళ్లీ చూద్దాం' అన్నాడు రాజుగారు. 'తక్షణమే ఓ రహస్యం చెప్పాలి' అన్నాడు. రాజుగారు లోపలకు రమ్మన్నారు. 'ఏమీ లేదు.. రాజుగారు! కడ




వంత బంగారం ముద్ద, కుండలోని వజ్రాలెంత ధర చేస్తాయి?' అనడిగాడు. రాజుగారు 'ఇలా లోపలకు వచ్చేయి. భోజనం చేసిపో' అన్నాడు. ధనవంతుడైన ఆ రాజుగారు ఇలా పిలుస్తాడని కల్లో కూడా అనుకోలేదు మల్లయ్య పక్కన ఉండేవాళ్లు ఈ ధనవంతుడు ఇతనితో భోజనం చేయడమా? అనుకున్నారు. ఆ వార్త ఊరంతా వ్యాపించింది. ఇద్దరు కలసి విందు భోజనం చేశారు. ఆ తర్వాత ఆ ధనవంతుడు వాటి దగ్గరకు తీసుకెళ్లమన్నాడు. లేకపోతే నువ్వే తెచ్చి చూపించు అన్నాడు. 'నేను కడవంత బంగారం, కుండంత వజ్రాలు ఎంత చేస్తాయి?' అనడిగాను అన్నాడు మల్లయ్య. ఆ ధనవంతుడు కోప్పడ్డాడు. 'బుద్ధిహీనుడా' అంటూ తిట్టాడు. 'నాకు రెండు ఎద్దులు ఇచ్చే నా రంగయ్యనా? లేక విందు భోజనం చేసిన మీరా?' అనడిగారు. మల్లయ్య ఇంటికి వెళ్లిపోయాడు.

రంగయ్య ఇవ్వాల్సిన జోడెద్దులను ఇచ్చాడు. అలా మల్లయ్య చేసిన విందుకు ప్రతిఫలం దక్కింది. పేదవాడైనా తెలివైనవాడు కావటం వల్ల తన మిత్రుడి అతి చేష్టలకు కళ్లెం వేశాడు.


8 తేడాలను గుర్తించండి



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



అండర్ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్



ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ)- అండర్ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(యూజీఏటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిద్వారా పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ, బీబీఏ, బీహెచ్ఎం, బీసీఏ, బీకాం(ఈ-కామర్స్), బీఎస్సీ(ఐటీ), బీఎఫ్‌టీ, బీఐటీఎం ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు/ప్రస్తుతం పరీక్షలు రాసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

యూజీఏటీ 2024 వివరాలు: దీనిని పీబీటీ(పేపర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 40, న్యూమరికల్ అండ్ డేటా అనాలిసిస్ నుంచి 30, రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్ నుంచి 30, జనరల్ నాలెడ్జ్ నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. బీహెచ్ఎం కోర్సుకు నిర్వహించే ఎగ్జామ్‌లో మాత్రం పైవాటితోపాటు సర్వీస్ ఆప్టిట్యూడ్ నుంచి 25, సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. వీటికి అదనంగా గంట సమయం ఇస్తారు. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు ఉంటుంది. రుణాత్మక మార్కులు ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు:** రూ.750
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** జూన్ 9న
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 11 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **యూజీఏటీ 2024 తేదీ:** జూన్ 16
- **వెబ్‌సైట్:** aima.in

ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఇంటర్ ప్రవేశాలు

అమరావతిలోని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కార్యాలయం-ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 163 మోడల్ స్కూల్స్‌లో అకడమిక్ మెరిట్, రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లు ఎంచుకోవచ్చు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది, బోధన ఉచితం. ప్రభుత్వ/గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి సమాచారం కోసం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్/జిల్లా విద్యాశాఖాధికారి/మండల విద్యాశాఖాధికారిని సంప్రదించాలి.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 22
- **దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 23
- **పాఠశాల స్థాయిలో ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల:** మే 24
- **డీఈఓ ఎంపిక చేసిన విద్యార్థుల జాబితా విడుదల:** మే 25
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్:** మే 27
- **తరగతుల ప్రారంభం:** జూన్ 1 నుంచి
- **వెబ్‌సైట్:** https://apms.apcfss.in

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో అప్రెంటిస్‌లు

బిలాస్‌పూర్ డివిజన్‌లోని సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో ఒప్పంద ప్రాతిపదికన **733** అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

ట్రేడులు: కార్పెంటర్, సీఓపీఏ, డ్రాఫ్ట్స్‌మన్(సివిల్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రికల్(మెకానికల్), ఫిట్టర్, మెషినిస్ట్, పెయింటర్, ప్లంబర్, మెకానికల్(ఆర్ఏసీ), ఎస్ఎండబ్ల్యూ, స్టెనో(ఇంగ్లీష్), స్టెనో(హిందీ), డీజిల్ మెకానిక్, టర్నర్ వెల్డర్, వైర్‌మన్, కెమికల్ ల్యాబొరేటరీ అసిస్టెంట్, డిజిటల్ ఫొటోగ్రాఫర్.

అర్హత: పదో తరగతి, పన్నెండో తరగతి కన్నా తక్కువ లేదా సమానమైన విద్యార్హత. తదితర ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణత ఉండాలి.

వయసు: ఏప్రిల్ 12 వరకు 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: టెన్త్, ఇంటర్ మార్కుల మెరిట్‌లిస్ట్ ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ **దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 12

వెబ్‌సైట్: https://secr.indianrailways.gov.in/

ఐఐటీ తిరుపతిలో నాన్ టీచింగ్ పోస్టులు

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. స్టూడెంట్ కౌన్సెలర్: 1 పోస్టు
2. హిందీ ట్రాన్స్‌లేటర్: 1 పోస్టు
3. జూనియర్ నర్సింగ్ ఆఫీసర్: 1 పోస్టు
4. జూనియర్ అసిస్టెంట్: 3 పోస్టులు
5. జూనియర్ టెక్నీషియన్: 2 పోస్టులు

అర్హత: సంబంధిత పోస్టును అనుసరించి ఇంటర్, ఐటీఐ, డిప్లొమా లేదా తత్సమానం, డిగ్రీ, బీఈ, బీటెక్(మెకానికల్ ఇంజనీరింగ్), పీజీ, జనరల్ నర్సింగ్, విద్యార్హతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: స్టూడెంట్ కౌన్సెలర్ పోస్టుకు రూ.56,100 నుంచి రూ.1,77,550. హిందీ ట్రాన్స్‌లేటర్/జూనియర్ నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు రూ.35,400 నుంచి రూ.1,12,400. జూనియర్ అసిస్టెంట్/జూనియర్ టెక్నీషియన్ పోస్టులకు రూ.25,500 నుంచి రూ.81,100.

ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: గ్రూప్-1 పోస్టులకు 500. గ్రూప్-బి పోస్టులకు రూ.300. గ్రూప్-సి పోస్టులకు రూ.200.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 11

వెబ్‌సైట్: https://www.iittp.ac.in/

భారతీయ ప్రౌద్యోగికీ సంస్థాన తిరుపతి
IIT TIRUPATI

జాబ్ కార్నర్

మెడికల్ స్పెషలిస్ట్‌లు

బీసీసీఎల్‌లో

కోల్‌ఇండియా లిమిటెడ్‌కు చెందిన జార్ఖండ్‌లోని భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్(బీసీసీఎల్) **37** పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

పోస్టులు

1. సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్(ఈ4)/ మెడికల్ స్పెషలిస్ట్(ఈ3)
2. సీనియర్ మెడికల్ ఆఫీసర్(ఈ3)

విభాగాలు: సర్జన్, జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్ అండ్ అబ్‌స్టెట్రీషియన్, ఆర్థోపెడిషియన్, పీడియాట్రిషియన్, సైకియాట్రిస్ట్, పాథాలజిస్ట్, డెర్మటాలజిస్ట్, పల్మాలజిస్ట్/ చెస్ట్ స్పెషలిస్ట్, ఆప్తాల్మాలజిస్ట్, ఎమర్జెన్సీ మెడిసిన్, రేడియాలజిస్ట్.

అర్హత: సంబంధిత విభాగాల్లో ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్ పోసుకు 42 ఏళ్లు, మెడికల్ స్పెషలిస్ట్/ సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు 35 ఏళ్లు మించరాదు.

జీతం: సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్ పోస్టుకు రూ.70,000 - 2,00,000. మెడికల్ స్పెషలిస్ట్/ సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టుకు రూ.60,000 - 1,80,000

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా

చిరునామా: డిప్యూటీ జీఎం/ హెచ్ఓడీ(ఈఈ), భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్, ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిష్‌మెంట్ దగ్గర, కల్యాణ్‌భవన్, కల్యాణ్‌నగర్, ధన్‌బాద్, జార్ఖండ్.

చివరి తేదీ: ఏప్రిల్ 11 **వెబ్‌సైట్:** www.bcclweb.in/

ఎన్‌సీఎల్‌లో

ప్రభుత్వరంగ సంస్థకు చెందిన నేషనల్ కోల్ ఇండియా లిమిటెడ్ **34** పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

పోస్టులు

1. సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్
2. మెడికల్ స్పెషలిస్ట్
3. సీనియర్ మెడికల్ ఆఫీసర్

విభాగాలు: సర్జన్, జనరల్ ఫిజీషియన్/ మెడిసిన్, జీ అండ్ ఓ, అనస్థీసిస్ట్, పీడియాట్రిషియన్, సైకియాట్రిస్ట్, పాథాలజీ, డెర్మటాలజీ, పల్మాలజిస్ట్, చెస్ట్ స్పెషలిస్ట్, ఆప్తాల్మాలజిస్ట్, ఈఎన్‌టీ, రేడియాలజిస్ట్, జీడీఎంఓ, డెంటిస్ట్.

జీతం: సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్ పోస్టుకు రూ.70,000 - 2,00,000. మెడికల్ స్పెషలిస్ట్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు రూ.60,000 - 1,80,000

అర్హత: జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ అండ్ పల్మనరీ మెడిసిన్. ఎంబీబీఎస్, పీజీ, బీడీఎస్ ఉత్తీర్ణత.

వయసు: పోస్టును అనుసరించి 2024 జనవరి 31 వరకు 35-42 ఏళ్లు మించరాదు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 11

స్పీడ్‌పోస్ట్ ద్వారా దరఖాస్తు పంపాల్సిన చిరునామా: ఆఫీస్ ఆఫ్ డిప్యూటీ జనరల్ మేనేజర్, రిక్రూట్‌మెంట్ డిపార్ట్‌మెంట్, ఎన్‌సీఎల్ హెచ్‌క్యూ, సంగ్రౌలీ(మధ్యప్రదేశ్).

వెబ్‌సైట్: https://www.nclcil.in/

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీలు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ దేశవ్యాప్తంగా ఈసీఐఎల్ ప్రాజెక్టు పనుల్లో 30 గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఏప్రిల్ 13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

విభాగాల వారీగా ఖాళీలు: ఈసీఈ 5, ఈఈఈ 7, మెకానికల్ 13, సీఎస్ఈ 5.

అర్హత: సంబంధిత విభాగంలో మొదటిశ్రేణిలో ఇంజనీరింగ్ డిగ్రీ/ పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 2024 ఏప్రిల్ 13 నాటికి 27 సంవత్సరాలు మించకూడదు.

జీతం: నెలకు రూ.40,000 - 1,40,000

ఎంపిక: రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తు రుసుము: యూఆర్/ ఈడబ్ల్యూఎస్/ ఓబీసీ అభ్యర్థులకు రూ.1,000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ: ఏప్రిల్ 13

వెబ్‌సైట్: https://www.ecil.co.in/

డైలీ సుడోకు - 266

		3		5		2	6	
5		4	3			9		
9			2					
	9		8			6		3
	4						1	
3		5			7		9	
					2			7
		7			9	1		6
	3	2		1		8		

సుడోకు - 265 సమాధానం

3	1	6	5	8	7	2	4	9
7	5	8	9	2	4	6	3	1
9	4	2	6	1	3	8	7	5
5	7	3	4	6	8	9	1	2
1	6	4	7	9	2	5	8	3
8	2	9	1	3	5	7	6	4
4	9	7	8	5	1	3	2	6
2	8	5	3	4	6	1	9	7
6	3	1	2	7	9	4	5	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.